24-2Pg1exHMNWJQE.qxd:24-2Pg1exHMNWJQE.qxd 01/01/01 10:11 AM Page 1

WWW.VAARTHA.COM
epaper.vaartha.com
fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఒంగోలు,
24-2-2025 సోమవారం
సంపుటి: 31 సంచిక: 23
పేజీలు: 12 వెల: 6.50

# నేటినుంచి బడ్జెట్ అసెంబ్లీ




## ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్ నజీర్
## మధ్యాహ్నం బిఎసి సమావేశం
## అసెంబ్లీ పరిసరాల్లో ప్రత్యేక నిఘా
## హాజరుకానున్న మాజీ సిఎం జగన్

**విజయవాడ.ఫిబ్రవరి 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నేడు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. సమావేశాల ప్రారంభం రోజునే రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఉభయసభలును ఉదేశించి ప్రసంగిస్తారు. అనంతరం సభ మరుసటి రోజుకు వాయిదా పడుతుంది. ఈ క్రమంలోనే మధ్యాహ్నం 12 గంటలకు బిఎసి సమావేశం జరుగుతుంది. సభ ఎన్ని రోజులు ఏఏ బిల్లులు ప్రవేశపెడతారనే అంశంపై బిఎసిలో చర్చ జరుగుతుంది. సోమవారం నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు భారీ భద్రత కల్పించనున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులను మొహరించడంతో పాటు అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శాసనసభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ బులిటెన్ విడుదల చేశారు. నాలుగు ప్రవేశ ద్వారాలను ఏర్పాటుచేస్తున్నట్టు ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నిర్ధేశించిన వ్యక్తులు తప్ప ఇతరులు ఆ గేట్ల నుండి లోనికి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాస్‌లు లేని వారిని కూడా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఒకటో గేట్ నుంచి కేవలం ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. రెండో గేట్ నుంచి మంత్రులకు, నాలుగో ద్వారం నుంచి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రవేశం ఉంటుంది. మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, ముఖ్యమంత్రి పేషీల వద్ద కారిడార్లలోలో ఎవరిని అనుతించేది లేదని పేర్కొన్నారు. సభ్యులు, మంత్రులకు ఉన్న గన్‌మెన్లు కూడా గన్‌మెన్ పాయింట్ ద్వారా ముందుకు అనుమతించకుండా ఆంక్షలు విధించారు. శాఖల నుంచి వచ్చే సిబ్బంది కూడా ఎక్కడ పడితే >>2



# అదరహో భారత్!

## దుబాయ్‌లో పాక్ దుమ్ము దులిపిన భారత్ జట్టు
## 6 వికెట్ల తేడాతో అఖండ విజయం
## ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండో గెలుపు
## వన్డేల్లో 14 వేల పరుగుల మైలురాయిదాటి 51వ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ
## మరో అరుదైన రికార్డు సృష్టించిన విరాట్
## ట్రోఫీ నుంచి వైదొలిగిన పాక్
## దేశవ్యాప్తంగా అభిమానుల సంబరాలు




భారత్ ఘనవిజయంతో దుబాయ్ స్టేడియంలో అభిమానుల సంబరాలు

**దుబాయి, ఫిబ్రవరి 23:** పాకిస్థాన్‌తో మ్యాచ్ అనుకుంటేనే చెలరేగిపోతున్న భారత స్టార్ బ్యాటర్ రన్‌మెషీన్ విరాట్‌కోహ్లీ మరోసారి తన సత్తా చూపించాడు. అంతా తనను రన్‌మెషిన్, మ్యాచ్ విన్నర్ అని ఎందుకు అంటారో నిరూపించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకోవాలంటే గెలవాల్సిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. సెంచరీతో కదంతొక్కి జట్టును గెలిపించాడు. ఆరు >>2

# గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం

**విజయవాడ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలపై నిన్నంతా సందిగ్ద వాతావరణం నెలకుంది. ఈ పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వం పబ్లిక్ సర్వీసు కమీషన్‌కు లేఖరాసింది. సిఎం చంద్రబాబు సైతం పరీక్షలు వాయిదాకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎపిపిఎస్సీ మాత్రం ఆదివారం పరీక్షలు యథాతథంగా నిర్వహిస్తామని వెల్లడించింది. ఈ క్రమంలో నేడుఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మెయిన్స్ తొలి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు రెండో పేపర్ నిర్వహించారు. 92250 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. పలుచోట్ల పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. అధికారులు, పోలీసులువారిని వెనక్కి పంపించారు. కొన్ని చోట్ల పరీక్షలు రద్దు చేయాలంటూ ఆందోళన చేసారు. తిరుపతిలో ఓ నవ వధువు పచ్చబట్టలతోనే హాజరయింది.

# ఇక వేగంగా ఓఆర్ఆర్ పనులు



## కాజ నుంచి నందివెలుగుదాకా 17 కి.మీ ఆరువరసల అనుసంధాన రహదారి
## 23 మండలాలు, 121 గ్రామాల మీదుగా రింగ్‌రోడ్ నిర్మాణం

**విజయవాడ, ఫిబ్రవరి23, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇక వేగవంతంగా చేపట్టాలని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి అంతర వలయ రహదారి పథకానికి రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన 189.4 కిలోమీటర్ల 6 వరుసల యాక్సెస్ కంట్రోల్ ఎలైన్‌మెంట్‌కు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ప్రాథమికంగా ఆమోదించిందని తెలిపారు. సిఆర్‌డిఎ అధికారులతో సిఎం చంద్రబాబు అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుతో సహా పలు నిర్మాణాలపై కీలకంగా సమీక్ష నిర్వహించారు. సిఆర్‌డిఎ అధికారులతో ఆయన మౌఖికంగాను, వర్చువల్‌గాను పలు అంశాలపై మాట్లాడారు, కీలకంగా సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఓఆర్‌ఆర్ ఎలైన్‌మెంట్‌పై ఎన్‌హెచ్ఏఐ, సిఆర్‌డిఎ, ఆర్ అండ్ బి అధికారులతో చంద్రబాబు సమీక్షించారు. ఓఆర్‌ఆర్‌కు దగ్గరగా ప్రతిపాదిత విజయవాడ తూర్పు బైపాస్ వెళ్తుండడంతో ఆ నిర్మాణం అనవసరమని అభిప్రాయపడింది. ఓఆర్‌ఆర్‌లో 4చోట్ల స్వల్ప మార్పులు చేయాలని సూచించింది. అమరావతికి రింగ్ రోడ్డు నిర్మాణంలో కీలక నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

ఈ క్రమంలోనే ఓఆర్‌ఆర్ వెళ్లే ఐదు జిల్లాల్లో భూసేకరణకు ప్రభుత్వం అధికారులను నియమించింది. 23 మండలాలు, 121 గ్రామాల మీదుగా 189.9 కిలోమీటర్ల మేర ఈ రింగ్‌రోడ్డు నిర్మాణం కానుంది. ఈ మండలాలు, గ్రామాల మీదుగా రాష్ట్రంలో మధ్య కోస్తా ప్రాంత సమగ్ర అభివృద్ధికి దోహదం చేసే అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. 189.9 కిలోమీటర్ల ఓఆర్‌ఆర్‌కు ఇటీవల ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇదే కమిటీ విజయవాడ తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. దానికి ప్రత్యామ్నాయంగా రెండు లింక్ రోడ్లను నిర్మించేందుకు అవకాశం కల్పించింది. హైదరాబాద్‌లో గచ్చిబౌలి వైపు నుంచి ఓఆర్‌ఆర్‌కి అనుసంధానం ఉన్నట్లే, చెన్నై కోల్‌కతా జాతీయ రహదారిలో విజయవాడ బైపాస్ మొదలయ్యే కాజ నుంచి తెనాలి సమీపంలోని నందివెలుగు వరకు 17 కిలోమీటర్ల మేర ఆరు వరుసల అనుసంధాన రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం మూడు ఎలైన్‌మెంట్లను ఎన్‌హెచ్ఏఐ సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది.

గుంటూరు బైపాస్‌లో బుడంపాడు నుంచి నారాకోడూరు వద్ద ఓఆర్‌ఆర్ వరకు నాలుగు వరుసలుగా రహదారిని విస్తరిస్తారు. దీనికి మూడు ఎలైన్‌మెంట్లు సిద్ధం చేశారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) నుంచి వెళ్లిన ఓఆర్‌ఆర్ ఎలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పుచేర్పులతో కూడిన ప్రతిపాదన, రెండు లింక్‌రోడ్ల ఎలైన్‌మెంట్‌ల ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపాక, వాటిని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. అక్కడ తుది ఆమోదం తెలుపుతారు. ఓఆర్‌ఆర్ భూసేకరణకు సర్వే నంబర్ల వారీగా నోటిఫికేషన్ జారీచేస్తారు. 21 రోజులు గడువిచ్చి అభ్యంతరాలు తెలిపిన వారితో జెసిలు సమావేశాలు నిర్వహించి వారి వినతులు వింటారు. వాటిని జెసి, ఎన్‌హెచ్ఏఐ స్థాయిలో పరిష్కరిస్తారు. అదే టైమ్‌లో క్షేత్ర స్థాయిలో జాయింట్ మెజర్‌మెంట్ సర్వే చేసి పెగ్ మార్కింగ్ వేస్తారు. జేసీ వద్ద అభ్యంతరాలన్నీ పరిష్కారమయ్యాక 3డీ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అంటే ఆయా సర్వే నంబర్లలో భూములు కేంద్రం అధీనంలోకి వెళ్లినట్లవుతుంది.

ఆ తర్వాత 3జి3 నోటిఫికేషన్ ఇస్తారు. పరిహారం ఇచ్చేందుకు అవార్డు జారీచేస్తారు. ఏ సర్వే నంబరులో ఎంత భూమి ఉంది, ఎన్ని నిర్మాణాలున్నాయి, వాటి యజమాని ఎవరనేది అందులో ఉంటుంది. తరువాత భూసేకరణ నిధుల కోసం ఆ వివరాలు ఎన్‌హెచ్ఏఐకి పంపిస్తారు. ఆ సొమ్మును ఎన్‌హెచ్ఏఐఅందజేస్తే భూమికి >>2



# ప్రజల గొంతును అసెంబ్లీలో వినిపిద్దాం

## జనసేన ఎల్పీ సమావేశంలో డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,ఫిబ్రవరి23,ప్రభాతవార్తప్రతినిధి:** మనం ఎప్పుడు ప్రజాపక్షమే,వారి సమస్యలను, వారి సంక్షేమ నిర్దేశిత అంశాలను మాత్రమే శాసనసభలో మనవాణి కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మనం ప్రభుత్వంలో అంతర్భాగంగా ఉన్నాం,,ప్రజలు ఏం కోరుకుంటున్నారో శాసనసభలో మనం ప్రస్తావించాలన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జనసేన పార్టీ సామాన్యుడి గొంతుగా >>2

# అమెరికా సంస్థలతో రైతు సాధికార సంస్థ ఒప్పందం

**విజయవాడ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి వ్యవసాయానికి నిధుల సమీకరణ, మౌలిక వసతుల కల్పన, మార్కెట్ విస్తరణ, పరిశోధన సాంకేతిక సహకారం అందించడానికి అమెరికాకు చెందిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ప్రొడ్యూసర్స్ ట్రస్టులతో రైతు సాధికార సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. విజయవాడలోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ తెలిపిన సమాచారాన్ని అనుసరించి ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాన్ని 10 లక్షల ఎకరాల నుంచి 60 లక్షల ఎకరాలకు విస్తరించడమే దీని ప్రధాన లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. రైతులకు సాధికారతను సమకూర్చడంతో పాటు ప్రకృతి వ్యవ >>2



ఆదివారం స్పీకరు అయ్యన్నపాత్రుడు డిప్యూటీ స్పీకర్, సిఎస్, డిజిపితో సమీక్షిస్తున్న దృశ్యం

# అసెంబ్లీ భద్రతకు అత్యంత ప్రాధాన్యం

## సభ్యులందరు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్న స్పీకర్

**విజయవాడ, ఫిబ్రవరి 23,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీ సమావేశాల నిర్వహణ సందర్భంగా తీసుకున్న నియమనిబంధనల అమలులో అందరుసహకరించాలని శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్న పాత్రుడు విజ్ఞప్తి చేసారు. ఈ విషయంలో శాసనసభా ప్రాంగణంలో పూర్తిస్థాయి నిఘా ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 47వ మండలి సమావేశం, 16వ శాసనసభ మూడవ సమావేశ ఏర్పాట్లకు సంబంధించి ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఎపి >>2

# ఎఐతో మున్ముందుకు..



## • భారత్‌ను ప్రశంసిస్తున్న ప్రపంచం • మన్ కి బాత్‌లో తెలంగాణ ఉపాధ్యాయుని ప్రశంసించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** కృత్రిమమేధ వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని, ఈ సాంకేతికతను వినియోగించుకుని దేశాన్ని మరింతముందుకు తీసుకెళ్లాలని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీబాత్‌లో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ వినియోగంపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కైలాష్ అనే ఉపాధ్యాయుడు కృత్రిమ మేధ ఉపయోగించి ఒక పాటను కూర్పుచేసి తమకు ఎంతో సాయం చేసాడని అన్నారు. అంతరిక్షరంగంలో ఏటా పురోగతిసాధిస్తున్నామన్నారు. ఇస్రో 100వ రాకెట్‌ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేయడం దేశానికే గర్వకారణం అని మోడీ కొనియాడారు. అంతరిక్ష శాస్త్ర సరిహద్దులను అధిగమించాలనే దేశ బలమైన సంకల్పానికి ఇదే నిదర్శనమాన్నరు. గడచిన పదేళ్లలో సుమారు 460 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించామని అంతరిక్షరంగంలో ఏటా >>2

# ధరల పర్యవేక్షణ కమిటీ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్

**విజయవాడ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ధరల పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ బదులుగా జాయింట్ కలెక్టర్ వ్యవహరించబోతున్నారు. జిల్లా వినియోగదారుల సంరక్షణ కౌన్సిల్ జిల్లా విజిలెన్స్ కమిటీలకు కూడా కలెక్టర్లకు బదులుగా జెసిలకు చైర్మన్ బాధ్యతలు అప్పగించేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భూ సేకరణ పర్యవేక్షణ బాధ్యతలను జెసిల నుంచి ఆయా ప్రాంతాల ఆర్డీఓ/సబ్ కలెక్టర్లకు అప్పగించాలని ప్రతిపాదించారు. పరిపాలన విషయాల్లో పని ఒత్తిడి తగ్గించేందుకు జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లకు ఉన్న అధికారాలను వికేంద్రీకరణ చేయాల్సిన అవసరం ఉందన్న ఉద్దేశంతో శాఖలవారీగా సేకరించిన సమా >>2

# ఉక్రెయిన్‌పై మళ్లీ నిప్పులు చిమ్మిన రష్యా

## ఒకేసారి 267 డ్రోన్‌లతో దాడి, సగానికిపైగా కూల్చేశామన్న జెలెన్‌స్కీ

**కీవ్, ఫిబ్రవరి 23:** ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించి మూడేళ్లు అవుతోంది. ఈక్రమంలో ఉక్రెయిన్ వ్యాప్తంగా పుతిన్‌సేనలు మరోసారి భీకర దాడులకు తెగబడ్డాయి. శతృదేశం ఏకంగా 267 డ్రోన్లు ప్రయోగించినట్లు కీవ్ ఆరోపించింది. యుద్ధం మొదలు ఒకేసారి ఈస్థాయిలోడ్రోన్లతో దాడులకు పాల్పడటం ఇదే మొదటిసారని ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్ ప్రతినిధియూరీ ఇగ్నాత్ తెలిపారు. వాటిలో సగానికిపైగా తాము కూల్చేసామని అన్నారు. గతవారం వ్యవదిలో 1150 డ్రోన్లు, 1400కుపైగా గైడెడ్ ఏరియల్‌బాంబులు 35 క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా రక్షణశాఖసైతం తమ దేశంలోకి క్యీవ్ సేనలు 20 డ్రోన్లను ప్రయోగించిందని వాటినినాశనం చేసినట్లు తెలిపింది. మరోవైపు డిఫెండర్ ఆఫ్‌ది ఫాదర్‌ల్యాండ్‌డే పురస్కరించుకుని రష్యా అధినేత పుతిన్ సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. యుద్ధంలోపోరాటపటిమ చూపించిన సైనిఉకలు పతకాలు >>2



టన్నెల్‌లోకి వెళ్తున్న రెస్క్యూ, పోలీసు సిబ్బంది

## సహాయక సామాగ్రితో సొరంగంలోకి ఎన్‌డిఆర్ఎఫ్, సైనిక బృందాలు
## ఇంకా దొరకని ఆ 8 మంది ఆచూకీ
## నిరంతరంగా నీరు, బురద, మట్టి తోడే చర్యలు

# టన్నెల్‌లో.. టెన్షన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్ కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి (శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ) సొరంగం వద్ద ఉత్కంఠ నెలకొన్నది. ఎప్పుడు ఏం జరుగుతుందో అని కార్మికులు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం జరిగిన టన్నల్ ప్రమాదంతో రాష్ట్రమంతా ఉలిక్కిపడిన సంగతి తెలిసిందే. టన్నెల్లో చిక్కుకున్న ఎనిమిది మందిలో ఇద్దరు ఇంజనీర్లు, 6 మంది కార్మికులు ఉండగా వారిని సురక్షితంగా కాపాడేందుకు నిరంతరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అదే ప్రమాద సమయంలో మొత్తం 54 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లగా 46 మంది పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకోగా ఇద్దరు ఇంజనీర్లు ఆరు మంది కార్మికులు టన్నెల్‌లోనే చిక్కుకుపోయారు. ఎన్డీఆర్ఎఫ్, సైనిక బృందాలతో కలిసి సొరంగంలోనికి వెళ్లిన మంత్రి జూపల్లి టన్నెల్‌ల్లో చిక్కుకున్న ఎనిమిది మంది సిబ్బందిని రక్షించేందుకు ఆర్మీ >>2



ఆదివారం న్యూఢిల్లీలో అఖిలభారత జాతీయ విద్యాసమాఖ్య ఉపాధ్యాయులతో సమావేశమైన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

# ఎఐతో ముమ్ముందుకు..

>> పురోగతి సాధిస్తున్నామన్నారు. చంద్రయాన్ విజయం దేశానికి ఎంతో గర్వకారణం అని తెలిపారు. అంతరిక్ష రంగంపై యువతకూడా ఆసక్తిచూపిస్తోందని గుర్తుచేసారు. ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరగడం అనేది ఇటీవలికాలంలోసాధించినవిజయాల్లో ఒకటి అన్నారు. ఎఐ సదస్సులో పాల్గొనాలని ఫ్రాన్స్‌కు వెళ్లాని కృత్రిమమేధ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించింది. తాజాగా తెలంగాణ ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ గిరిజన భాషలను పరిరక్షించడంలో మాకు సాయంచేసారు. ఎఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో ఒక పాటను కంపోజ్‌చేసారని మోదీ ప్రశంసించారు. అంతరిక్షం లేదా ఎఐ అయినా భాగస్వామ్యం పెరుగుతోందని ప్రధాని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారిజీవితాల్లో స్ఫూర్తినింపేందుకు ఒకరోజుతన సోషల్‌మీడియా ఖాతాను వారికే అంకితంచేస్తామన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రగురించి ఆయన కొనియాడారు.

# అదరహో భారత్!

>> విక్టరీ తేడాతో భారత్ పాకిస్తాన్‌జట్టుపై ఘనవిజయం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్తాన్ టోర్నీనుంచి నిష్క్రమించేలా కోహ్లీ ఆటను చూపించాడు. విరాట్‌సెంచరీచేయడంతో పాక్ నిర్దేశించిన 242 పరుగుల లక్ష్యాన్ని భారత్ 42.3 ఓవర్లలో ఛేదించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌చేసిన పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయింది. పాకిస్తాన్ బ్యాటర్లలో సౌద్‌షకీల్ 76 బంతుల్లో 62 పరుగులుచేసి ఒక్కడే టాప్‌స్కోరరుగా నిలిచాడు. మహ్మద్ రిజ్వాన్ 46 పరుగులుచేసాడు. 77 బంతుల్లో మూడుఫోర్లుసాధించాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెల్కొంది. ఓపెనర్లు ఇమామ్ ఉల్ హక్ 10, బాబర్ అజామ్ 23 పరుగులుచేసారు. సల్మాన్ అఘా 19, ఖుష్‌దిల్‌షా 38 పరుగులుచేసారు. భారత బౌలర్లలో కుల్‌దీప్‌యాదవ్ అత్యధికంగా 3 వికెట్లు తీయగా హార్దిక్‌పాండ్యా రెండు వికెట్లు హర్షిత్‌రాణా, అక్షర్‌పటేల్,రవీంద్రజడేజాలు ఒక్కో వికెట్‌తీస్తూ పడగొట్టారు. ఓమోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ధాటిగా బ్యాటింగ్‌చేసింది. పాకిస్తాన్ బౌలింగ్‌ను చెల్లాచెదురుచేస్తూ టీమిండియా బ్యాటర్లు చెలరేగిపోయారు. శుభ్‌మన్‌గిల్ 46 పరుగులతో బోణీచేయగా తర్వాత కోహ్లీ బాధ్యతలు స్వీకరించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 82వ సెంచరీని నమోదుచేసాడు జట్టువిజయానికి రెండుపరుగులు అవసరమైన దశలో ఫోర్ కొట్టి తనసెంచరీని మ్యాచ్‌ను పూర్తిచేసాడు. శ్రేయస్ అయ్యర్ 56 పరుగులుచేసి తన సత్తాచూపించాడు. ఈ మ్యాచ్ విజయంతో టీమిండియా ఛాంపియన్స్‌ట్రోఫీ సెమీఫైనల్‌కుచేరింది. ఆడిన తొలిరెండుమ్యాచ్‌లోను గెలిచి 4 పాయింట్లుతో టేబుల్‌లో అగ్రస్థానంలోనిలిచింది. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్తాన్ ఆడిన రెండుమ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి టోర్నీనుంచి దాదాపుగా నిష్క్రమించింది. ఆజట్టు మిగిలిన ఒక్కమ్యాచ్‌లో గెలిచినా సెమీఫైనల్‌కు చేరడం కష్టమే.

# ఉక్రెయిన్‌పై మళ్లీ నిప్పులు చిమ్మిన రష్యా

>> ఖహారకరించారు. 2022 ఫిబ్రవరి 24వ తేదీప్రత్యేక మిలిటరీ ఆపరేషన్‌పేరిట రష్యా యుద్ధంప్రారంభించింది. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి తన లక్ష్యం అని పుతిన్‌ప్రకటించారు. మూడ్రోజులలో కైవ్‌ను దూకుడు చూపించినా పాశ్చాత్యదేశాల ఆయుధసాయంతో కీవ్‌సైతం ధీటుగా స్పందించింది. మూడేళ్లలో ఇరువైపులా లక్షలాదిమంది సైనికులు మరణించారు. గాయపడ్డారుకూడా. కోట్లాదిడాలర్లమేర ఆస్తినష్టం జరిగింది. డొనాల్డ్‌ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత యుద్ధం ముగింపు దిశగా ప్రయత్నాలుజరుగుతున్నట్లు తెలుస్తోంది.కాగా తీవ్ర అనారోగ్యసమస్యలతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న పోప్‌ఫ్రాన్సిస్ ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్లయిన సందర్భంలో శాంతిసందేశాన్ని విడుదలచేసారు.

# నేటినుంచి బడ్జెట్ అసెంబ్లీ

అక్కడ తిరుగకుండా ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. సభ్యులు తమ సొంత ఆయుధాలను కూడా సభా ప్రాంగణంలోకి తీసుకురాకూడదని స్పష్టం చేశారు. వారి ఆయుధాలను తీసుకువస్తే వాటిని సభ్యుల సర్వీస్ కౌంటర్ వద్ద ఏర్పాటుచేసిన బెల్ట్ ఆఫ్ ఆర్మ్స్‌లో డిపాజిట్ చేయాలని నిర్దేశించారు. అలాగే బ్యానర్లు, లాఠీలు, కర్రలు,ప్లకార్డులు, విజిల్స్ వంటివి కూడా పూర్తిగా నిషేధిస్తున్నట్లు అందులో స్పష్టం చేశారు. సభలో సభ్యులు స్లోగన్లు ఇవ్వడం, పాంఫ్లెట్లు, ఇతరకాగితాలను ప్రదర్శించడంపైనా నిషేధం విధించారు. శాసనసభ,శాసనమండలిపరిధిలో సమావేశాలు, ధర్నాలు, పికెటింగ్‌లపైనా నిషేధాన్ని విధించారు.

**విజిటర్లపైనా ఆంక్షలు**

శాసనసభ సమావేశాల సందర్భంగా శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు ఎవరూ సందర్శకులను తీసుకురాకూడదని కూడా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమవు తాయని బులెటిన్‌లో పేర్కొన్నారు. సభ్యులు తమ పిఎస్, పిఎ వంటి వ్యక్తిగత సిబ్బందిని కూడా సభా ప్రాంగణానికి తీసుకురావద్దని స్పష్టంచేశారు.

**మీడియా పాస్‌ల కుదింపు**

సమావేశాలను కవర్ చేసేందుకు వచ్చే మీడియాను కూడా కుదించే చర్యలు తీసుకున్నారు. గత సమావేశాల కన్నా కూడా తక్కువగా పాస్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నెల 28న ఎపి మంత్రివర్గ సమావేశం ఈ నెల 28న ఉదయం 9గంటలకు సిఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రివర్గ సమావేశంలో 2025- 26 బడ్జెట్‌ను కేబినెట్ ఆమోదించనుంది. బడ్జెట్‌కు ఆమోదం తెలపడంతో అసెంబ్లీలో ప్రవేశపెట్టె వివిధ కీలక బిల్లులపైన మంత్రి వర్గంలో చర్చించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు సర్వం సిద్దం చేసింది. సమావేశాల్లో ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యం ఇస్తూ ఈ నెల 28వ తేదీన 2025-26వార్షిక బడ్జెట్‌ను ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. దాదాపు 3 వారాల పాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో గత ఎనిమిది నెలల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతి, అందిస్తున్న సంక్షేమం, 2047 లక్ష్యాలు, ఆర్థిక ఇబ్బందులు తదితర అంశాలపై గవర్నర్ ప్రసంగం ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 28వ తేదీన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను చట్టసభలకు సమర్పించనున్నారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు సమాచారం. 15 వృద్ధి సాధనే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కిందటి ఏడాది సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడంతో తొలుత ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పాత ప్రభుత్వం సభకు సమర్పించింది.

అయిదేళ్ళ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఇతరత్రా అంశాల కారణంగా మరో నాలుగు నెలల కాలానికి ఓట్ ఆన్ అకౌంట్‌ను సమర్పించింది. రాష్ట్ర నావకు ఒక దిక్సూచిలా నిలిచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను, అభివృద్ధిని గాడిన పెట్టడంలో ఈ నెల 28న ప్రవేశపెట్టే పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ ఎంతో కీలకం కానుంది. హామీల అమలుకు తగ్గట్టుగా వనరుల సమీకరణ ఇక్కడ కీలకం కానుంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

**అసెంబ్లీ సమావేశాలకి వైకాంగ్రెస్ పార్టీ అధినేత జగన్, ఎంఎల్ఎలు,ఎంఎల్‌సిలు**

అసెంబ్లీ సమావేశాలకు మాజీ సిఎం వైఎస్ జగన్ సహా వైకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ కానున్నారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై జగన్ చర్చించనున్నారు. శాసనసభకు రావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వైకాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది.

## పెళ్లిపీటల నుండి... గ్రూప్ 2మెయిన్స్ పరీక్షలకు నూతన వధువు



**తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగ అవకాశాల్లో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్2 మెయిన్స్ పరీక్ష కోసం ఏకంగా ఓ నవ వధువు పెళ్లిమండపం నుండి నేరుగా పరీక్షాకేంద్రానికి వచ్చింది. ఆదివారం తిరుపతిలోని పద్మావతి మహిళ డిగ్రీ కళాశాల సెంటర్‌లో జరిగిన పరీక్షకు హాజరైంది. ఆమె పెళ్లిపీటలపై వరుడు చేతులమీదుగా తాళికట్టించుకుని అక్కడ నుండి నేరుగా పరీక్షా కేంద్రం చేరుకోవడం అటు బందోబస్తు పోలీసులను, ఇటు పరీక్షాకేంద్రం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. చిత్తూరు పట్టణానికి చెందిన మమత ఆదివారం ఉదయం మూడుముళ్లు వేయించుకుంది. ఉద్యోగం కోసం రాయాల్సిన పరీక్షకు హాజరయ్యేందుకు తిరుపతికి చేరుకుంది. అక్కడ అధికారులు కూడా ఆమె హాల్ టిక్కెట్ పరిశీలించి పరీక్ష రాసేందుకు పంపారు. ఆమె చిరునవ్వుతోనే అధికారులను పలకరించారు. కాగా తిరుపతి జిల్లాకు సంబంధించి తిరుపతి నగరంలో 13 కేంద్రాల్లో 5,055మంది అభ్యర్థులు హాజరయ్యారు. 746మంది గైర్హాజరయ్యారు. నిబంధనల మేరకు అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



ఆదివారం అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ సిఎం పవన్

# నడుము నొప్పికి వైద్యపరీక్షలు చేయించుకున్న పవన్

## నేడు అసెంబ్లీకి హాజరు కానున్న డిప్యూటీ సిఎం

**విజయవాడ,ఫిబ్రవరి23,ప్రభాతవార్తప్రతినిధి:** నడుము నొప్పితో కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్న డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు? హైదారాబాద్ అపోలో ఆసుపత్రిలో చేరి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు అక్కడ స్కానింగ్, తత్సంబంధిత పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్స్ పరిశీలించిన వైద్యులు పలు సూచనలు చేశారు. మరికొన్ని వైద్య పరీక్షలు అవసరం ఉంది. ఈ నెలాఖరునగానీ, మార్చి మొదటి వారంలోగానీ మిగిలిన వైద్య పరీక్షలు చేయించు కొంటారు. 24వ తేదీ నుంచి మొదలయ్యే బడ్జెట్ సమావేశాలకు పవన్ కల్యాణ్ హాజరవుతారు. పవన్ తీవ్ర నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఆయనకు కొంత ఉపశమనం కలిగినప్పటికి తిరిగి సమస్య ఇబ్బందికరంగా మారడంతో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దీని వలన తాను ఎన్డీఎ సమావేశాలకు హాజరు కాలేక పోతున్నానని ఇటీవల ఢిల్లీలో మీడియా సమావేశంలోను పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.

# అసెంబ్లీ భద్రతకు అత్యంత ప్రాధాన్యం

>> ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తాతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకరు అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ గవర్నర్ గారి ప్రసంగం జరిగే రోజు ఉదయం 9.30 గంటలకు సభ్యులందరూ సభలో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, అధికారుల వ్యక్తిగత సహాయకులకు పాసులు జారీ చేయబడవన్నారు. అందువల్ల వారికి ప్రవేశం ఉండదు. సభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిని కలిసే సందర్శకులు, ప్రతినిధులు శాసనసభ ప్రాంగణంలో అనుమతించరన్నారు. వారు ముఖ్యమంత్రిని ఆయన కార్యాలయంలోనే భేటీ కావాలి. శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీసు శాఖకు సహకరించాలని అందరినీ కోరారు. సమావేశాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియా పాయింట్, కొత్తగా నిర్మిస్తున్న క్యాంటీన్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనసభ కార్యదర్శి జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవం ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కమిటీ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్

>> చారంతో ప్రతిపాదనలు తయారవుతున్నాయి. వాటిలో భూముల బదలాయింపు నిషిద్ధ చట్టం కింద తహసీల్దార్ ఇచ్చే ఉత్తర్వులపై బాధితులు ఆర్డీఓకు అప్పీలు చేస్తున్నారు. ఇక్కడ ఇచ్చే ఆర్డర్లపై జిల్లా కలెక్టర్లకు 3 నెలల్లోగా అప్పీల్ చేయాలి .హైకోర్టు సూచనలు అనుసరించి కలెక్టర్లకు బదులు అప్పీల్ స్వీకరణ బాధ్యతలను జెసిలకు అప్పగించాలి. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని ఖాళీ చేయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్ల నుంచి జెసిలు/ ఆర్డీఓలకు ఇవ్వాలి. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న తప్పులను ప్రస్తుత విధానంలో జెసి మాత్రమే సరిదిద్దేందుకు అవకాశం ఉంది. ఈ అధికారాన్ని సబ్-కలెక్టర్ / ఆర్డీఓకు అప్పగించాలి. ప్రజా విజ్ఞప్తులు త్వరగా పరిష్కరించేందుకు వీలుగా ఆయా శాఖల వారీగా కొన్ని మార్పులు రాబోతున్నాయి.

# రైతు సాధికార సంస్థ ఒప్పందం

>> సాయంలో ఏపీని ప్రపంచ అగ్రగామిగా నిలిపేందుకు ఇది సహాయపడుతుందని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. వ్యవసాయ విస్తరణ బలోపేతంలో భాగంగా ట్రేసబులిటీ సర్టిఫికేట్ తదితర విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రద్ధ చూపిస్తున్నారు. మానవ ఆరోగ్యం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామికావడం సంతోషంగా ఉంది అని పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ సీఈవో క్రేగ్ కోగోట్ ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సిఇఒ కీత్ అగోడా పెగాసస్ క్యాపిటల్ సలహాదారు జీనా మెక్‌కార్తీ తెలిపారు.

# ప్రజల గొంతును అసెంబ్లీలో వినిపిద్దాం

>> ఉండాన్నారు.. ప్రజల సమస్యలను, ఆకాంక్షలను, ఆశలను, సంక్షేమాన్ని, చట్టసభల్లో వినిపించేలా పార్టీ తరఫున ఎన్నికైన ప్రతి శాసనసభ్యుడు, శాసనమండలి సభ్యులు చర్చల్లో పాల్గొనాలి అన్నారు. ఆదివారం సాయంత్రం తరువాత జనసేన కార్యాలయంలో ఆయన పార్టీ శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ పవన్ కల్యాణ్ పార్టీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. శాసనసభ సంప్రదాయాన్ని, మర్యాదను కాపాడుతూ హుందాగా ముందుకు వెళ్దామని చెప్పారు. చట్ట సభలలో ఎంత విలువైన చర్చలు జరిగేవో ఒకసారి అందరూ పరిశీలించాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకొని చర్చల్లో పాల్గోవాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి మొదలవుతున్న తరుణంలో జనసేన పార్టీ శాసనసభాపక్ష సమావేశం ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ముందుగా పార్టీ పిఎసి చైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వాగత ఉపన్యాసం చేస్తూ.. బడ్జెట్ సమావేశాల్లో పార్టీ విధివిధానాలు అనుసరించి చర్చల్లో బలంగా పాల్గొనాలన్నారు. పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో ముందుకు వెళ్లాలని సూచించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పవన్ కల్యాణ్ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అంకిత భావంతో పని చేస్తున్నారు అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మనందరం కట్టుబడి ఉండాలని తెలిపారు. ఆ స్ఫూర్తి మనం పాల్గొనే చర్చల్లో కనిపించాలి అన్నారు. సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ శాసనసభ్యులు మాట్లాడే ప్రతిపదం ఎంతో ప్రభావవంతమైనదన్నారు.. చట్టసభల్లో మాట్లాడే భాష విషయంలో, వాడే పదాల విషయంలో సభ్యులు జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం అభ్యంతరకర పదజాలం వాడవద్దు. హుందా అయిన భాష, గౌరవంతమైన పదాలను నాతో సహా ప్రతి ఒక్కరూ వినియోగించాలి. చట్టసభల్లో మనం మాట్లాడే ప్రతి విషయాన్ని ప్రజలంతా చూస్తున్నారని, వారి ఎదురుగా మనం మాట్లాడుతున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.గతంలో చట్టసభలో వైకాంగ్రెస్ పార్టీ దిగజారుడు భాష వాడింది. ఆ తరహా భాష వద్దు. ఆ పార్టీవి బురద రాజకీయాలన్నారు. ఆ పార్టీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో వైకాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అప్పట్లో వాడిన భాష, వ్యవహరించిన విధానం ప్రజలంతా గమనించారు. వారు పూర్తిగా బురదలో కూరుకుపోయారు. వారి బురద మనకు అంటించాలని చూస్తారు. వారు రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా హుందాగా వ్యవహరించాలన్నారు. వైకాంగ్రెస్ ప్రజాప్రతినిధులు బూతులు, అసభ్య పదజాలంతో ఈ బడ్జెట్ సమావేశాల్లో రెచ్చగొట్టినా సంయమనం పాటించండి. వావాళ్ల దిగజారుడు వ్యాఖ్యలు చేసినా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వారు ఏదో అన్నారని మీరు దిగజారి ఇష్టానుసారం భాషను వాడొద్దు. స్పందించే సందర్భంలో హుందాగా సమాధానం ఇవ్వండి. చట్టసభల్లో మాట్లాడే ప్రతి మాటను జనసేన ప్రజాప్రతినిధులు ఆచితూచి వాడాలి. మనలో ఎక్కువ మంది, నాతో సహా తొలిసారి ఎన్నికైనవారుఉన్నారు. భాషవిషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో నాదెండ్ల మనోహర్ కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్. పిడుగు హరిప్రసాద్‌లు ఎప్పటికప్పుడు మన సభ్యులకు చెప్పాలన్నారు.

# టన్నెల్‌లో..టెన్షన్

>>ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు నేవీ బృందాలను కూడా సంప్రదించారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్బీసీ) సొరంగ మార్గంలో పైకప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు టన్నెల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, సైనిక బృందాలు లోపలికి వెళ్లాయి. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, సైనిక బృందాలతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లారు. సొరంగం లోపలికి ఆక్సిజన్ పంపుతున్నామని, వాటర్ తోడేసే పనులు నిరంతరం సాగుతున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రెస్క్యూ టీమ్‌లు రాత్రి నుంచి అక్కడే పని చేస్తున్నాయని చెప్పారు. కూలిన మట్టి, నీరు చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని, వాటిని తొలగించే పనిలో సహాయక బృందాలు శ్రమిస్తున్నాయని మంత్రి జూపల్లి ఇప్పటికే టన్నెల్ బోర్ మిషన్ (టిబిఎం) వరకూ సహాయక బృందాలు చేరుకున్నాయని, కార్మికులను రక్షిస్తామని మంత్రి జూపల్లి ధీమా వ్యక్తం చేశారు.

**రంగంలోకి 322 మంది ప్రత్యేక బృందాలు..**

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో 13వ కిలోమీటర్ వద్ద నీరు, మట్టి నీరు పెద్ద ఎత్తున పేరొన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 12 మీటర్ల వ్యాసార్థంలో 200 మీటర్ల పొడవున మట్టి పేరుపై ఉన్నట్లు అంచనా వేశారు. శనివారం రాత్రి లోపలికి వెళ్లిన సిబ్బంది పరిస్థితినే ఉన్నతాధికారులకు వివరించారు. దీంతో ఆదివారం ఉదయం సామాగ్రితో పాటు రెస్క్యూ సిబ్బంది కూడా టన్నెల్లోకి వెళ్లారు. సుమారు 11 కిలోమీటర్ల వరకు లోకో ట్రైన్‌లో వెళ్లిన ఎన్డీఏ ఆర్ఎఫ్ బృందాలు అక్కడి నుంచి మూడు అడుగుల నీటిలో ముందుకు సాగారు. టన్నెల్లో బోరింగ్ మిషన్ వద్దకు చేరుకుని బోరింగ్ మిషన్ కొంత దెబ్బతిన్నదని రెండు వైపులా పూర్తిగా బురద మట్టి నిండిపోయి ఉన్నట్లు అధికారులు తెలియపరిచారు. సహాయక చర్యల్లో మొత్తం 332 మంది అధికారులు రెస్క్యూ బృందం లోపలికి వెళ్లారు. అందులో 130 మంది ఎన్డిఆర్ఎఫ్ 24 మంది హైడ్రాస్ సిబ్బంది 24 మంది ఆర్మీ బృందం 24 మంది సింగరేణి క్యాలరీస్ రెస్క్యూ టీమ్ 120 మంది ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. సొరంగంలో 14వ కిలోమీటర్ వద్ద పైకప్పు కూలడంతో బృందాలు సుమారు పదమూడున్నర కిలోమీటర్ల వరకు వెళ్లగలిగారు.

**7గంటలు సొరంగంలోనే మంత్రి జూపల్లి..**

ఎస్ఎల్బీసీ సొరంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ బృందాలతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు వెళ్లారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైనిక బృందాలతో కలిసి లోకో ట్రైన్‌లో టన్నెల్‌లోకి వెళ్లి సాయంత్రం వరకు టన్నెల్‌లోనే పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి ఆరు గంటలుగా సొరంగంలోనే ఉన్నారు. ప్రమాద స్థలం దగ్గర నుంచి ఇంజనీరింగ్ అధికారులు, ఎజెన్సీ ప్రతినిధులతో ఇంటర్ కాం ఫోన్ లో మాట్లాడారు. స్వయంగా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు లోపల జరుగుతున్న పనులను మంత్రి దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రమాదం జరిగిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్, సహాయక బృందాలకు మంత్రి దిశానిర్దేశం చేశారు. బయట నుంచి ప్రమాదస్థలికి సొరంగంలో మధ్య దూరం 13.5 కి.మీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పర్యవేక్షించిన రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బిసి వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించిన రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# ఇక వేగంగా ఒఆర్ఆర్ పనులు

>> సంబంధించిన యజమానులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తారు. తర్వాత భూములను సంబంధిత జెసిలు తమ ఆధీనంలోకి తీసుకొని, ఎన్‌హెచ్ఎఐ పేరిట మ్యుటేషన్ చేస్తారు. భూసేకరణ ప్రక్రియ జరుగుతుండగానే డిపిఆర్ సిద్ధం చేస్తూ, మరోవైపు వివిధ అనుమతులను ఎన్‌హెచ్ఎఐ ఇంజినీర్లు తీసుకోనున్నారు. ఓఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌కు 500 మీటర్ల పరిధిలో భూ వినియోగ మార్పిడి, భూముల క్రయవిక్రయాలను స్తంభింపజేయాలని కమిటీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. లేకపోతే భూసేకరణ వ్యయం పెరిగిపోయే అవకాశం ఉందని పేర్కొంది. ఓఆర్ఆర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించగా దీనిపైనా ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీలో చర్చించారు. ఓఆర్ఆర్‌ల నిర్మాణంలో ఎక్కడా సర్వీస్ రోడ్లు నిర్మించట్లేదని, అయితే రింగ్‌రోడ్‌కు లోపలివైపు మాత్రమే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి పరిశీలించాలని కమిటీ సూచించింది. ఓఆర్ఆర్ నిర్మాణానికి 150 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేయాలని రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్‌లో ఓఆర్ఆర్ వెంబడి రైల్వేలైన్ నిర్మాణం, ఇతరత్రా వాటికి భూమి అవసరమని పేర్కొంది. 6 వరుసల రోడ్డుకి 70 మీటర్ల వెడల్పుతో భూసేకరణ సరిపోతుందని, భవిష్యత్తులో 8 వరుసల విస్తరణకూ వీలుంటుందని కమిటీ తెలిపింది. జాతీయ రహదారుల చట్టం1956 ప్రకారం భూసేకరణ చేయనున్నందున, ఇతర అవసరాలకు ఆ భూమిని వినియోగించకూడదని పేర్కొంది. రాష్ట్రప్రభుత్వం రైల్వేశాఖతో సంప్రదించి అదనపు భూసేకరణపై దృష్టి పెట్టొచ్చని సూచించింది.



ఆదివారం దుబాయ్ స్టేడియంలో మంత్రి నారా లోకేష్

# భారత్ జట్టును అభినందించిన మంత్రి లోకేష్

**గుంటూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** దుబాయ్‌లోని ఇంటర్‌నేషల్ క్రికేట్‌స్టేడియంలో ఆదివారం జరిగిన పాకిస్తాన్, ఇండియా క్రికేట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు వెళ్లినన రాష్ట్రవిద్యా, ఐట శాఖమంత్రి నారా లోకేష్ పలువురు ప్రముఖులు కలిసారు. పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించిన ఇండియాటీమ్ సభ్యులను అభినందిచారు. ఇండియా బౌలింగ్, బ్యాటింగ్‌లో ప్రత్యర్థిజట్టు పాకిస్తాన్‌ను కట్టడి చేసి చరిత్ర సృష్టించిందన్నారు. చాంపియన్‌ట్రోఫిలో భారత్ విజయం సాధించిన సందర్భంగా మంత్రి నారాలోకేష్ ఐసిసిచైర్మన్ జైషాతో పలు అంశాలు చర్చించారు

## వారం - వర్జ్యం

తేది : 24-02-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
ఏకాదశి మ.1.46
పూర్వాషాఢ సా.6.58
వర్జ్యం రా.2.49-4.23
దు.ము.12.52-1.39, 2) మ.3.13-4.00
శుభసమయం: ఉ.5.30-6.40
సా.5.00-6.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**వృషభం :** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఖర్చులు పెరుగుతాయి.

**మిథునం:** దూరప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. చోర భయం, విలువైన వస్తువులు జాగ్రత్త.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. బయటా అనుకూలం.

**సింహం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. విలువైన వస్తువులు జాగ్రత్త.

**కన్య :** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. అనుకోని ఖర్చులు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలుగుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**మకరం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. రుణబాధలు తప్పవు. వాహనసౌఖ్యం.

**కుంభం:** రుణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మీనం :** పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యువ విద్యార్థులను స్పేస్ వైపు నడిపించడమే యువికా లక్ష్యం

### ఇస్రో విస్తృతంగా దేశ వ్యాప్త ప్రచారం
### నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం యువికాపై ఇస్రో విస్తృత ప్రచారం చేస్తోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమంలో ఈ ఏడాది జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను యువికా కోసం ఆహ్వానిస్తోంది. పాఠశాల పిల్లలను అంతరిక్ష విజ్ఞానం వైపు మళ్లించడానికి యువికా ఒక అవకాశం కల్పిస్తోంది. ప్రాథమిక జ్ఞానాన్ని అందించినప్పుడే యువ విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష పరిజ్ఞానం గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందని ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వలన మరింతమంది విద్యార్థులను సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ మరియు మేథమ్యాటిక్స్ ఆధారిత పరిశోధన కొన సాగించేలా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇస్రో విడుదల చేసిన ప్రకటనలో ఫిబ్రవరి 24న రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. మార్చి 23తో రిజిస్ట్రేషన్ ముగిసిన తర్వాత ఏప్రిల్ 7న మొదటి ఎంపిక జాబితా విడుదలవుతుంది. మే 18న సంబంధిత ఇస్రో కేంద్రాల్లో ఎంపిక చేయబడిన విద్యార్థులచే విద్యార్థి రిజిస్టర్డ్ ఈమెయిల్ ద్వారా తెలియజేస్తారు. అసలుసిసలైన యువికా కార్యక్రమం మే 19న మొదలై 30 వరకు కొనసాగుతుంది. మే 31న సంబంధిత కేంద్రం నుంచి ఎంపిక చేయబడిన విద్యార్థులకు పంపించే ప్రక్రియ జరుగుతుంది. యువికా 2025లో పాల్గొనే వారి ఎంపిక పరిమితుల ఆధారంగా నిర్వహిస్తారు. 8వ తరగతి పరీక్షల్లో 50 శాతం మార్కులు, ఆన్‌లైన్ క్విజ్‌లలో 10 శాతం పనితీరు కనబరచాల్సి ఉంటుంది. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనడం గత మూడేళ్లలో జిల్లా, రాష్ట్రం, అంతకంటే ఎక్కువస్థాయిలో 1 నుంచి 3 ర్యాంకులు సాధించి ఉండాలి. గత మూడేళ్లలో స్కౌట్ మరియు గైడ్స్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ సభ్యులకు కూడా 5 శాతం అవకాశం ఉంటుంది. 15 శాతం పంచాయతీల ప్రాంతంలో ఉన్న గ్రామీణ పాఠశాలలో చదువుకున్న వారికి అవకాశం కల్పిస్తున్నారు. ప్రతి రాష్ట్రం నుంచి కనీస భాగస్వామ్యం ఉండాలని ఇస్రో భావిస్తోంది. దేశంలోని ఇస్రో ఏడు కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శనివారం ఇస్రో అధికారులు పేర్కొన్నారు. అందులో డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్), తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్‌సి), శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి), బెంగళూరులోని యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్‌సి), అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసి), హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి), షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎన్ఇఎస్ఏసి) లలో యువికా విద్యార్థుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇస్రో ఈ విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని, తమ పరిమితులకు లోబడి విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.



యువికా కార్యక్రమంపై ఇస్రో రూపొందించిన చిత్రం

## సిఎం చంద్రబాబు సిపిఆర్వోగా ఆలూరి రమేష్



**విజయవాడ, ఫిబ్రవరి23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తన వద్ద 4 ఏళ్లుగా పిఆర్వోగా పనిచేస్తున్న జర్నలిస్టు ఆలూరి రమేష్ తనకు చీఫ్ పిఆర్వోగా ఖరారు చేసినట్లు సమాచారం.ఆ మేరకు ఉత్తర్వులు జారీ కానున్నట్లు సీఎంవో వర్గాల సమాచారం. రమేష్ ప్రస్తుతం చంద్రబాబు వద్ద మీడియా వ్యవహారాలు చూస్తున్నారు. అయితే ఇకపై సిపిఆర్వో ఉత్తర్వుల ద్వారా అధికారంగా పనిచేయనున్నారు. 2002 ఒక దిన పత్రిక జర్నలిజం స్కూల్ తొలి బ్యాచ్ ద్వారా రమేష్ మీడియాలోకి వచ్చారు. ఆ పత్రిక రీ ఓపెన్ సమయంలో విజయవాడ ఆఫీస్‌లో ట్రైనీ సబ్‌ఎడిటర్‌గా జాయిన్ అయ్యారు. తరువాత గుంటూరు, హైదరాబాద్‌లో రిపోర్టర్‌గా పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో విజయవాడ వచ్చిన ఆయన నాలుగేళ్లక్రితం చంద్రబాబు వద్ద పిఆర్వోగా చేరారు. చంద్రబాబు సిఎం అయిన తరువాత తొలి రోజు నుంచి ముఖ్యమంత్రి మీడియా వ్యవహారాలను రమేష్ చూసారు. కూటమి ప్రభుత్వంలోకి తీసుకునేందుకు చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారన్నది సీఎంఓవర్గాల సమాచారం. రెండు మూడురోజుల్లో ఉత్తర్వులు వస్తాయని సమాచారం.

## రైల్వేలో కొనసాగుతున్న సిబిఐ దాడులు

### ముగ్గురు రైల్వే సిబ్బంది,నకిలీ అభ్యర్థి సహా పలువురిపై కేసు నమోదు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** కేంద్ర అవినీతి నిరోధక సంస్థ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సిబిఐ) అవినీతిపై ఎప్పటికప్పుడు తన పంజా విసురుతుంది. దాడుల పరంపరలో కొనసాగింపుగా మొన్న గుంతకల్లు,విశాఖపట్నం, నిన్న వడోదర,నేడు జాబల్ పూర్ రైల్వే డివిజన్‌లలో అవినీతి/అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై డిఆర్ఎంలు,పలువురు అధికారులతో సహా క్షేత్రస్థాయి సిబ్బంది సైతం సిబిఐ వలలో చిక్కుకొని బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తాజాగా వెస్ట్ సెంట్రల్ రైల్వే రాజస్థాన్‌లోని కోటలో పనిచేస్తున్న గూడ్స్ ట్రైన్ మేనేజర్,సిడబ్ల్యుఎం కార్యాలయంలో టెక్నీషియన్-02,రైల్వే విద్యుత్ టిఆర్‌డి విభాగంలో సహాయకుడిగా(కళాసీ హెల్పర్)గా పని చేస్తున్న సిబ్బందితో పాటు మోసపూరిత మార్గాల ద్వారా రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో చేరేందుకు మధ్యవర్తుల ద్వారా రూ.15లక్షలు చెల్లించి నకిలీ అభ్యర్థితో పరీక్ష వ్రాయిస్తున్నారన్న ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో రంగప్రవేశం చేసిన సిబిఐ ఓఅభ్యర్థికి బదులు నకిలీ అభ్యర్థి పరీక్షకు హాజరు కావడాన్ని గుర్తించి రైల్వే రిక్రూట్‌మెంట్ నిర్వహించిన ఈ వ్రాతపరీక్ష మొత్తం వ్యవహారంలో పరీక్ష వ్రాసిన నకిలీ అభ్యర్థిఫోటోలు, కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు అతని వేలుముద్రలను సేకరించి కేసు నమోదు చేసుకుని విచారణ ముమ్మరం చేసింది. విచారణలో భాగంగా రాజస్థాన్‌లోని కోట, సవాయి మధోపూర్ జిల్లాలోని నిందితుల నివాసాల్లో సోదాలు నిర్వహిస్తుంది.


## రైతాంగాన్ని ఏడిపిస్తోన్న ఎర్రబంగారం: వైఎస్ షర్మిల

**విజయవాడ.ఫిబ్రవరి23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం ఏడిపిస్తోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మిర్చిపంట నష్టాల ఘాటుకు రైతన్న ఉక్కి రిబిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడికి పెట్టిన పైసలు రాక రైతు కన్నీళ్లు పెడుతున్నారని చెప్పారు. క్వింటాకు రూ. 15 వేలనష్టంతో అమ్ముకుంటుంటే అండగా నిల వాల్సిన కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్ల లో కారంకొడుతుందని ఆరోపించారు. ఆదివారం విజయవాడలోని కాంగ్రెస్‌కార్యాలయం నుంచి షర్మిలమీడియాకు ఒక ప్రకటనవిడుదల చేసారు.మిర్చి రైతులకు రూ.11 వేల మద్దతు ధర ఇచ్చి ఉద్ధరించినట్లు .. కూటమి ప్రభుత్వం గప్పాలు కొడుతుందని వైఎస్ షర్మిల ఆరోపించారు.

# నేటి నుంచి వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** రానున్న వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ నేటి నుంచి వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 08583 వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 24,మార్చి 3,10,17,24,31,ఏప్రిల్ 7,14,21,28వ తేదీల్లో ప్రతి సోమవారాల్లో విశాఖపట్నం నుంచి సాయంత్రం 7-10గంటలకు బయలుదేరి,దువ్వాడ 7-48/50, అనకాపల్లి 7-55/56,యలమంచిలి రాత్రి 8-10/12,అన్నవరం 8-39/40, సామర్లకోట 9-04/05,రాజమండ్రి 9-53/55, తాడేపల్లిగూడెం 10-29/30, ఏలూరు 11-08/10, విజయవాడ అర్ధరాత్రి 12-50/1-00,తెనాలి 1-28/30, చీరాల 2-08/10, ఒంగోలు 2-53/55, నెల్లూరు 4-03/05,గూడూరు 5-35/37, శ్రీకాళహస్తి 6-28/30,రేణిగుంట 6-58/7-00,తిరుపతికి మంగళవారం ఉదయం 9-15గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08584 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25,మార్చి 4,11,18,25,ఏప్రిల్ 1,8,15,22,29వ తేదీల్లో ప్రతి మంగళవారాల్లో రాత్రి 9-55గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి,రేణిగుంట 10-13/15, శ్రీకాళహస్తి 10-35/36,గూడూరు 11-23/25,నెల్లూరు 11-53/55, ఒంగోలు 1-23/25,చీరాల 1-59/2-00, తెనాలి 2-48/50,విజయవాడ తెల్లవారుజామున 3-10/20,ఏలూరు 4-28/30, తాడేపల్లి గూడెం 5-04/05, రాజమండ్రి 5-43/45,సామర్లకోట 6-28/30, అన్నవరం 6-53/55,యలమంచిలి 7-38/40 ,అనకాపల్లి 8-28/30,దువ్వాడ 9-38/40, విశాఖపట్నంకు బుధవారం ఉదయం 10-15 గంటలకు చేరుకుంటుంది.

## బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటాం:పేరం శివనాగేశ్వరరావు గౌడ్




**విజయవాడ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాలకు తాము అండగా వుంటామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నేషనల్ సెక్రటరీ పేరం శివనాగేశ్వరరావు గౌడ్ అన్నారు. ఆదివారం విజయవాడ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో తిరుగుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. రామిశెట్టి రమేష్‌ను ఆర్‌పిఐ (అథవాలే) ఏపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పలువురు కార్యకర్తలకు అనేక గౌరవ పదువుల్లో నియమిస్తూ కేంద్రమంత్రి రామదాస్ అథవాలే జారీ చేసిన నియామక పత్రాలను పేరం నాగేశ్వరరావు వారికి అందించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు

**విజయవాడ,ఫిబ్రవరి23,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల డీఎస్పీగా పనిచేసిన టిటి ప్రభాకర్ బాబుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలకు ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఆగష్టు నుండి 2020 నవంబర్ వరకు తిరుమల డీఎస్పీగా సేవలందించిన ప్రభాకర్ బాబు, తన విధుల్లో అనేక వివాదాస్పద చర్యలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభాకర్ బాబు, తిరుమలలోని కాటేజీల మధ్య తనకు కేటాయించిన వసతిగృహంలో కోడి పుంజులను పెంచినట్లు గుర్తించారు. ఈ కోడి పుంజుల అరుపులు మరియు విసర్జితాలతో భక్తులకు ఇబ్బందులు కలగడంతో, ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అదనంగా, కోళ్ళకు స్నానాలు చేయించి, దాణా పెట్టేందుకు కానిస్టేబుళ్లను వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పాల బిల్లు అడిగినందుకు వాహనంపై 2 వేల జరిమానా విధించారు. తన నివాసానికి పాలు సరఫరా చేసే వ్యక్తికి 9 నెలల పాటు బిల్లు చెల్లించకపోవడం, అడిగి నందుకు అతని వాహనంపై 2,000 రూపాయల జరిమానా వేయించడం వంటి చర్యలు కూడా ఆయనపై ఆరోపణలుగా ఉన్నాయి. కానిస్టేబుళ్లతో కోళ్లకు దాణా చేయించినట్టు ఆరోపణ ఉంది. హోం గార్డుపై అక్రమ కేసు పెట్టారని ప్రభాకర్ పై ఆరోపణలు ఉన్నాయి. 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం.





## ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి

### అప్టస జిల్లా అధ్యక్షులు కాకాని నాగేశ్వరరావు

**విజయవాడ,ఫిబ్రవరి23,ప్రభాతవార్తప్రతినిధి:** అపరిష్కృతంగా ఉన్న ఖజానా విభాగం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ (అప్టస)ఎన్టీఆర్ జిల్లా సంఘ నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఆ సంఘ నూతన అధ్యక్షులు కాకాని నాగేశ్వ రరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఖజానా శాఖ ఉద్యోగుల సం ఘం ఎన్నికలు ఆదివారం గవర్నర్ పేట లోని ఖజానా శాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారి షేక్ హసీనా బేగం నిర్వహించారు. జిల్లా కార్య వర్గంలోని 11 పదవులు ఒక్కొక్క పదవికి ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేసినందున కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఆమె తెలిపారు.


అప్టస ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గం

## ఆనందోత్సాహాల మధ్య పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రైల్వే ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 1998-99బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఏకైక దక్షిణ మధ్య రైల్వే ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరిగింది. స్థానిక రైల్వే ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 1998-99విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు, 26సం॥లకు తమకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి మూల కారకులైన నాటి,నేటి ప్రధానోపాధ్యాయులు కంథారే, మధుసూధనరావు,నాటి ఉపాధ్యాయ బృందం రాజారెడ్డి,రమణరావు, రవీంద్రనాథ్, మొహమ్మద్ రఫీక్,సాదిక్,సుధాకర్,సునీల పాల్, గజేంద్రబాబు,సాయిలను భక్తిభావంతో ఘనంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. అలనాటి తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకొని అలనాటి తమ తీపి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కంథారే హాయంలో పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉండేదని విద్యార్థులు హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. అనంతరం ఆయన రైల్వే జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా రావడం ఆధ్వర్యంలోనే తాము ఇంటర్మీడియట్ పూర్తిగావించామన్నామని పలువురు విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను,దేశ విదేశాల్లో వివిధ ప్రాంతాల్లో ఉన్న సహచర మిత్రులందరికి ఒక వేదికపై తెచ్చేందుకు విశేష కృషి చేసిన కార్యని ర్వాహక కమిటీ సభ్యులు రాకేష్,కిరణ్, విజయ్ ,సునిత,సరిత, జాన్‌రాకేష్‌లను వారి మిత్రబృందం అభినందించారు.

# బిసిలకు రు.20వేలకోట్లు కేటాయించాలి

**విజయవాడ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో బిసిలకు రాష్ట్రప్రభుత్వం రు.20వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షుడు డా ఎన్ మారేష్ డిమాండ్ చేశారు. విజయవాడలో బిసి సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన బిసి కుల సంఘాల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ అసెంబ్లీ బడ్జెట్లో రు.20 వేలకోట్లు కేటాయించడంతో పాటు బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలివ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా బిసి గురుకులాల సం ఖ్యను 200కు పెంచాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, బిసిలకు చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహ మందించాలని డిమాండ్ చేశారు. బిసి కులవృత్తులను ఆదు కోటానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, బిసి మహిళలకు స్వయంఉపాధి రుణాలివ్వాలని, విశ్వవిద్యాలయాల్లో పరిశోధక విద్యార్థులకు రీసెర్చ్‌ఫెలోషిప్ అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.


డా ఎన్ మారేష్

# తిరుమల సమాచారం



## నాలాయిర దివ్యప్రబంధ గోష్టి గానంతో అనంతాళ్వారు అవతారమహోత్సవం

**తిరుమల, ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** వైష్ణవ భక్తాగ్రేసురుడు, ఆళ్వారులలో ప్రముఖుడు అనంతాళ్వారు 971వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వారుతోటలో ఆదివారం ఘనంగా జరిగింది. అనంతాళ్వారు వంశీకులు నాలాయిర దివ్యప్రబంధ గోష్టిగానం నిర్వహించారు. పెద్ద జీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేశారు. టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టుద్వారా 108 వైష్ణవ దివ్యదేశాల నుండి ప్రముఖులను ఆహ్వానించి తమ ఉపన్యాసాల ద్వారా అనంతాళ్వార్ వైభవాన్ని అత్యంత అద్భుతంగా తెలియజేశారు.

అనంతరం తిరుమల విశిష్టత, గునపం ప్రాధాన్యత వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు, అనంతాళ్వార్ వంశస్తులు వేంకటేకృష్ణస్వామి, భరద్వాజస్వామి జీయర్లు పాల్గొన్నారు.

## అధికార నందిపై సోమస్కందమూర్తి

**తిరుమల, ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి అధికారనంది వాహనంపై సోమస్కంధమూర్తిగా కపిలేశ్వరుడు భక్తులకు అభయమిచ్చాడు. కపిలేశ్వరస్వామి వాహనసేవలలో అధికారనంది వాహనం ప్రముఖం. ఈ అధికార నందికి కైలానంది అని పేరు. కైలాసంలో మెడలో మువ్వలదండలతో, కాళ్ళకు గజ్జెలతో,భక్తులకు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తిగా కామాక్షి అమ్మవారితో కలసి తిరుచ్చివాహనంపై ఊరేగారు. ఉదయం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత స్వామివారు ఆలయ పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారికి వేడుకగా విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.





## శ్రీవారి సన్నిధిలో సేవకుడిగా పనిచేయడం అదృష్టం

### టిటిడి బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా వినయ్‌చంద్ ప్రమాణం

**తిరుమల, ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు సేవకుడిగా సేవచేసే అవకాశం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు రాష్ట్రదేవాదాయశాఖ కార్యదర్శి,టిటిడి బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడు వాడరేవు వినయ్‌చంద్ తెలిపారు. ఎక్స్ అఫిషియోసభ్యుడుగా నియమితులైన ఆయన ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం ఆలయంలోనికి చేరుకున్న వినయ్‌చంద్ చేత టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. లక్షలాదిమంది భక్తులకు సేవలందించే విషయంలో టిటిడి పాలకమండలి, అధికారులతో కలసి పనిచేస్తానన్నారు. ఆలయంలో ఉదయం ప్రమాణం చేసిన వినయ్‌చంద్ అనంతరం కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆశీస్సు లందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు భాస్కర్,ప్రశాంతి, విఎస్ఓ సురేంద్ర పాల్గొన్నారు.

## సీమలో నేటి నుంచి రైలు మార్గం పనులు

### హిందూపురం పాసింజర్ రద్దు

### వందేభారత్ సహా మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు దారి మళ్లింపు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** రాయలసీమలోని నైరుతి రైల్వే బెంగళూరు డివిజన్‌లో జరుగుతున్న రైలు మార్గం పనుల కారణంగా బెంగళూరు-గుంతకల్లు-బెంగళూరు ప్రధాన రైలు మార్గానికి అంతరాయం ఏర్పడింది. నైరుతి రైల్వే బెంగళూరు రైల్వే డివిజన్‌లోని యలహంక-ధర్మవరం సెక్షన్,పెనుకొండ-మక్కాజీపల్లి స్టేషన్ల మధ్య 15కి.మీలలో యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన రెండో దశ ప్రీ-నాన్ ఇంటర్ లాకింగ్,ఇంటర్ లాకింగ్ సాంకేతిక పనుల కారణంగా ఈ మార్గంలో తిరిగే రైలు సర్వీసుల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. దీంతో గుంతకల్లు- హిందూపురం-గుంతకల్లు మధ్య తిరిగే నెం బర్77213/14 డెమో పాసింజర్ రైలు సర్వీసులను ఈ నెల 25నుంచి 27వరకు మూడు రోజుల పాటు రద్దు చేయగా బెంగళూరు- ధర్మవరం-బెంగళూరు మధ్య తిరిగే నెంబర్06595/96 ప్రత్యేక మెమో పాసింజర్ రైలు సర్వీసులను ఈ నెల 15నుంచి 18వరకు నాలుగురోజుల పాటు హిందూపురం- ధర్మవరంల మధ్య పాక్షికంగా రద్దు చేశారు. దీంతో ఈ రైళ్లు బెంగళూరు-హిందూపురం మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

**దారి మళ్లించిన రైళ్లు**

ఈ నెల 25నుండి 27వరకు కలబురిగి నుంచి బెంగళూరుకు బయలుదేరే నెంబర్ 22231వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం, ధర్మవరం, సత్యసాయి,ప్రశాంతి నిల యం, పెనుకొండ,యలహంక మీదుగా మళ్లించారు.

ఈ నెల 25 నుంచి 28వరకు కాచిగూడ నుంచి యశ్వంతపూర్‌కు బయలుదేరే నెంబర్ 20703వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నాలుగు రోజుల పాటు ధర్మవరం,సత్యసాయి, ప్రశాంతి నిలయం,పెనుకొండ, యశ్వంతపూర్‌ల మీదుగా, ఈ నెల 26,27వ తేదీల్లో హుబ్లీ నుంచి మైసూర్ వెళ్లే నెంబర్ 16591 హంపి ఎక్స్‌ప్రెస్‌ను కాచిగూడ నుంచి మైసూర్ వెళ్లే నెంబర్ 12785 ఎక్స్‌ప్రెస్‌ను నాందేడ్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 16594 ఎక్స్‌ప్రెస్‌లను రెండేసి రోజుల పాటు ధర్మవరం,సత్యసాయి ప్రశాంతి నిలయం,పెనుకొండల మీదుగా మళ్లించారు. అలాగే ఈ నెల 24న గోరఖ్‌పూర్ నుంచి యశ్వంత్‌పూర్‌కు బయలుదేరి నెంబర్ 22533ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25న అహ్మ దాబాద్ నుంచి యశ్వంతపూర్‌కు బయలుదేరే నెంబర్ 22689ఎక్స్‌ప్రెస్‌లను ధర్మవ రం, సత్యసాయి ప్రశాంతి నిలయం, పెనుకొండ,హిందూపురంల మీదుగా మళ్లించారు.

**శ్రీ నందేశ్వరస్వామి దేవాలయం**
బండినారవ (గ్రా),
పోరుమామిళ్ల (మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT NO.P/COE/136/2024-6,
Dt.28/01/2025
దేవాలయ పునఃనిర్మాణము చేయుట కొరకు e-Procurementద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement. gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు
ధర్మకర్త

గొప్ప మనస్సుగలవారు ఆశయాల గురించి చర్చిస్తారు. మామూలు మనస్సున్నవారు సంఘటనలను గురించి చర్చిస్తారు. సంకుచిత మనస్కులు మనుషుల వ్యక్తిగత జీవితాలు, లోటుపాట్లు గురించి చర్చిస్తారు.

-ఐ.జాన్సన్

# కొండెక్కిన పసిడి!


దేశంలో పసిడిధరలు రానురాను పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలకు తోడు అమెరికాకు రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరి ఇందుకు తోడవుతున్నాయి. కేవలం భారత్‌లోనే కాదు అంతర్జాతీయంగా కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. మరోవైపు డాలరు రోజురోజుకూ బలపడుతుండటం, భారత్ రూపాయి క్షీణత కూడా పసిడి ధరల్లో భారీ తేడాలను సూచిస్తోంది. ఈవారాంతంలోనే బంగారం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. 100 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రెండువేల రూపాయలు పెరిగిందంటే పసిడికి ఎంత గిరాకీ పెరిగిందో అర్థం అవుతోంది. బులియన్ చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు ఇకపై లక్షరూపాయలు దాటినా ఆశ్చర్యంలేదు. ఇప్పటికే కిలో వెండి లక్షరూపాయలు దాటేసింది. కమోడిటీ ఫ్యూచర్స్‌లో కూడా ధరలు అదేవిధంగా పరుగులు పెడుతున్నాయి. వీటంతటికీ కారణాలు ఏమిటి? ఎందుకిలా పసిడి పరుగులు పెడుతోంది. సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితులు ఎందుకు ఎదురవుతున్నాయి. ఎగువ మధ్యతరగతికి ఇబ్బందులు లేకపోయినా పండుగలు, శుభకార్యాలు, వివాహాది వేళల్లో బంగారం ధరలు మరింతగా పెరుగుతున్నాయి. వీటంతటికీ కారణం ఏమిటని ఆరా తీస్తే బంగారంపై పెట్టుబడులుపెట్టేందుకు ఇన్వెస్టర్లు మరింతగా ముందుకువస్తున్నారు. ఎందుకంటే అమెరికాలో ట్రంప్ విధించిన సుంకాలే అని చెపుతున్నారు. ప్రపంచదేశాల్లో తమ ఎగుమతులపై సుంకాలు విధించే దేశాలకు అదేస్థాయిలో భారీగా సుంకాలు వడ్డిస్తామని ట్రంప్ ప్రకటించారు. నిజానికి ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు విత్‌డ్రా పెరిగిపోయింది. ఇన్వెస్టర్లు సురక్షిత మార్గాలవైపు తమతమ సొమ్ములు మళ్లిస్తున్నారు. సహజంగా కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను పెంచితే ట్రేడర్లు తమ పెట్టుబడులు కరెన్సీ మార్కెట్లవైపు మళ్లిస్తారు. అలాగే వడ్డీరేట్లు తగ్గినపక్షంలో ఈక్విటీ మార్కెట్లలో అప్రమత్తంగా పెట్టుబడులుపెడుతూ లాభాలు స్వీకరిస్తుంటారు. ట్రంప్ అధ్యక్ష పదవిలోకి వచ్చినతర్వాత ఎప్పుడైతే వాణిజ్యయుద్ధాలకు తెరతీసారో ఈక్విటీ మార్కెట్లపై ఆ ప్రభావంపడింది. ఒక్కసారిగా అమెరికా, యూరోప్, ఆసియా మార్కెట్లు కుప్పకూలాయి. ఒక్కరోజులోనే లక్షలకోట్లు ఇన్వెస్టర్లకు నష్టాలు ఎదురయ్యాయి. ఈక్రమంలో పెట్టుబడులకు సురక్షితమైన స్థావరంగా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. పసిడిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాల స్వీకరణ అటుంచి తమ సొమ్ముకు పూర్తిస్థాయి భద్రత లభిస్తుందన్నది ఇన్వెస్టర్ల విశ్వాసం. అందువల్లనే ఇప్పుడు మొత్తం పెట్టుబడులన్నింటినీ బంగారం వైపు మళ్లించారు. మరోవైపు డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా క్షీణించాయి. ప్రస్తుతం 87-88 మధ్యలో ఊగిసలాడుతోంది. ఇక కరెన్సీ సంగతి పక్కనపెడితే ట్రంప్ చేపట్టిన ఈ సుంకాల ప్రహసనం వల్లనే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. దీనితో స్టాక్ మార్కెట్లలో ఏర్పడిన నష్టాన్ని భర్తీచేసుకోడానికి ఇన్వెస్టర్లు సురక్షితంగా భావిస్తున్న బంగారంపై పెట్టుబడులు కుమ్మరిస్తున్నారు. వీటికితోడు ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. బంగారం నిల్వలను స్థిరంగా కొనసాగించే ప్రయత్నంలో ఈకొనుగోళ్లు చేస్తున్నాయి. ఏతావాతా ఈకొనుగోళ్లు, ఈక్విటీల ప్రభావం ఇప్పుడు రిటైల్ మార్కెట్లపై పడుతోంది. మరోపక్క డాలర్ పటిష్టం అవుతుండటం, వివిధ దేశాల కరెన్సీలు బలహీనపడటం వంటివి ప్రత్యక్షంగానే ఇన్వెస్టర్లందరికీ కనిపిస్తున్నాయి. అందువల్లనే బంగారం తమకు సురక్షిత పెట్టుబడుల ధామంగా భావిస్తూ మొత్తం పెట్టుబడులను పసిడిరంగంవైపు మళ్లించారు. అయితే ఇది ఎంతోకాలం ఉండదని తిరిగి మళ్లీధరలు తగ్గుతాయని విశ్లేషకులు చెపుతున్నా సమీప భవిష్యత్తులో ఎక్కడా బంగారం ధరలు తగ్గుతాయన్న అంచనాలు లేవు. ఒకేసారి పెట్టుబడులు పెట్టకుండా రేటు దిగివచ్చినపుడల్లా కొద్దికొద్దిగా కొనుగోలుచేస్తూ తమ పెట్టుబడులను భద్రపరుచుకునే వ్యూహాలు అనుసరిస్తారు. ఈ వైఖరివల్ల ఎటొచ్చీ రిటైల్ కొనుగోలు దారులకే ఎక్కువ భారం అవుతుంది. దీర్ఘకాలికంగా బంగారంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటే గోల్డ్ ఇటిఎఫ్, సావరిన్ గోల్డ్‌ఫండ్, గోల్డ్‌బాండ్ వంటివాటిలో పెట్టుబడులు పెడుతున్నారు. తొలిసారిగా అమెరికా దిగ్గజ బ్యాంకులు హెచ్‌ఎస్‌బిసి, జెపి మోర్గాన్ వంటివి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నుంచి తమ పసిడి నిల్వలను వెనక్కి తీసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు సైతం తమ పసిడి నిల్వల సంరక్షణతోపాటు మరింత పెంచుకుంటున్నాయి. ఈధోరణులే ఇప్పుడు పసిడి ప్రపంచ మార్కెట్లపైనా పడుతోంది. భవిష్యత్తులో పసిడి ధర అమెరికా కమోడిటీ మార్కెట్లలో ఔన్స్ ఒక్కింటికి మూడువేల డాలర్లకు చేరినా ఆశ్చర్యం లేదనిపిస్తోంది. ఫలితంగా ఈప్రభావం భారత్ బులియన్ మార్కెట్లపైనా పడుతుంది. ఇకరానున్న కాలంలో సామాన్యుడు పసిడి కొనలేనిస్థాయికి కమోడిటీ ధరలు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. సమీప భవిష్యత్తులో మనం ఆ రోజులుకూడా చూస్తామని ప్రస్తుత ధరవరలు సూచిస్తున్నాయి. మొత్తంమీద ట్రంప్ పుణ్యమా అని సుంకాల వార్ ప్రభావం బులియన్ మార్కెట్లపై చూపించింది. భవిష్యత్తులో కూడా ఇదే వైఖరి కొనసాగితే పసిడి, వెండిధరలు సామాన్యుడు కొనలేనిస్థితికి వెళతాయని చెప్పేందుకు సందేహించనవసరంలేదనిపిస్తోంది.

మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహ బలం వాటంతట అవే సమకూరుతాయి.




థామస్ ఫుల్లర్

జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.



ఖలీల్‌జిబ్రాన్

# ప్రజావాక్కు



### కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులు

శ్రీకాకుళంనగరంలోని అదిత్యనగర్ కాలనీ, అరసవల్లి ప్రాంతంలో సంచార కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ప్రజలు భయంతో బహిరంగ ప్రదేశాల్లో సంచరించలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రహదారిపైవెళ్లడం కూడా ప్రమాదకరంగా మారింది. ఎందుకంటే వీధికుక్కలు ఆకస్మికంగా దాడి చేస్తుండటంతో అనేకమంది గాయపడుతున్నారు. ఇటీవలే రేబిస్ సోకినకుక్కలు పలువురిపైదాడిచేసి, తీవ్రగాయాలేర్పరిచాయి. ఈకారణంగా ప్రజల్లోభయం పెరుగుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని, వీధికుక్కలను పట్టివేసి టీకాలు వేయించాలని, రోగగ్రస్తమైన కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలనిప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను తక్షణమేపరిష్కరించకపోతే, పరిస్థితి మరింత విషమించి ప్రజల ఆరోగ్యానికి, భద్రతకు ముప్పుగా మారనుంది.

-పి.రాజు, శ్రీకాకుళం జిల్లా

### చెత్తా చెదారంతో అసౌకర్యం

రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల శుభ్రత కోల్పోతుంది. దీనిప్రభావంగా రోగాలు వ్యాపిస్తాయి, ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వచ్ఛ భారత్ అభియాన్ వంటి కార్యక్రమాలు ఉన్నా, ప్రజలు బాధ్యతగా వ్యవహరించకపోతే అవి ప్రయోజనకరంగా ఉండవు.

-సింగు లక్ష్మీనారాయణ, దామెరకుంట, భూపాలపల్లి

### ఆరోగ్యశ్రీ పై అశ్రద్ధ ఎందుకు?

పేదలకు ఉచితంగా వైద్యంఅందించే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయడం జరిగింది. ఇందులో ఎందరో సామాన్య ప్రజల పేద మధ్య తరగతి ప్రజలకు ఉపకారం లభించింది. కానీ నేడు ప్రభుత్వ నిర్లక్ష్యానికి కనుమరుగు కానుంది. బిల్లుల చెల్లింపు విషయంలో ఆలస్యం జరుగుతుందనే సాకుతో ప్రయివేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సి నిలిపి వేయాలని నిర్ణయించారు. ఇది ముమ్మాటికీ శోచనీయం. పేదలకు కేవలం కార్డు ద్వారా అన్నీ రకాల వైద్య సేవలు అందించారు. ప్రభుత్వం తక్షణం చెల్లించాల్సిన బకాయిలు చెలించాలి. అలాగే ఇష్టానుసారంగా బిల్లులు వేస్తున్న ఆసుపత్రులపై గట్టి చర్యలు తీసుకోవాలి.

- కె.నాగరాజు, హైదరాబాద్

### పౌరసేవ ప్రతి పౌరుడి బాధ్యత

పౌర సేవ అనేది ఒక సమాజంలోని వ్యక్తులు పాటించాల్సిన నైతిక, సామాజిక బాధ్యతల సమాహారం. ఇది వ్యక్తిగత స్థాయిలో మాత్రమే కాకుండా, సమాజం మొత్తం సుభిక్షంగా, శుభ్రంగా, శాంతియుతంగా ఉండేలా చేసే అత్యవసరమైన ప్రవర్తన. కానీ, దురదృష్టవశాత్తు, మన దేశంలో పౌరసేవ పెద్దగా ప్రోత్సహించబడలేదు. ఫలితంగా, వీధుల్లో చెత్త వేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, ఇతరులను గౌరవించకుండా ప్రవర్తించడం వంటి సమస్యలు విస్తృతంగా కనిపిస్తాయి. మార్పుకు ప్రయత్నించాలి. ప్రతి పౌరుడు కృషిచేయాలి.

-సింగు.లక్ష్మీనారాయణ, చింతకుంట, కరీంనగర్

### విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందించాలి

ప్రభుత్వ విద్యా సంస్థలలో తప్పనిసరిగా విద్యార్థులకు తగిన క్రీడాసామాగ్రి సరఫరాచేయాలి. కోకో, వాలీబాల్, బ్యాట్మెంటన్, కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రోవంటి క్రీడలలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి అవసరం. మరి ముఖ్యంగా స్పోర్ట్స్ స్కూల్, సైనిక్ స్కూల్, వంటి విద్యా సంస్థలలో మరికొన్ని క్రీడా సామాగ్రి అవసరం. ప్రతి విద్యా సంస్థలలో ఫిజికల్ డైరెక్టర్ . పి ఈ టి ల ద్వారా విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించే వారిని మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, వంటి పోటీలకు ప్రోత్సహించాలి. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ వార్షిక బడ్జెట్లలో క్రీడలకు తగిన బడ్జెట్ కేటాయించాలి. ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. ఆరోగ్యమే మహాభాగ్యం కనుక క్రీడల వలన శారీరక బలం కలుగుతుంది. క్రీడలతోపాటుగా విద్యార్థులకు వ్యాయమం చేయించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### అవినీతిని కట్టడి చేయాలి

భారత దేశంలో అవినీతి రూపుమాపటం కోసం ఏర్పడిన మొట్టమొదటి అవినీతి నిరోధక సంస్థ లోక్పాల్. రాష్ట్రాలలో లోకాయుక్త ఐదేండ్లక్రితం ఇదితన కార్యకలపాలను ప్రారంభించింది. లోక్పాల్ గత ఐదేండ్లకు సంబంధించిన సమాచారం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. దీంతో లోక్పాల్, లోకాయుక్త పనితీరుపై అవినీతి అరికట్టడికి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. లోక్‌పాల్, లోకాయుక్తను బలోపేతం చేసి అవినీతిని కట్టడి చేయాలి. అవినీతి అంతానికి అందరూ సహకరించాలి.

-ఎం. అశోక్‌కుమార్, కరీంనగర్‌జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# టోల్‌గేట్లతో ప్రజల నిలువుదోపిడీ!

*టోల్టాక్స్ ధరలు సింపుల్గా కాకుండావందల రూపాయాలలో వుండటమే కాకుండా దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తున్నప్పుడు వేలరూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ప్రత్యక్షంగా పన్నులు టూరీ యజమానులు చెల్లిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ పరోక్షంగా రావాణా ఖర్చుల భారం సరుకుల ధరలపై పడటం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే సమయంలో అఖిల భారత లారీ యజమానుల సంఘంవారు టోల్‌గేట్లు ఎత్తివేయాలని, కోరుతున్నారు. ఈ కారణంగా సరుకుల చేరవేతలో సమ యం చాలా కలిసివస్తుందని వారు అంటున్నారు, లారీ యజమానులు ఎటువంటి రాయితీ కోరడం లేదు, టోల్గేట్ల ద్వారా ఎంత ఆదాయం వస్తోందో అంటే మొత్తంలో డీసెల్/ పెట్రోల్ ధరలు పెంచి, టోల్గేట్ల తొలగించాలని కోరుతున్న ప్పటికీ కేంద్రప్రభుత్వం మాత్రంటోల్గేట్లను యధావిధిగా కొన సాగించడంలో మర్మమేమిటో కూడా అర్థంకావడం లేదు.*



అన్నవరపు బ్రహ్మయ్య
సీనియర్ పాత్రికేయులు

టోల్ గేట్ల ధరలకు అంతూ పంతు లేకుండా వుంది. ఫాస్ట్ అకౌంట్లో తగినంత డిపాజిట్ లేకపోతే వాహనాలకు రెట్టింపు రుసుము వసూలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చూస్తుంటే టోల్ గేట్ల రూపంలో జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రజలను నిలువుదోపిడీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా వుంది. ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం లేని ఫాస్ట్‌టాగ్ విధానం వల్ల కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ఆదాయం పొందుతోంది. 2024 సంవత్సరంలో కేంద్రప్రభుత్వానికి 68,037,60 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. 2023వ సంవత్సరంతో పోల్చుకొంటే 9.2 శాతం ఎక్కువ. ప్రస్తుతం రోజుకి సగటున 191.14కోట్లరూపాయల ఆదాయం లభిస్తోంది. నిబంధనల ప్రకారం టోలేగేట్ టోల్గేట్ మధ్య కనీసం 50కి.మీ. దూరం వుండాలి. కానీ అనేకప్రాంతాలలో ఈనిబంధన పాటించడం లేదు. ఉదాహరణకి విజయవాడ హైదరాబాద్ హైవేలో కేవలం 60 కి.మీ. దూరంలో రెండు టోల్‌గేట్లు ద్వారా డబ్బు వసూలు చేస్తున్నారు. విజయవాడ నుంచి కేవలం 32 కి.మీ.దూరంలోనే కీసర వద్ద టోల్‌గేట్ వుంది. ఇక్కడ నాలుగు చక్రాల(కారు) వాహనం వెళ్లడానికి 70రూపాయలు, రావడానికి 70 రూపాయల వంతున, ఇక గూడ్స్ /లారీల ఇరుసులను బట్టి 245 నుంచి 520 రూపాయల వంతున వసూలు చేస్తున్నారు. కీసరనుంచి మరో 30కి.మీ. దూరంలో చిల్లకల్లు వద్ద మరో టోల్ గేట్ వుంది. ఇక్కడ కారుకు ఒకవైపు వెళ్లడానికి 105 (వచ్చిపోవడానికి రూ. 160) వంతున, లారీలకు 620 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దేశవ్యాప్తంగా అక్రమంగా 22టోల్ గేట్లు ద్వారా డబ్బు వసూలు చేస్తున్నారు. అదనంగా వున్న టోల్గేట్లను తొలగిస్తామని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ గడచిన మూడు సంవత్సరాలుగా చెబుతూనే వుంది, కానీ ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు. ఈ దోపిడీ చాలదన్నట్టుగా ఫాస్ట్ అకౌంట్లో తగినంత డిపాజిట్ లేకపోతే వాహనాలకు రెట్టింపు రుసుము వసూలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అకౌంట్లో కనీసం 100 రూపాయాలు వుండాలన్న నిబంధన వల్ల ప్రస్తుతం ఫాస్ట్ టాగ్లను నిర్వహిస్తున్న ఎయిర్‌టెల్, జియోలతోపాటు వివిధ ప్రైవేటు బ్యాంక్లకు ఉచితంగా వందల కోట్ల రూపాయలు లభిస్తాయి. 2023-24 సంవత్సరపు లెక్కల ప్రకారం భారత దేశంలో దాదాపు 50 కోట్లకుపైగా నాలుగు చక్రాల వాహనాలు వున్నాయి. ఈ వాహన యజమానులు ఒక్కొక్కరు తమ అకౌంట్లో కనీసం 100 రూపాయలు డిపా జిట్ చేసినా ఆయా బ్యాంక్లు, ఎయిర్ టెల్ వంటి సంస్థల వద్ద ఎవరికీ ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేని 5000 కోట్ల రూపాయల ప్రజల డబ్బు నిల్వ వుండిపోతోం ది. ఇక తగిన డిపాజిట్ లేకపోతే టోల్ రుసుము రెట్టింపు వసూలు చేయడం వల్ల కేంద్రప్రభుత్వానికి ఆదాయం లభి స్తుంది. ఇవికాక దేశవ్యాప్తంగా 2022 నాటికి దాదాపు 50 లక్షల లారీలు/గూడ్స్ వాహనాలు వున్నాయి. వీటి ద్వారా లభించే ఆదాయం అదనం. ఇంత ఖర్చు చేసినా వాహనదారులకు మాత్రం టోల్‌గేట్ల వద్ద వేచివుండే పరిస్థితి మెరుగుపడలేదు. టోల్‌గేట్ నిర్వాహకులు నాసిరకం సెన్సార్లు వినియోగించడంవల్ల, తరచూ పనిచేయకపో వడంతో పెద్దఎత్తున వేచి వుండాల్సి వస్తోంది. పండుగల సమయంలో అయితే గంటల కొద్ది వాహనాలు వరుసలో నిలిచిపోతున్నాయి.



టోల్ గేట్ల వద్ద వాహనాలు మూడు నిమిషాలకు మించి నిలిచి వుండే పక్షంలో టోల్‌ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతారు. కానీ ఆచరణలో అమలు కావడం లేదు. పండుగల సమయంలో టోల్‌గేట్ల వద్ద గంట సేపు వేచివున్నప్పటికీ టాక్స్ వసూలు చేస్తూనే వున్నారు. టోల్ టాక్స్ విధానం అమల్లోకి వచ్చిన సందర్భంలో దేశవ్యాప్తంగా లారీ యజమానులు ఆందోళనవ్యక్తం చేయగా, కొత్తగా నిర్మించిన రహదారులలో రహదారుల నిర్మాణం కోసం చేసిన అప్పు తీరేంత వరకు అంటే 10-15 ఏళ్ల మాత్రమే వసూలు చేస్తామని ఆ తర్వాతటోల్టాక్స్ వుండదని కేంద్రప్రభుత్వం నచ్చచెప్పింది. కాని, వాస్తవంలో 15 ఏళ్లు దాటిన తర్వాత కూడా వసూలు చేస్తూనే వున్నారు. టోల్టాక్స్ కేంద్రప్రభుత్వానికి మంచి ఆదాయ వనరుగా మారడం టోల్ ఆదాయంపై మరింత ఆశపెరిగింది. ఇదే సమయంలో రెండేళ్ల క్రితం వరకు నాలుగు లైన్లు అంతకు మించి లైన్లు వున్న రహదారులకు మాత్రమే టోల్గేట్లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసేవారు. కాని తాజాగా కేవలం రెండు లైన్ల రహదారులకు కూడా టోల్ గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. యూరోపియన్ దేశాలలో టోల్ రహదారులు, సాధారణ రహదారులు కూడా వుంటాయి. వాహనదారులు సాధారణ రహదారులపై ప్రయాణం చేస్తే టోల్‌టాక్స్ చెల్లించాల్సిన పనిలేదు. మన దేశంలో మనకు ఇష్టం వున్నాలేక పోయినా టోల్‌టాక్స్ రహదారులపై మాత్రమే ప్రయాణం చేయాలి. నిజానికి వాహనాలు కొనుగోలు చేసే సమయంలో28శాతం జిఎస్టితోపాటు రోడ్‌టాక్స్ కూడా వసూలుచేస్తారు. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి వాహనం ఖరీదులో 12 నుంచి 17 శాతం వరకు వసూలు చేస్తున్నారు. అంటే 20 లక్షల రూపాయల వాహనం కొంటే 2.40నుంచి3.40 లక్షల వరకు రోడ్డు టాక్స్ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఒక వాహనం వుండగా మరో వాహనం కొనుగోలు చేస్తే అదనంగా రెండు శాతం వసూలు చేస్తారు. అంటే ఇప్పటికే మనకు స్కూటర్ వుండి, కొత్తగా కారుకొనుగోలు చేస్తే లక్షకి 2శాతం వంతున 20వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తారు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే జాతీయ రహదారుల అభివృద్ధికిగాను కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులపై రోడ్ డెవలప్మెంట్ సెస్సు విధిస్తోంది. ప్రస్తుతం ప్రజలు ప్రతి లీటర్ డీసెల్/ పెట్రోల్ ధరలో 7రూపాయలను జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నాం. ఈ టాక్స్ ద్వారా 2022 23 సంవత్సరంలో దాదాపు 22 వేల కోట్ల రూపాయాలు వసూలుచేసింది. నిబంధనల ప్రకారం ఈనిధులను రహదారులు అభివృద్ధికి వినియోగించాల్సివుంది. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. మొత్తంగా గమనిస్తే ఒక వాహనదారుడి నుంచి రోడ్‌టాక్స్ పేరిట తొలుత రోడ్డు టాక్స్, ఆ తర్వాత డిసెల్/పెట్రోల్ ద్వారా రోడ్‌సెస్ వసూలు చేయడంతో పాటుమరల జాతీయ రహదారిపైకి వస్తే టోల్‌టాక్స్ అంటూ మొత్తం మూడు రకాలు ప్రజల పన్నులను వసూలు చేస్తున్నాయి. టోల్టాక్స్, జిఎస్టిది, రోడ్‌టాక్స్ వంటి పన్నుల ప్రస్తావన వచ్చినప్పుడు వాహనాలనేవి ధనవంతులకు సంబంధించిన అంశమని, వీటితో సామాన్యులకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? అంటూ అధికారంలో వున్న నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. టోల్టాక్స్ ధరలు సింపుల్గా కాకుండావందల రూపాయాలలో వుండటమే కాకుండా దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తున్నప్పుడు వేలరూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ప్రత్యక్షంగా పన్నులు టూరీ యజమానులు చెల్లిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ పరోక్షంగా రావాణా ఖర్చుల భారం సరుకుల ధరలపై పడటం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే సమయంలో అఖిల భారత లారీ యజమానుల సంఘంవారు టోల్‌గేట్లు ఎత్తివేయాలని, కోరుతున్నారు. ఈ కారణంగా సరుకుల చేరవేతలో సమయం చాలా కలిసివస్తుందని వారు అంటున్నారు, లారీ యజమానులు ఎటువంటి రాయితీ కోరడం లేదు, టోల్గేట్ల ద్వారా ఎంత ఆదాయం వస్తోందో అంటే మొత్తంలో డీసెల్/పెట్రోల్ ధరలు పెంచి, టోల్గేట్ల తొలగించాలని కోరుతున్నప్పటికీ కేంద్రప్రభుత్వం మాత్రంటోల్గేట్లను యధావిధిగా కొనసాగించడంలో మర్మమేమిటో కూడా అర్థంకావడం లేదు. ●

# ప్రాణాలను కబళిస్తున్న కలుషిత నీరు

బి. మధు

బయట హోటళ్లలోనో లేక రోడ్డు ప్రక్కన వున్న బండి కొట్టు వాళ్ల దగ్గరనో నీరుత్రాగడం వల్ల అవి పొరపాటున కలుషితమై వుంటే మాత్రం కోరికోరి సీజనల్ వ్యాధులను మనం కొని తెచ్చుకున్నట్లే. ఎందుకంటే కలుషితమైన నీరు సేవనం వలన మానవాళి విలువైన ప్రాణాలకు సైతం పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఎల్లవేళలా పొంచి ఉంటుంది. ముఖ్యంగా కలుషితమైన నీరు తీసుకోవడం మూలాన మానవాళి అతిసార, న్యూమోనియా, చికెన్ పాక్స్ వంటి వ్యాధుల బారినపడి అనేక రకాల ఇబ్బందులకు, ఇక్కట్లకు, అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నారు అనే మాట సత్య దూరంకాదు. అయితే మానవాళి ఇలాంటి సీజనల్ వ్యాధుల బారినపడి అనవసరమైన ఇబ్బందులపాలు కాకుండా ఉండాలంటే మాత్రం కాచి వడబోసి చల్లార్చిన నీరే ప్రజలకు శ్రీరామరక్ష వంటిది. అంతేకాదు మనం బయటకు ఎక్కడికి వెళ్లినా మన గృహం నుంచే స్వచ్ఛమైన ఫిల్టర్ అయిన బాటిల్ నీళ్లను తీసుకెళ్లడం ఎంతైనా ఆరోగ్యకరమైన విషయం. ఎందుకంటే చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునే కన్నా ముందు జాగ్రత్తగా మనం మంచి పరిశుభ్రమైన నీరును ఎప్పుడు అందుబాటులో పెట్టుకుంటే అది మన ఇంటికి ఒంటికి ఎంతో మంచిది. అంతేగాకుండా కలుషితమైన నీరు సేవించడం అనేది మనల్ని ఎంతటి ప్రమాదకరస్థితిలోకి నెట్టివేస్తుంది. అంటే డయేరియా వంటి వ్యాధులు సంక్రమించి ఒక్కొక్కసారి వాంతులు, విరేచనాలు సైతం సంభవించి మానవాళి వున్న ఫలంగా ప్రమాదపు టంచుల్లోకి వెళ్లడమే కాదు ఒక్కొక్కసారి మన కాలం కర్మం సరిగా లేకపోతే మరణాలు సైతం సంభవిస్తూ వుంటాయి.



కాబట్టి నిత్యం మనం స్వచ్ఛమైన నీరు త్రాగడం వంటి ఓ మంచి చిట్కాను పాటించడం వలన మన ఆరోగ్యం మరో పది కాలాల పాటు వర్ధిల్లడంతో పాటు మనకు ఎలాంటి అనారోగ్యకరమైన సమస్యలు తలెత్తకుండా మన జీవితాలు సాఫీగా సాగేందుకు ఎంతగానో ఆ స్వచ్ఛమైన నీళ్లు దోహదం చేస్తాయి అనే మాట సత్యదూరం కాదు. అన్నింటికి మించి బయట దొరికే చిరుతిండ్ల మూలాన మన ఆరోగ్యానికి ఎక్కువగా చేటు తెస్తున్నది మాత్రం పానీపూరి కోసం వాడుతున్న నీరు కలుషితం అవుతుండటమే అనే మాట అక్షర సత్యం. ఈ విషయంలో మాత్రం అత్యంత అప్రమత్తంగా, జాగ్రత్తగా వ్యవహరించి వీలైనంతవరకు రోడ్లప్రక్కన బండ్లలో దొరికే చిరుతిండ్లకు ప్రజలంతా దూరంగా ఉండటమే ఎంతో సురక్షితం. ఏదిఏమైన తెలిసో తెలియకో బయటకు వెళ్ళినప్పుడు కలుషితమైన నీరు సేవించడం వలన అది మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి మనకు ఎనలేని హాని చేకూర్చవచ్చు. ఒక్కొక్కసారి అది మనపై దీర్ఘకాలికంగా కూడా చాలా తీవ్ర స్థాయిలో ప్రభావం చూపి మొదటికే మోసం చేకూర్చవచ్చు. ఏమైనా ఆరోగ్యమే మహాభాగ్యం అని మనపెద్దలు సెలవు ఇచ్చినట్లుగా మన ఆరోగ్యాన్ని పదికాలల పాటు కాపాడుకోవడం అనేది మన చేతుల్లోనే వుంది. అలాకాకుండా విచ్చలవిడిగా బయట హోటళ్లలోనో, మరే ఇతర ప్రాంతాలలోనో దొరికే నీటిని త్రాగితే మాత్రం చేజేతులారా మన ఆరోగ్యాన్ని భ్రష్టు పట్టించుకున్న వారమవుతాం. అధోగతి పాలు అయ్యే దారుణ పరిస్థితిని మనం కల్పించుకున్న వారమవుతాం. కాబట్టి వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని మనం ఎల్లవేళలా స్వచ్ఛమైన, పరిశుభ్రమైన, కాచి వడబోసిన నీటిని సేవిస్తే మాత్రం మనం ఓ మంచి ఆరోగ్యవంతులుగా, ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా అత్యంత సురక్షితంగా సుదీర్ఘకాలం పాటు మన జీవిత నౌకను అత్యంత దిగ్విజయంగా ముందుకు తీసు కెళ్లిన వారమవుతాం. ●

# దేశ అభివృద్ధికి కులగణన అవసరం

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

డెబ్బైఐదు వసంతాల స్వతంత్రభారతావనిలో సామ్యవాదతరహా సమాజస్థాపన గాలిలో దీపం లాగా కూడా లేకుండా ఆరిపోయి అందున సగటు మనిషిగా కూడా జీవనం సాగించలేని పరిస్థితుల్లో అశేష ప్రజానీకం నేడు దేశంలో ఉండగా నేడు కులగణలతో పేదలను లెక్కించాలని కూడా లేకుండా విభజించి పాలించు అను వలస నినాదంతో నేటి మనపాలకులు కులాల లెక్కల విధానాలు ఉండడం ఈ దేశానికి పట్టిన దౌర్భాగ్యం. గత 75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో మన పాలకుల చేతిలో ఉన్న దేశంలో నేడు ఉన్నత ఆదాయ వర్గాల ఒకే ఒక శాతం చేతులో 40శాతం సంపద కేంద్రీకరణ జరిగింది. వారి దగ్గర ఉన్న సంపద విలువ 54 మిలియన్ల రూపాయలు. పదివేల మంది ధనికుల దగ్గర సగటున 22.6 బిలియన్లు కూడబెట్టుకోగలిగినారు. ఇది సగటు భారతీయుని ఆదాయము కన్నా ఎక్కువ. ఈవిధంగా దేశంలో సంపద ఆదాయ అసమానతలున్నాయి. ఇది మన పాలకుల ఆర్థిక విధానాలఫలితం. ఇక ప్రజలకు ఉచితలే గతి అయినాయి. అయితే ఉచితాలు ఇస్తే పని చేయరంటూ ఇంకొక విచిత్ర వాదన దేశంలో ప్రారంభమైనది. పని ఉంటే కదా పనిచేసేది. తమ బిడ్డలకు ఉద్యోగాలు లేక తమకు ఉపాధి లేక బ్రతికేందుకు అవమానంతో ఉచితాల కోసం ఎగబ్రాకే పరిస్థితులు ప్రజలకు కల్పించింది ఎవరు? పాలించుచున్నది మనమే కదా విదేశీయులు ఎప్పుడో వెళ్లిపోయారు కదా? ఆ తర్వాతనే కదా జరిగిన ఆర్థిక వృద్ధి కొంత మంది చేతుల్లోకి పోయింది. ఉత్పత్తి ప్రక్రియకు దూరంగా ప్రజలను ఎందుకు నెట్టివేసిశారు? ఈ దేశసంపద ఎందుకు అందరిదీ కాకుండా పోయింది? బీదలు ఒకవైపు బిలియనీర్లు మరొకవైపు. దేశంలో పాలకులకు కనపడటం లేదా? సమస్య ఇదైతే కులాల మధ్యచిచ్చా? స్వాతంత్రం వచ్చి 78సంవత్సరాలు అవుతున్నా ఏమి సాధించాం? నేడు ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య అంతరాలు పెరిగాయి. రాజ్యాంగాన్ని గురించి మనం సరిగ్గా ఆలోచిస్తున్నామా ప్రజల ఆకాంక్షల కోరికలను ఒక రాజకీయ ప్రక్రియ ద్వారా సంవిధానం చేయాలి కదా. నేడు ప్రజా అవసరాల రీత్యా ప్రభుత్వాలు నడుస్తున్నాయా? అదేవిధంగా పాలిస్తున్నారా? బ్రతుకు తెరువు కోసం ఇంకా వలస పక్షుల వలె ప్రయాణమెందుకు? బ్రిటిష్ రాజ్యాధికారాన్ని పారదోలి ప్రజాస్వామ్య దేశంగా భారత్ అవతరించాలని ఆనాడు కోరుకున్న కలలు చెదిరిపోతున్నాయి. దేశంలో డెమోక్రసీ ప్లూటోగ్రఫీగా మారింది. దేశపాలన అవినీతిపరులు కోటీశ్వరులు, మహా కోటీశ్వరులు ప్రధాన పాత్రపోషిస్తున్నారు. నేర చరిత్ర కలవారు కోటీశ్వరుల పాలనతో భారత్ అల్లాడిపోతున్నది. ప్రజల ఆదాయాలు జాతీయఆదాయంలో వారి వాటా క్రమంగా తగ్గిపోతున్నాయి. మధ్యతరగతి పేదలు కొనే వస్తుసేవలపై పన్ను



లు పెరిగిపోతూ కార్పొరేటర్లు కట్టే పన్నులు మాత్రం తగ్గిపోతున్నాయి. బిలినియర్ల రాజ్యంలో పేదలకు ఉచితాలే గతా? పాలకుల ఆర్థిక విధానాల వలన ఆదాయ అసమానతలు పెరిగి పేదలు నిరుపేదలుగా అయ్యారు. 1990ల మధ్య కాలంలో దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్న బిలేనీర్లు ప్రస్తుతం 334మందికి చేరారు. ఆనాడు ఆ ఇద్దరుబిలినీయర్ల ఆస్తులు విలువ 3.2 బిలియన్ డాలర్లు మాత్రమే. నేడు ఉన్న334 మంది బిలినియర్ల దగ్గర 954 బిలియన్ డాలర్లు ఈ విధంగా దేశ సంపద కొంతమంది చేతుల్లోకిపోవడం వలన ఆదాయ అసమానతలు పెరిగి మానవాభివృద్ధి వెనుకబడిపోయింది. ఆర్థిక అభివృద్ధి అందరికీ సంబంధించినదిగా ఉండాలి. అది మానవాభివృద్ధిగా ఉండాలని మహాత్మాగాంధీ అభిప్రాయం నేడు ప్రపంచ దేశాలు జరుగుతున్న అభివృద్ధి కొందరిదిగానే ఉంటూ ఆయా దేశాల్లో ఉన్న వనరులను అప్పనంగా పాలకుల నుంచి పెట్టుబడిదారులు పొందుతూ మిలియనీర్లు బిలినియర్లుగా మారుతూ అరకొర ఉద్యోగ అవకాశాలు కల్పించి అశేష ప్రజానీకాన్ని పేదరికంలో ఉంచుతూ జరిగే అభివృద్ధి అందరి వృద్ధికాదు. ఎకానమిక్‌సర్వే నివేదిక ప్రకారం మన దేశంలో 78.5 లక్షలు ఉద్యోగాలు 2030 వరకు ప్రతి సంవత్సరం వ్యవసాయేతర రంగాల్లో కల్పించాల్సి ఉంటుంది. ఇంత మేర ఉద్యోగ కల్పన మన అపరకుబేరులు కల్పించగలరా? 2024 హురున్ రిచ్‌లిస్టులో వెల్లడించినట్టు ఇండియాలో మొత్తం 334 మంది బిలీనియర్లు ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే 75మంది పెరిగారు. ప్రస్తుతం 1500మందికి పైగా వ్యక్తుల్లో వెయ్యి కోట్లు పైగా నికర విలువను కలిగి ఉన్నారు. ఇది ఏడేళ్ల క్రితంతో పోలిస్తే గణనీయంగా 50శాతం వృద్ధి చెందింది. దేశంలో ఇంతమంది సంపద కలిగిన వ్యక్తులుండడం మంచిదే గాని యువకులు నిరుద్యోగంతో ఉండగా 80కోట్ల మందికి పైగా ప్రజలు ఉచితంగా రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. సగానికి పైగా జనాభా 57శాతం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యువజన పథకం కింద 81.35 కోట్ల మందికి ఐదు కిలోలు బియ్యం ఉచితంగా కల్పించే పరిస్థితి ఎందుకు ఏర్పడిందో అర్థం కాదు? ఉద్యోగితను ఉపాధి కల్పించకుండా ఆదాయ కల్పన చేయకుండా ప్రభుత్వాలు పాలనసాగిస్తున్నాయి. దేశ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసేదే కులగణననా? దీని ద్వారా ఏ కులం వారు అభివృద్ధి ప్రక్రియలో మమేకం కాలేకపోయారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందలేకపోయారు. ఇది దేశ అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రభుత్వం 50శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేసి పేదలను వెనుకబడిన కులాలను వృద్ధి ప్రక్రియలు మమేకం చేయాలి. కులగణనకు పేదరిక కోణం నుంచి చూడాలి. అప్పుడు ఎవరికి ఏమి అభ్యంతరం ఉండదు. కులగణన వలన అందరి అభివృద్ధికి మార్గం ఏర్పడుతుంది. నిరుపేద వర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం సంపద ఉద్యోగం రాజకీయ అవకాశాల్లో వారి వాటా వారికి దక్కినప్పుడు దేశ అభివృద్ధి అందరిదిగా ఉంటుంది. దీని కోసమే కులగణన జరగాలి. అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుంది. ●

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు

**ఒంగోలు, ప్రభాతవార్త**





జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల కోసం ఒంగోలు నగరం శివారులోని ఐదు ప్రాంతాలలో ఏడు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పటిష్ట భద్రత మధ్య క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. క్విజ్, రైస్, పేస్ కాలేజీ సెంటర్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తనిఖీ చేశారు. నాగార్జున, హర్షిణి, క్విజ్, పేస్, రైజ్ కాలేజీ సెంటర్లను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తనిఖీ చేశారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ స్వయంగా ఆయా కేంద్రాలలో భద్రతను పరిశీలించారు. ఏ.ఎస్.పి, డి.ఎస్.పీ.లు కూడా భద్రత విధులను పర్యవేక్షించారు. ఉదయం, మధ్యాహ్నం రెండుపూటలా ఈ పరీక్షలు జరిగాయి. మొత్తం 4544 మంది అభ్యర్థులకుగాను ఉదయం 3968 (87.32) మంది, మధ్యాహ్నం 3965 (87.25) మంది పరీక్షలకు హాజరయ్యారు.

## కనిగిరిలో ఫ్లోరోసిస్ నివారణకు తాగునీరు ప్రాజెక్టు

- పైపులైన్ మార్పు ప్రణాళిక
- ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమీక్ష
- డీఐ పైపులైన్ ఏర్పాటుకు చర్యలు

**కనిగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రామతీర్థం పైపు లైన్ మార్పు ప్రణాళికలు వేగవంతమయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగర్ నీటిని సరఫరా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పైపులైన్‌లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చ జరిగింది. ఫ్లోరోసిస్ ప్రభావాన్ని తగ్గించేందుకు పరిశుభ్రతమైన తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రామతీర్థం రిజర్వాయర్ నుంచి కనిగిరికి సరఫరా అయ్యే పైపులైన్‌లో డామేజ్ అయిన పైపులను మార్చడంతో పాటు, మొత్తం పైపులైన్‌ను డక్టైల్ ఐరన్(డీఐ) పైపులైన్‌గా మారుస్తామని అధికారులు తెలిపారు. దీని వల్ల సాగు నీటి సరఫరా పెరగడంతో పాటు, ఫ్లోరైడ్ ప్రభావాన్ని తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న గ్రామాలను పరిశీలించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పునుగోడు నీటి సరఫరా కేంద్రాన్ని సందర్శించారు. దిరిసవంచ, కమ్మవారిపల్లి, పునుగోడు ఎస్టీ కాలనీ గ్రామాల్లో నీటి నమూనాలను సేకరించి ఫ్లోరైడ్ స్థాయిలను పరీక్షించారు. నివేదిక ప్రకారం, ఈ గ్రామాల్లో ఫ్లోరైడ్ లెవెల్స్ 4.9, 3.3, 5.7 పీపీఎం ఉన్నట్లు గుర్తించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే కనిగిరిలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాల శంకరరావు, ఈఈ ఎం.సురేష్‌బాబు, డీఈఈ వి.విశ్వనాథరెడ్డి, ఏఈఈ ఎం.శ్రీకాంత్, నీటి నాణ్యత తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యసేవల్లో కొత్త మైలు రాయి

- ఒంగోలులో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి డోలా

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



వైద్యసేవల్లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కొత్త మైలు రాయిగా నిలుస్తుందని, రోగుల సేవలో 3,000మంది ఉద్యోగులు రమేష్ హాస్పిటల్స్ 36 ఏళ్ల ప్రయాణంలో 3,000 మందికి పైగా వైద్య సిబ్బంది "వసుధైక కుటుంబం"గా పనిచేస్తూ, నిస్వార్థ సేవలందిస్తున్నారని డాక్టర్.రమేష్ బాబు అన్నారు. ఒంగోలులో నూతన హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, అతిథులుగా పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఐ.ఏ.ఎస్,ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తదితరులు హాజరై ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో అత్యుత్తమ మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఒంగోలులో సంఘమిత్ర హాస్పిటల్‌ను తీసుకుని గత 8 సంవత్సరములగా విజయవంతంగా నడిపిస్తుందన్నారు. ఈ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజల అభీష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎకానమీ, ఆరోగ్యశ్రీ స్కీమ్ లబ్ధిదారులకు కూడా అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఇప్పటికే ఉన్న 150 పడకల హాస్పిటల్‌ను అదనంగా మరో 100 పడకలతో విస్తరించామని హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు తెలిపారు. వైద్యరంగంలో తాము 36 ఏళ్ళుగా 1988లో ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడలో మొట్టమొదటి కార్డియాక్ సెంటర్‌ను స్థాపించడం ద్వారా రమేష్ హాస్పిటల్స్ తన ప్రయాణాన్ని ప్రారంభించింది. వైద్య నిపుణుల,వ్యాధి నిర్ధారణ పరికరాల లభ్యత తక్కువగా ఉన్న ఆ సమయం నుంచి, వైద్య విద్యార్థులకు మెడికల్ ట్రైనింగ్ మరియు అత్యంత ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరికరాలను దిగుమతి చేసుకోవడం ద్వారా అత్యాధునిక వైద్య సేవలు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. కార్యక్రమలో ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఏ.ఆర్.దామోదర్, ఐ.పీ.ఎస్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.టి.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ డీప్ టెక్ నైపుణ్య సంస్థ డైరెక్టర్ కొసరాజు శ్రీధర్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డైరెక్టర్ మధుస్మిత పోతినేని, ఛైర్మన్ మద్దిపాటి సీతా రామమోహనరావు, రీజినల్ సీ.ఈ.ఓ దేవానంద్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. మమత రాయపాటి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా విజేతలకు షీల్డ్స్ ప్రదానం

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



నెహ్రూ యువకేంద్ర మై భారత్ జిల్లాస్థాయి క్రీడల పోటీలు స్థానిక డిఆర్ఆర్ఎం హైస్కూల్ మైదానంలో జరిగాయి. బ్లాక్, క్లస్టర్ లెవెల్ విజేతలు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలలో విజేతలగా నిలిచిన ఆర్‌జియుకెటి కళాశాల, క్విస్ కళాశాల జట్లకు ఎన్‌వైకె డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ కమల్‌సా, స్టెప్ సిఇఓ శ్రీమన్నారాయణ సర్టిఫికేట్, షీల్డ్ ప్రదానం చేశారు.

## జిల్లా హాకీ జట్టు ఎంపిక

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

జిల్లా సీనియర్ హాకీ పురుషుల జట్టు ఎంపిక పోటీలు స్థానిక డిఆర్ఆర్ఎం హైస్కూల్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సుందరరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, వీరంతా మార్చి 6-8 తేదీలలో గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

## క్యాన్సర్ పై అందరికీ అవగాహన అవసరం

**ఒంగోలు, ప్రభాతవార్త**




గ్రామీణ వైద్యుల మరియు మణిపాల్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన మరియు మహిళలకు సంబంధించిన పాప్స్మెర్, మామోగ్రామ్,నోటి క్యాన్సర్ లకు సంబంధించిన పరీక్షలను 62 మందికి ఉచితంగా చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వేముల మాలకొండయ్యా, బాల, దాసరి సుధాకర్ ఒంగోలు పట్టణం నుండి పోలవరపు సుధాకర్, రమేష్, రాజా, శ్రీను, మణిపాల్ హాస్పిటల్ విద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మోసం కనిపెట్టు అక్రమాల పనిపట్టు

- మీటర్ టాంపరింగ్‌తో వాహనదారుల జేబులకు చిల్లు
- పెట్రోలు బంకుల్లో మాయాజాలం

**ఒంగోలు, ప్రభాతవార్త**

కొన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది. కొత్త తరహాలో వాహనదారులను మోస గిస్తున్నారు. ఫిల్లింగ్ యంత్రాలలో చిప్‌లు అమర్చి రీడింగ్ మీటర్‌పై చూపించిన దానికంటే 10శాతం తక్కువ ఇంధనం పడుతున్న ఉదాంతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కలకలం రేగుతుంది. అనుమానం వచ్చి పరీక్షించిన ఎక్కడా దొరక్కుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మరో వైపు వాహనదారులు అవగాహన, అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఒంగోలు నడిబొడ్డున అద్దంకి బస్టాండ్ సమీపంలో ఉన్న ఒక పెట్రోల్ బంకులో చోటు చేసుకున్న సంఘటన చూసిన వారంతా ఒక్క సారి అవాక్కయ్యారు. ఒక బైక్ యజమాని పది లీటర్ల పెట్రోల్ తన వాహనానికి కొట్టించుకున్నాడు. అతనికి అనుమానం వచ్చి దానిని మరలా కొలత వేయమని పెట్రోల్ బంకు పంపింగ్ బాయ్‌తో వాగ్వివాదానికి దిగారు. కొద్ది సేపు ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. కొందరు వాహనదారులు కొలత వేయమని నిలదీయగా చేసేదేమి లేక దానిని మరలా తీసి చూడగా తొమ్మిది లీటర్లే ఉంది. దీంతో అక్కడ ఉన్న వాళ్లంతా అవాక్కయ్యారు. మళ్లీ లీటరు కొడతాను అని కొట్టి పంపించడం జరిగింది.




ఇలాంటి సంఘటనలు పెట్రోల్ బంకులో తరచూ జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. మీటర్ జీరోపై ఉన్నంత మాత్రం మోసం జరిగిందని భావించవద్దు. కొన్ని పెట్రోలు బంకుల్లో జంప్ ట్రిక్ వినియోగించి మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా మీటర్ జంప్ 4,5 మధ్యలో ఉండాలి. కొన్నింటిలో ఇంధనం నింపడం ప్రారంభించగానే ఒకే సారి 10 నుంచి మొదలవు తుంది. డీజిల్ విషయంలో ఇది 20 దాటి పోతుంది. రీడింగ్‌లో వేగంగా అసాధారణంగా ఉంటే ప్రశ్నించాలి. సాంద్రతపై ఇంధన నాణ్యత ఆధారపడి ఉంటుంది. ఫిల్లింగ్ యంత్రంపై సాంద్రతకి సంబంధించి మీటర్‌లో ప్రత్యేక విభాగం ఉంటుంది. పెట్రోల్ అయితే డెనిసిటి 710-770 మధ్య, డీజిల్ 820-860 మధ్యలో ఉండాలి. కొన్ని బంకుల్లో మీటర్లను సైతం టాంపర్ చేస్తున్నారు. ఇంధనం పట్టేటప్పుడు పైపులో నుంచి వచ్చే ధారను గమణించాలి. అది వేగంగా ఉంటే అది అనుమానించాల్సిందే. మనకంటే ముందు వాహనదారు వంద రూపాయలు పెట్రోల్ కొట్టించారు. తరువాత మనం రూ.300లు పోయమని అడిగితే బంకు సిబ్బంది మీటరును జీరో చేయకుండా అలాగే పెడితే రూ.200ల పెట్రోల్ మాత్రమే వస్తుంది. అందుకే పంపు మీటరును జీరో(సున్నా) చేశాడో లేదో ఖచ్చితంగా గమనించాలి.పెట్రోలు బంకుల్లో మోసం జరిగినట్లు గుర్తిస్తే అక్కడ ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేయాలి. ప్రతి పెట్రోల్‌బంకులో విధిగా ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి. ప్రతి ఆయిల్ కంపెనీ ఆడిట్ సమయంలో వాటిని సమీక్షిస్తుంది. ఒక వేళఫిర్యాదుల పుస్తకం ఇవ్వడానికి నిర్వాహకులు ఒప్పుకోకపోతే ఆయిల్ కంపెనీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోల్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

## ఇంటర్ పరీక్షల నిర్వహణ విధుల్లో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**






ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ విధుల్లో ఎంత మాత్రం అలసత్వం, నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ పరీక్షల విధులలో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, స్క్వాడ్ సభ్యులకు ఆదివారం ఒంగోలులోని ఏకేవీకే డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కేంద్రాలలో పరీక్షల నిర్వహణలో మీదే కీలక పాత్ర అన్నారు. పరీక్ష కేంద్రంపై చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి సంవత్సరం చేస్తున్న డ్యూటీయే కదా అని తేలికగా తీసుకునే ఆలోచనా ధోరణి ఉండరాదని కలెక్టర్ స్పష్ట ంచేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేటిని అనుమతించరాదని స్పష్టం చేశారు. తనిఖీలు, పరీక్షల నిర్వహణలో పకడ్బందీగా ఉండాలని, అలాగని విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేలా వారి పట్ల అనుచితంగా వ్యవహరించరాదని చెప్పారు. తమ కేంద్రాల్లో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత వీచీఫ్ సూపరింటెండెంట్లదే అని స్పష్టం చేశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించి జిల్లా యంత్రాంగానికి అప్రతిష్ట తీసుకువస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. పరీక్షల నిర్వహణకు సమయం ఉన్నందున ఆయా పరీక్ష కేంద్రాలపై అవగాహన కోసం ముందుగానే వెళ్లి పరిశీలించాలని అందరికి దిశానిర్దేశం చేశారు. హాల్ టికెట్లపైన విద్యార్థులు చదువుతున్న కాలేజీల ప్రిన్సిపాల్ సంతకం ఖచ్చితంగా ఉండాలనే నిబంధన ఏమీ లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. హాల్ టికెట్లు మంజూరు చేయాలంటే పెండింగ్‌లో ఉన్న కాలేజీ/ మెస్ ఫీజు చెల్లించాలని విద్యార్థులపైన ప్రైవేటు కాలేజీలు ఒత్తిడి తెస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. వాట్సప్ ద్వారాను విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ సైమన్ విక్టర్, ఇంటర్మీడియట్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ ఐ.శ్రీనివాసరావు, ఎగ్జామ్స్ కంట్రోలర్ వివి సుబ్బారావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ఆంజనేయులు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, స్వరూప రాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అటకెక్కిన పారిశుధ్యం

- ఏ కార్యదర్శి విధులు నిర్వహించలేని పరిస్థితి
- గ్రామాలలో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం
- అమ్మో దొడ్డవరం పంచాయతీపై దృష్టి పెట్టని పరిస్థితి
- కార్యదర్శులు పంచాయతీపై దృష్టి పెట్టని పరిస్థితి
- గ్రామాలలో పేరుకు పోతున్న చెత్త, పిచ్చి మొక్కలు
- చెత్త బండి తిరగని పరిస్థితి.. బజారులో దుర్గంధం
- దళిత, బీసీ కాలనీలలో చెత్త కుప్పలు దర్శనం




**మద్దిపాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామాలలో పారిశుధ్యం పరిహాసంగా మారింది. పారిశుధ్యమా..! అది ఏమిటి అనే పరిస్థితులకు ప్రజలు అలవాటు పడుతున్నారంటే సమస్య తీవ్రత ఎంతో అర్థమైపోతుంది. గ్రామాలలో పారిశుధ్యం కనుమరుగు అయిపోతూ మురికికూపాలుగా మారిపోతున్నాయి. మండల పరిధిలోని దొడ్డవరం గ్రామంలో ప్రధాన వీధుల వెంట పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. సైడు కాలువలు ఉన్నా కూడా పారిశుధ్యం నిర్వహించినటువంటి పరిస్థితి. పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీలో సైడు డ్రైన్లు లేక అల్లాడుతుంటే ఉన్న సైడు డ్రైన్లో పూడిక తీత పిచ్చి మొక్కలను తొలగించేందుకు కూడా గ్రామ కార్యదర్శికి, మనసురాలేదేమో అని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా గ్రామంలోని చెత్తను తీసుకువచ్చి మెయిన్ రోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, వ్యవసాయ సహకార సంఘం సొసైటీ వద్ద వేయడం దారుణం. దారుణాన్ని విమర్శిస్తున్న తెలియపరిచిన పట్టీ వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సమస్యలను చెప్పుకుందాం అంటే ఇన్‌ఛార్జీ కార్యదర్శి అందుబాటులో లేని పరిస్థితి. ఫోన్ ద్వారా అడిగిన సందర్భంలో మద్దిపాడు పంచాయతీ కార్యాలను ఉన్నారని చెప్తూ పరిపాలన విభాగాన్ని అట్టకు ఎక్కిస్తున్న పరిస్థితి. గత కొన్ని నెలల నుంచి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించే పరిస్థితి లేనటువంటి విధానం. ఒక వేళ చెత్తను వీదుల వెంట సేకరిస్తే చెత్త ద్వారా సంపద కేంద్రానికి తరలించే పరిస్థితి లేకపోవడం దారుణమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాల్సి ఉండగా వ్యవసాయ సహకార సంఘం సొసైటీ, పాత గార్లపాడు పోయే రోడ్డు వెంబడి పడవేయడమేమిటో తెలియని పరిస్థితి. ఇక ప్రధాన వీధిలోని ఎంపీపీ పాఠశాల వెనుక భాగంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద మరుగు కాలంలోనే చెత్తను తొలగించినటువంటి పరిస్థితి. దీంతో చిన్నారులు దోమలు కుట్టడంతో జ్వరాల భారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో వాటర్ స్కీం రోజు నీటిని సరఫరా చేసేవారు. గ్రామ పంచాయతీలో వాటర్ స్కీం నందు అవినీతి బయటపడటంతో స్కీమ్‌ని సక్రమంగా నడపలేక గ్రామంలోని ప్రజలు పన్నులు కడితే ఏమవుతుందోనని ఏ నాయకుడు, ఏ అధికారి వాడుకుంటాడో అని భయం ఆందోళనలో గ్రామస్తులు ఇంటి పన్ను నీటి పన్నులు కట్టేందుకు సుఖముఖంగా లేరు. గతంలో పంచాయతీలో జరిగినటువంటి అవినీతి వలన గ్రామ పంచాయతీలో ఉద్యోగం చేయడానికి పంచాయతీ కార్యదర్శులు అమ్మో దొడ్డవరం పంచాయతీయా.. అన్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బదిలీల్లో భాగంగా దొడ్డవరం గ్రామానికి నూతన పంచాయతీ కార్యదర్శి రావడం జరిగింది. ఆ కార్యదర్శి పాలకమండలి సభ్యుల వివిధ కారణాలు చూపించి ఒత్తిడి తేవడంతో అప్పుడు ఉన్నటువంటి ఎంపీడీఓ వల్లభనేని జ్యోతి ఆ పంచాయతీలో పని చేయలేనంటూ అనేక పర్యాయాలు ఎంపీడీఓ ముందు వాపోవడం జరిగింది. ఆ పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ జ్యోతి నేను కూడా మీకు సహకరిస్తానని హామీ ఇవ్వడంతో రెండు నెలలు మాత్రమే పని చేశారు. ఇటీవల కాలంలో ఎంపీడీఓ వి.జ్యోతి ట్రైనింగ్‌లో భాగంగా ఆరు నెలలు పాటు వెళ్లడం జరిగింది. ఈ క్రమంలో ఆ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నటువంటి పంచాయతీ కార్యదర్శి కూడా అక్కడ పని చేయలేనని ఉద్దేశంతో మెడికల్ లీవ్ పెట్టి వెళ్లినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు అండగా ఉంటామని గొప్పలు చెప్పడమే తప్ప.. ఆయా కాలనీలో పారిశుధ్యం, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టను పరిస్థితి . రాష్ట్రంలో గ్రామ పంచాయతీ శాఖ మంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి.. దేశం యొక్క అభివృద్ధిని నినాదంతో పని చేస్తున్న క్రమంలో తమ గ్రామంలో కనీసం పారిశుధ్య కార్యక్రమాలు కూడా అధికారులు, ప్రజా ప్రతినిధులు చేయకపోవడం అత్యంత దారుణమని దీనిపై కొంత మంది వ్యక్తులు గ్రామంలోనే పారి శుధ్యం, నీటి సరఫరా, రోడ్ల నిర్మానం, కాలువల నిర్మాణం సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు నివేదికను సమర్పించి వినతిపత్రం అందజేయనున్నట్లు సమాచారం. ప్రధాన వీధులే వెంబట, వెల్లంపల్లి, తాళ్లూరు రోడ్డు వెంబడి చెత్తను తొలగించక పోవడంతో చెత్త బుట్టలతో నిండినటువంటి పరిస్థితి దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్నటువంటి పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా మద్దిపాడు పంచాయతీ కార్యాలయంలో పని చేస్తూ తాత్కాలికంగా దొడ్డవరం పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవల కాలంలో ఆ పంచాయతీ కార్యదర్శి బైకు ప్రమాదంలో గాయపడటంతో సెలవులో ఉన్నారు. దీంతో దొడ్డవరం పంచాయతీలోని ఏ చిన్న పని కూడా జరిగినటువంటి పరిస్థితిని, ఇటీవల కాలంలో ఓయ్ ఇంటి యజమాని ఇంటి పన్ను కట్టించుకోమని గ్రామ పంచాయతీ చుట్టూ, ఆ తర్వాత మండల కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని మండల ఉన్నత స్థాయి అధికారుల వద్ద వాపోయినట్లు సమాచారం. గతంలో అవినీతి జరగడంతో పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ భాషను సస్పెండ్ చేశారు. అదే క్రమంలో గ్రామ సర్పంచ్ చెక్క భజన కూడా రద్దు చేసి, ఈవోపీఆర్డీ కొండపి రఘుబాబు ఇన్‌ఛార్జీగా నియమించారు. అయినా గ్రామంలో పారిశుధ్యం పనులు, పూడిక తీతలు,







కొన్ని నెలల నుంచి చేయడం లేదని, జిల్లా మండల ఉన్నతాధికారులు పంచాయతీ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని గ్రామస్తులంటున్నారు. ఇటీవల తెల్లపాడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పూనూరి రామకృష్ణ తమ కాలనీలోనే పారిశుధ్య పనులు నిర్వహించట్లేదని, తాగునీటి సరఫరా జరగట్లేదని జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అర్జీని ప్రజావాణి కార్యక్రమం నందు ఇచ్చారు. దీంతో డీఎల్‌పీవో ఎస్సీ కాలనీకి వచ్చి వెళ్లారు. కానీ సమస్య పరిష్కరించబడలేదని ఆ ప్రభుత్వ ఉద్యోగి అంటున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగిగా సమస్యను తెలియపరిచిన కూడా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించలేకపోయారని, సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆ ప్రభుత్వ ఉద్యోగి వాపోయాడు. ఓ పక్క గ్రామంలో వీధిలైట్ల గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో పట్టపగలు కూడా అవి వెలుగుతూనే ఉంటాయి. వీధి లైట్లు పోయిన చోట మరలా లైట్లు వేయించేందుకు ఇన్‌ఛార్జీ కార్యదర్శికి సమయం లేకపోవడం వింతగా ఉంది. గత రెండు నెలలుగా గ్రామ కార్యదర్శి లేకపోవడం ఇన్‌ఛార్జీలుగా ఉన్న వారు పని చేయకపోవడం పెద్ద తలనొప్పిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఇవే పరిస్థితిలు ఉన్నాయి. ఇన్‌ఛార్జీగా పంచాయతీ కార్యదర్శిని సమస్యలపై గ్రామస్తులు విన్నవించుకున్న తరుణంలో మద్దిపాడులో ఉన్నట్లు, మద్దిపాడు గ్రామస్తులు విన్నవించుకున్న తరుణంలో దొడ్డవరం గ్రామం నందు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పడంతో గ్రామంలోనే పారిశుధ్య కార్యక్రమాలు అటకెక్కడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వార్తా ప్రతినిధి సెక్రటరీ నిర్వహణ విధులు విషయంపై ఆరా తీయగా మద్దిపాడు గ్రామస్తులు అడిగితే దొడ్డవరం నందు విధులు నిర్వహిస్తున్నట్లు దొడ్డవరం గ్రామస్తులు అడిగితే మద్దిపాడు గ్రామ పంచాయతీ నందు విధులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారని అదే క్రమంలో ఇరువురు పంచాయతీలు నందు విధులు నిర్వహించకుండానే మధ్యాహ్నం 3గంటల నుంచి కార్యాలయాల నుంచి బయటకు వెళ్తున్న సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలలో పారిశుధ్య పనులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని, పంచాయతీ అధికారులు విదుల నిర్వహణలో భాగంగా ఆయా కార్యాలయాల నందు మూమెంట్ రిజిస్టర్ నందు నమోదు చేసే విధంగా చూసి గ్రామాలలోని పారిశుధ్య సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



**సింగరాయకొండ, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**
ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చి దిద్దుకోవడం అందరి బాధ్యత గా తీసుకోవాలని ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ అన్నారు. ఆదివారం సింగరాయకొండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట పారిశుద్ధం, పర్యావరణం పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించి తమ ఇండ్లలోని చెత్తను విడివిడిగా తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య వాహనంలో చెత్తను వేసే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. రోడ్లుకు ఇరువైపులా చెత్తను వేయరాదని, మురుగు నీరును రోడ్లపై వదలరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి నెల మూడవ ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు,పంచాయతీ సిబ్బంది తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్. జగదీశ్ , బిల్లు కలెక్టర్ సి. హెచ్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రైతు ఖాతాలలో పీఎం కిసాన్ నిధులు జమ

**సింగరాయకొండ, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**
పి.ఎం కిసాన్ 19వ విడత రెండు వేలు రూపాయలు నగదును సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు రైతు సోదరుల ఖాతాలలోకి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతులు మీదుగా జమ చేయనుందని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా రైతు సోదరులకు సంబంధించి పి ఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కోసం సంవత్సరానికి మూడు విడతలలో 2000 చొప్పున 6000 జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. సింగరాయకొండ మండలం నందు పిఎం కిసాన్ లబ్ధిదారులు3154.వీరికి 2000 చొప్పున మొత్తంగా రూ.63,08,000/ వారి వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.పాసుబుక్ ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతుసేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేసినారు. మండలంలో 2680రైతులు రిజిస్ట్రేషన్చేయించుకున్నారని తెలియజేసినారు.

## గ్రామాల్లో ఫార్మర్ ఐడిలపై క్యాంపుల ఏర్పాటు



**దొనకొండ,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**
నేటి నుండి రెండు మూడు సమీప గ్రామాలని కలిపి ఫార్మర్ ఐడి లపై దొనకొండ మండలం లో 11 క్యాంపు లు ఏర్పాటు చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి యన్. లక్ష్మి ్మ నారాయణ తెలియ జేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా నేడు కొచెర్ల కోట రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో ఏర్పాటు చేసిన క్యాంపు సమావేశం లో మాట్లాడుతూ సాగు పొలం వున్న ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు.ఈ పద్ధతి లో ఆధార్ కార్డు కు లింక్ అయిన ఫోన్ నెంబర్ కి మూడు సార్లు ఓటీపీ లు వస్తాయని వాటిని గ్రామ సిబ్బందికి చెప్పటం లో రైతులు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనాలు, సున్నా వడ్డీ పంట రుణాలు మొదలగు వాటికి ఇప్పుడు ఇచ్చే విశిష్ట సంఖ్య తప్పనిసరని తెలిపారు. రైతులు పొలం పాస్ బుక్, ఆధార్ కార్డు, ఆధార్ సంఖ్య కి లింక్ అయిన ఫోన్ నెంబర్ తీస్కొని మీ గ్రామంలోనే వున్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులని సంప్రదించాలని కోరారు. రైతులు రెండు కంటే ఎక్కువ రెవిన్యూ గ్రామాలలోపొలం ఉన్నట్టయితే ఎక్కడో ఒక చోట ఫార్మర్ ఐడి చేయించుకుంటే సరి పోతుందని, రెండు చోట్ల అవసరం లేదని పేర్కొన్నారు.ప్రస్తుతం రైతుల పట్టా సొంత పొలాలకి మాత్రమే సర్వర్ అనుమతిస్తోందని, అసైన్ మెంట్, ఈనామ్, దేవాదాయ పొలాలకి సోమవారం నుండి వస్తదని తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు డి. ఈశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, రెండు గ్రామాల రైతు సోదరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం

**దొనకొండ,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**
ఈ నెల 24న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. బీహార్ భాగల్పూర్లో నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ డబ్బులు విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతులకు మొత్తం రూ.22 వేల కోట్లు జమ కానున్నాయి. మోదీ ప్రభుత్వం ఏడాదికి 3 విడతలుగా ఒక్కో దఫా రూ.2 వేలను జమ చేస్తోంది.

### ప్రతి ఒక్కరూ టూవీలర్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



**దొనకొండ,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా ఎస్పీ ఎ. యర్. దామోదర్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు దొనకొండ ఎస్సై టీ.త్యాగరాజు దొనకొండలోని అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద హెల్మెట్ లేకుండా టూ వీలర్ నడుపుతున్న వాహనదారులను ఆపి హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను వారికి తెలియజేసి ప్రతి ఒక్కరూ టూవీలర్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన ఏర్పరచడమైనది.

## సూక్తి ముక్తావళి



**ఒంగోలు ,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**
ఆకాశవాణి మార్కాపురం కేంద్రం ద్వారా మార్చి 1వ తేదీ శనివారం ఉదయం 6:30 కు సూక్తి ముక్తావళి కార్యక్రమంలో తన ప్రసంగం ప్రసారం అవుతుందని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. ధర్మ మార్గంలో ఎలా జీవించాలి, సత్యాన్ని పలకటం ద్వారా ఎలాంటి ప్రయోజనాలను పొందవచ్చు, అరిషడ్వర్గాలను ఎలా జయించాలి, పొదుపుని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తు ఎలా వెలుగుతుంది,జీవితంలో ఉన్న భయాలను ఎలా తొలగించుకోవాలి అనే సందేశాన్ని ఆదిశంకరులు రచించిన వివేక చూడామణి, భర్తృహరి సుభాషితాలు, సంస్కృత శ్లోకాలు, తెలుగు పద్యాలు ఆధారంగా సూక్తి ముక్తావళిలో తన ప్రసంగం సాగుతుందని అన్నారు. మార్చి మాసంలోని మొదటి నాలుగు శనివారాలలో ఉదయం 6.30 నిమిషాలకు సూక్తి ముక్తావళిలో తన ప్రసంగం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రేడియో కార్యక్రమాలను సెల్ ఫోన్లో కూడా వినవచ్చని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా మన్ కీబాత్ కార్యక్రమం ద్వారా రేడియోకు పూర్వ వైభవాన్ని తీసుకువస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ మార్కాపురం రేడియో కార్యక్రమాలను విని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## మూఢ నమ్మకాలకు వ్యతిరేకం సంత్ గాడ్గే బాబా





**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
సంత్ గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలు మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు గాలం కాశయ్య ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాలను దేవదూతలుగా చూసే ఈ రోజుల్లో అగ్ర వర్ణాలకు నచ్చని ఒకే ఒక బాబా గాడ్గే బాబా మినహాయిస్తే ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమని అన్నారు. మనిషిని మనిషిగా గౌరవించని మన ధర్మ శాస్త్రాన్ని అర్థం చెప్పకుండా చెప్పుకున్నారు. అతి శూద్రులకు విద్యను దూరం చేసి, స్వర్గ నరకాలు, పాప పుణ్యాలు, పునర్జన్మలు, కర్మ సిద్ధాంతాలు, ఆచార సంప్రదాయాలు, కులము, కట్టుబాట్లు పేరుతో ప్రజల్లో బానిస భావజాలాన్ని పెంపొందించి, ప్రజల శ్రమను దోచుకుని బ్రతికే మనువాదులు, కర్మభూమిలో కులం, మతం ఎప్పటికీ ఉండాలని కోరుకునే సనాతన వాదులు సంఘ సంస్కర్త గాడ్గేబాబా సామాజిక సేవని ఏనాడూ మనసారా అంగీకరించలేదన్నారు. మార్గదర్శకమైన గాడ్గే బాబా జీవితాన్ని దేశానికి చెప్పేందుకు ప్రయత్నించలేదన్నారు. మూఢ నమ్మకాలు, జంతుబలులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసిన గాడ్గే బాబా చదువు మాత్రమే మనుషుల్ని పేదరికాన్ని, అసమానతల్ని రూపుమాపే మార్గమని నమ్మారని తెలిపారు. ఊరూరా తిరిగి బిచ్చమెత్తి సేకరించిన డబ్బుతో అస్పృశ్యులు, శూద్రులు, మహిళలకోసం 141 పాఠశాలలు కట్టి అక్షర జ్యోతులు వెలిగించారు. పేదలకు అన్నసత్రాలు, హాస్టల్స్, పశువులకు గో రక్షణ కేంద్రాలు నిర్మించిన బాబా పట్ల మహారాష్ట్ర ప్రజలకు కృతజ్ఞత, ప్రేమ ఉన్నాయన్నారు. గాడ్గే బాబా నిర్మించిన పాఠశాలల్లో కుల, మతాలకతీతంగా గాడ్గే బాబా అందరికీ ప్రవేశం ఉండేదన్నారు. అనితర సాధ్యమైన జీవనం సాగించిన మహనీయుడు గాడ్గే బాబా అన్నారు. ఈ కార్యక్రమంలో బీసి నాయకులు రంగనాయకులు, బీసి ఉద్యోగులు, బీసి విశ్రాంత నాయకులు, రజక సంఘ నాయకులు, పేరూరి వెంకటేశ్వర్లు, సురభి, రజక వృత్తి దారుల నాయుడు రావికొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దబొమ్మలాపురంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం తూర్పుపెద్ద బొమ్మలాపురం గ్రామంలో ఆదివారం జరిగిన అన్నపురెడ్డి నారాయణరెడ్డి వెడ్స్ రాజ్యలక్ష్మిగార్ల పెళ్లి వేడుకలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ తో పాటు పెద్దదోర్నాల మండల వైకాపా కన్వీనర్ ఘంటా వెంకటరమణారెడ్డి, చిట్టే వెంకటేశ్వరరెడ్డి, రఘురామిరెడ్డి, పాత్లావత్ చంద్రకాంత్ నాయక్, వల్లభనేని పవన్, దోర్నాల ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, సింగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల అరణ్యం నుండి పాదయాత్ర వెళ్లే భక్తులకు ఇస్కాన్ సేవలు



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భం గా శ్రీశైలం మల్లన్న దర్శించేందుకు నల్లమల అటవీ ప్రాంతంలో నుండి పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఇస్కాన్ సంస్థ దోర్నాల, ఇస్కాన్ అనంతపూర్, దాతలు శ్రీనిధి ఎంటర్ప్రైజెస్ వెంకటరెడ్డి, శివారెడ్డి మరి కొంత మంది ప్రముఖుల దాతలు సహకారం తో మూడులక్షలమంది భక్తులకు అన్నదానం, వైద్యసదుపాయం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అభయ హిందూ సేన వ్యవస్థాపకులు శ్రీమాన్ రాధా మనోహర్ దాస్ స్వామీజీ, నంద్యా ఎంపీ బైరెడ్డి శబరి హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. భక్తి భావాలతో శివుని అనుగ్రహం పొందుటకు ఎండలను సైతం లెక్కచేయకుండా మండుటెండలో రాలి నడకన పాదయాత్రతో వచ్చి భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని అన్నారు.

## కొమ్మునూరులో స్వచ్ఛ - ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం



**గిద్దలూరు, ఫిబ్రవరి 23 ,ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ - ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గిద్దలూరు ఎంపిడిఓ జేపిసి చెన్నారావు ఆధ్వర్యంలో పంచాయితీ సిబ్బంది మండలంలోని కొమ్మునూరు గ్రామ పంచాయితీ పరిధిలో ఇంటింటికీ తిరిగి కార్యక్రమంపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరు చెత్త సేకరణలో భాగంగా తడిచెత్త, పొడిచెత్త వేరువేరుగా చెత్త రిక్షాలో వేయాలని, వేసిన చెత్తను క్లాప్ మిత్రాల ద్వారా చెత్తనుండి సంపద తయారీ కేంద్రమునకు తరలించి తడి చెత్తను వర్మీకంపోస్ట్గా తయారు చేసి పొడి చెత్తను వేరు చేసి ప్రతి గురువారం వర్మీ, పొడి చెత్తను అందుబాటులో ఉన్న నిమిత్తం సేల్స్ చేయబడుతుందని ప్రతి ఇంటికి తెలియపరిచారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, పంచాయితీ కర్యాదర్శి సిహెచ్ భూతేశ్వర రెడ్డి, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రలు (హరిత రాయబారులు) మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### పైరవీలకు, ప్రచార ఆర్భాటాలకు విలువనివ్వని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

### - రాంభూపాల్ రెడ్డి నిరంతర శ్రమను గుర్తించని గత ప్రభుత్వం

**గిద్దలూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
ఆయన గెజిటెడ్ స్థాయిలో పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు. మూడు సంవత్సరాల క్రితం పదవీ విరమణ చెందినప్పటికీ ప్రభుత్వం నుండి ఎటువంటి పారితోషికం లేకుండానే పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు నిరంతరము కృషిచేస్తున్న ప్రకాశం జిల్లా రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన మార్కాపురం రాంభూపాల్ రెడ్డి అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటున్నారు. ఎటువంటి పైరవీలు, ప్రచార ఆర్భాటాలు, పబ్లిసిటీ లేనందున ఆణిముత్యం లాంటి రాంభూపాల్ రెడ్డి సేవలు గత ప్రభుత్వం గుర్తించలేదు. సాక్షాత్తు దేశ ప్రధానమంత్రి విశిష్ట వ్యక్తిగా గుర్తించినప్పటికీ గత పాలకులు గుర్తించకపోవడం చాలా విచారకరం. సర్వీస్లో ఉన్నవారు తమ వేతనములో పది రూపాయలు తగ్గినా ఏమాత్రం సహించలేని సందర్భంలో ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా నిరంతరము తన స్వంత ఖర్చులతో హైస్కూల్, జూనియర్ కళాశాల, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పిసునతన్న రాంభూపాల్ రెడ్డి సేవలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

**తన పెన్షన్ ద్వారా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత :**
తాను విశ్రాంతి తీసుకోవాల్సిన 64సంవత్సరాల వయసులో తన పెన్షన్ నుండి పేద విద్యార్థుల విద్యాభివృద్ధి చేయూతనందించి పాటుపడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ 2023వ సంవత్సరం స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఎమ్మినెంట్ పర్సనాలిటీ (విశిష్ట వ్యక్తి)గా గుర్తించి సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు విద్యారంగంలో చేస్తున్న సేవలకు అందరు ముఖ్యమంత్రులచే గౌరవించి సత్కరించబడ్డారు.

**జాతీయ స్థాయిలో 100 మంది విశిష్ట వ్యక్తులలో రాంభూపాల్ రెడ్డి ఒకరు :**
భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి ప్రతినెల చివరి ఆదివారం తన మనసులోని మాట మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం ద్వారా దేశ ప్రజలందరికీ తెలియజేస్తున్న విషయం తెలిసిందే. మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తించిన 100మంది విశిష్ట వ్యక్తులలో రాంభూపాల్ రెడ్డి ఒకరుగా గుర్తింపబడ్డారు. విశిష్ట వ్యక్తులుగా గుర్తింపబడిన వారి ఫోటోలను సేకరించి వారు చేసునతన్న సేవా కార్యక్రమాల వివరాలతో భారత ప్రభుత్వం ఆల్బమ్ తయారు చేసి విడుదల చేయడమైనది ఆ ఆల్బమ్ను ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాంభూపాల్ రెడ్డి స్వీకరించారు.

**సామాజిక సేవలో భాగంగా రాంభూపాల్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమాలు :**
సామాజిక సేవలో భాగంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మార్కాపురం రాంభూపాల్ రెడ్డి పదవీ విరమణ చెందినప్పుడు తనకు వచ్చిన రిటైర్మెంట్ బెన్ఫిట్స్ మొత్తము రూ.26లక్షలను పేద బాలిక విద్యాభివృద్ధి కొరకు ఆ మొత్తాన్ని స్థానిక పోస్ట్ ఆఫీస్లో డిపాజిట్ చేసి 126మంది 10 సంవత్సరములు వయసుగల పేద బాలికలను గుర్తించి వారి పేరుతో సుకన్య సమృద్ధి యోజనా ఖాతాలను ప్రారంభించి డిపాజిట్ చేసిన నదుపై వచ్చే వడ్డీని ఆ ఖాతాలకు జమ చేయడం ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా ప్రధానమంత్రి దృష్టికి వెళ్ళింది. ఒక్కసారిగా ఆయన పేరు జాతీయ స్థాయిలో మార్మోగింది.

**పైరవీలు, ప్రచార ఆర్భాటాలు అంటే గిట్టని రాంభూపాల్ రెడ్డి :**
ఎంతో నిరాడంబరంగా జీవించే రాంభూపాల్ రెడ్డికి పైరవీలు చేయడం, ప్రచార ఆర్భాటాలు అంటే అసలు గిట్టదు. తన పని తాను చేసుకుంటూ వెళ్తూ ఉంటాడు. తన 36 సంవత్సరాల సర్వీస్ కాలంలో తాను పనిచేసిన ప్రతిచోట పేద విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి కృషిచేసి అధికారుల మన్ననలు పొదేవారు. సచివాలయంలో ఆల్బమ్ స్వీకరించునప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసిన సందర్భంలో మీలాంటి గొప్ప వ్యక్తుల సేవలు విద్యారంగానికి ఎంతో అవసరమని కొనియాడారు. ఆర్థిక కారణాలతో ఏ పేదబాలిక విద్యార్థి కూడా మధ్యలో చదువు మానుకోకూడదు అనే జీవితాశయంతో కృషిచేస్తున్న వ్యక్తి రాంభూపాల్ రెడ్డి. జాతీయ స్థాయిలో గుర్తించబడిన రాంభూపాల్ రెడ్డిని గత ప్రభుత్వం గుర్తించకపోవడం, ఆయన సేవలు వినియోగించుకోక పోవడం ఎంతో దురదృష్టకరం.

## ప్రజా సమస్యల పరిష్కార విభాగం జిల్లా అధ్యక్షునిగా సింగెపోగు శ్యాంబాబు నియామకం



**మార్కాపురం, ఫిబ్రవరి 23 ,ప్రభాతవార్త**
ప్రజా సంకల్ప వేదిక ఆంధ్రప్రదేశ్ 2025 జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం గిద్దలూరు కార్యాలయంలో ఘనంగా నిర్వహించినట్లు ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డి తెలిపారు. వివిధ విభాగాలలో జిల్లా నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా చైతన్య విభాగం, ప్రజా సమస్యల పరిష్కార విభాగం, మానవ హక్కుల పరిరక్షణ విభాగం, అవినీతి నిరోధక విభాతం, ఆర్టీఐ విభాగం, మహిళ అండ్ శిశు సాధికారిత విభాగం, న్యాయ విభాగం, మీడియా విభాగంల నుంచి జిల్లా కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కార విభాగం ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా చింతకుంట గ్రామానికి చెందిన సింగెపోగు శ్యాంబాబును నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా సంకల్ప వేదిక ఆర్గనైజేషన్ 2021న రిజిస్ట్రేషన్ కాబడిన నీతి అయోగ్ నందు నమోదు కాబడిందని వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ మదిరె రంగసాయిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నియమతులైన శ్యాంబాబు మాట్లాడుతూ అణగారిన, అల్ప వర్గాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన చట్టపరమైన హక్కులను తెలియపరచి చైతన్య పరుస్తామని తెలిపారు. నామీద నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతను అప్పగించిన మదిరె రంగసాయి రెడ్డికి ధన్యవాదములు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

# భక్తుల పెన్నిది శ్రీశైల మల్లన్న సన్నిధి





**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
పిలిచిన వెంటనే పలికే దేవుడుగా భక్తుల మదిలో నిలిచిన శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వారికి మహోన్నత చరిత్ర ఉంది. భారతదేశంలో సుప్రసిద్ధ పవిత్ర పుణ్యక్షేత్రంలో శ్రీశైలం మహా పుణ్యక్షేత్రం ఒకటి. 12 జ్యోతిర్లింగాలలో ఒకరైన శ్రీ మల్లిఖార్జున స్వామికి, 18 మహా శక్తులలో ఒకరైన శ్రీ భ్రమరాంబ దేవికి నిలయమైన శ్రీశైల మహా క్షేత్రం భూ మండలానికి నాభి స్థానం అని పురాణాలు చెబుతున్నాయి. కురుక్షేత్రంలో లక్షలకొలది దానం ఇచ్చిన, రెండు వేల సార్లు గంగా స్నానం చేసిన నర్మదా నది తీరంలో బహుకాలం తపస్సు ఆచరించిన కాశీ క్షేత్రంలో లక్షల సంవత్సరాలు నివసించిన ఎంత పుణ్యం లభిస్తుందో అంతటి మహా పుణ్యం శ్రీశైల మల్లిఖార్జునుని ఒక్క సారి దర్శించినంతనే కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. యజ్ఞాలు తపస్సులు దానాలు తీర్థ యాత్రలు చేసిన ఫలం కంటే కోటి రెట్ల అధిక ఫలం శివలింగ స్పర్శ దర్శనం వలన కలుగుతుందని పురాణాలు వేదాలు చెబుతున్నాయి. అదే క్రమంలో శిఖర దర్శన మాత్రాన అనంతమైన పుణ్యాన్ని సంతరించి పెట్టి పునర్జన్మ నుండి ముక్తిని కలిగించే ఈ క్షేత్రాన్ని దర్శించటం బహుజన్మల పుణ్యఫలం. అత్యంత మహిమోపేతమైన శ్రీశైలం మహా క్షేత్రాన్ని లక్షలాది మంది భక్తుల దర్శిస్తుంటారు. ఈ క్షేత్రాన్ని దర్శించే విషయంలోనూ దర్శించే సమయంలోనూ ఎందరో భక్తులో ఎన్నెన్నో అనుభూతులు పొందుతూ ఉంటారు. ప్రయాగలో లక్ష మందికి గాని, కాశీలో రెండు లక్షల మందికి గాని, పవిత్ర గంగానది ఒడ్డున ఏడు లక్షల మందికి గాని అన్నదానం చేస్తే ఎంత పుణ్యమో శ్రీశైల మహా క్షేత్రంలో ఒక్కరికి చేసి అన్నదానం అంతటి పుణ్యాన్ని కలిగిస్తుందని వేద పురాణాలు చెబుతున్నాయి. శ్రీశైలం చరిత్ర ఇలా ఉంటే జప మహిమ కూడా తెలుసుకుందాం.

### జప మహిమ :
మన పూర్వులు మానవీకులు తరించేందుకు అనేక మార్గాలను తమ ఉపదేశాల్లో పేర్కొన్నారు. అలాంటి వాటిలో జప మార్గమొకటి. జపము వలన ఎవరికెలాంటి బాధ కలగదు. పైగా మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇలాంటి జప విశిష్టత గురించి మన మహర్షులు జపతో నాస్తి అన్నారు. అంటే జపము చేయటంతో మనో వాక్కాయ కర్మల చేత మనము చేసిన సమస్త పాపాలు నశించి పోతాయి. గీతములో సైతం శ్రీకృష్ణ పరమాత్మ జపము గురించి యజ్ఞానాం జప యజ్ఞోస్మి అని పలికారు. జపము రెండు విధాలు. వాచిక జపం, మానసిక జపం. పెదవులను కదులుచుతూ దగ్గరగా చేయ జపము వాచిక జపము మనసులో మంత్రాన్ని జపిస్తూ చేసే జపము మానసిక జపము అంటారు.

### భగవన్నామస్మరణ :
మన సృష్టి క్రమము ప్రకారం నాలుగు యుగాలు ఉన్నాయి. కృతయుగములో ప్రజలు తపస్సు చేశారు. త్రేతాయుగంలో యాగాలతో దేవతలను పూజించారు. అయితే కలియుగంలో దేవుని పూజించడంలో భక్తి ప్రధానమైంది. భక్తి రేవా కలియుగ నామ జపము ముఖ్యమైంది. గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు. యజ్ఞనాం జప యజ్ఞోస్మి దేవుడు అంతటా వ్యాపించి ఉన్న కలియుగ ముందు దేవుడు దేవాలయాల యందు మరియు అందరి హృదయాల్లో నివసిస్తుంటాడు. అయితే దేవుని ప్రార్థించేందుకు మనము దేవాలయానికి వెళ్తుంటాము. అక్కడ ఒక మంత్రంతో దేవుడిని ధ్యానిస్తాము. అయితే కొన్ని ప్రత్యేక పద్దతులు ద్వారా దేవుని దర్శనం అనుగ్రహం లభిస్తుంది. దేవుని స్వరూపము ఎదురుగా ఉంటుంది. కనుక నామ జపంతో దేవుని అనుగ్రహం పొందడం సులభం అవుతుంది. మంత్రము పలుకుతూ ఉంటే ఏదో ఒక సమయంలో భగవత్ సాక్షాత్కారం లభిస్తుంది. ఇలాంటి మహిమాన్వితమైన శ్రీశైలం అడవులలో ఎవరికి కనిపించకుండా ప్రశాంతమైన స్థలాలలో ఎందరో మునీశ్వరులు, యోగులు, అఘోరీలు, జప తపస్సులు చేస్తూ ఉంటారు.

# శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదానం

### - కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే భక్తులకు పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామస్తులు మూడు రోజుల పాటు శ్రీశైలం రోడ్డు బోడే నాయక్ తాండ సమీపాన సబ్ స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. ఆధ్యాత్మిక భక్తి భావాలతో ఉన్న పెద్ద బొమ్మలాపురం గ్రామస్తులు ప్రతి ఏడాది మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని, శ్రీశైల మల్లిఖార్జునుడు సర్వదా దీవించును గాక అని అన్నదాన సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కొద్దిసేపు సేవలందించారు. ఈ కార్యక్రమంలో పెద్దబొమ్మలాపురం గ్రామస్తుడైన బీజేపీ మండల కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి, వైకాపా మండల కన్వీనర్ ఘంటా వెంకటరమణారెడ్డి, చిట్టే వెంకటేశ్వరరెడ్డి, పెద్ద బొమ్మలాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

### నూతన వధువరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన ఉదయ్ శంకర్



**గిద్దలూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా మాజీ బిజెపి అధ్యక్షులు పివి శివారెడ్డి కుమారుడు వివాహం ఆదివారం విశాఖ పట్నంలోని కన్వెన్షన్ హాలులో జరుగగా గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ నూతన వధువరులకు ఒక ప్రకటనలక్ష వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వలన వివాహ వేడుకకు హాజరు కాలేకపోయామని ఆయన విచారం వ్యక్తం చేశారు. మాజీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి వారి కుటుంబ సభ్యులకు మరియు నూతన వధువరులకు వివాహ కార్యక్రమానికి విచ్చేసిన జాతీయ రాష్ట్ర, జిల్లా నాయకులు అందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సొమ్ము వీర్రాజు, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్, 20సూత్రాలు అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సరేంద్ర మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్య నారాయణ రాజు, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షులు నిర్మలా కిశోర్, రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, వైజాగ్ జిల్లా అధ్యక్షులు పరశురామ్ రాజు, వైజాగ్ మాజీ జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు, బాపట్ల జిల్లా ఇన్చార్జి పివి కృష్ణారెడ్డి, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శులు శివాజీ, కూకట్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ప్రకాశం జిల్లా యువమోర్చా అధ్యక్షులు పువ్వాడ దామోదర్, దండు శ్రీను, తిరుమల తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించడం జరిగిందని ఆయన తెలిపారు.

### మల్లిఖార్జునరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డిలను సన్మానించిన నాయకులు



**సీఎస్పురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మండల వైఎస్సార్సీపీ నూతన అధ్యక్షునిగా నియమితులైన మండలంలోని నల్లమడుగుల గ్రామానికి చెందిన పాలుగుళ్ల మల్లిఖార్జునరెడ్డిని, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామానికి చెందిన ముత్యాల నారాయణరెడ్డిలను ఆదివారం మండల వైఎస్సార్సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్రెడ్డి, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, తోట అశోక్, నల్లి రాహుల్, పులి మాల్యాద్రి, వల్లపుశెట్టి వర్మ, చోడ రవి, సిద్దు వెంకటరెడ్డి, రమణారెడ్డి, రంగారెడ్డి, భాస్కర్రెడ్డి, పలువురు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా అన్నా కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు



**మార్కాపురం,ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి, వైకాపా యువ నాయకుడు అన్నా కృష్ణచైతన్య జన్మదిన వేడుకలలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్,మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజక వర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అన్నా రాంబాబు పాల్గొని కేక్ను కట్ చేసిన చైతన్యకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున హాజరయ్యారు. సేవా గుణం కలిగిన కటుంబంలో జన్మించిన అన్న కృష్ణ చైతన్య రాజకీయ రంగంలో రాణించాలని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి, వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని హాజరైన వారు ఆకాంక్షించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకలలో విభాగాధిపతుల నేతృత్వంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

# వివాహ మహోత్సవాలకు హాజరైన కరణం



**బల్లికురవ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దేవినేని శ్రీనివాసరావు, పద్మావతి దంపతులకు కుమార్తె సింధు, నాగకృష్ణ కుమార్ల వివాహం శనివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల వైకాపా ఇన్‌ఛార్జ్ కరణం వెంకటేష్ బాబులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా మండలంలోని గొర్రెపాడు గ్రామానికి చెందిన దివంగత టీడీపీ నేత గుంటూరు వెంకటరత్నం, లీలావతిల కుమారుడు పరంధామయ్య, హర్షితల వివాహం శనివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ, ఆయన తనయుడు వెంకటేష్ బాబులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో లోపించిన జ్ఞానం



**బల్లికురవ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహనకు మరింత మెరుగైన బోధన అంశాల ప్రావీణ్యతను జోడించి ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు బాధ్యత గల అధికారుల్లోని అజ్ఞానాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. స్థానిక విద్యా వనరుల భవనంలో గత మూడు రోజులుగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి . మూడు రోజులు పాటు ఈ శిక్షణలో తాము ఏం చేశామన్నది మీడియాకు సైతం చెప్పుకోలేని స్థితి. ముగింపు రోజు మాత్రం కేక్‌లు కోసి నానా యాగి చేశారు. చిన్నారులు లేకుండానే పుట్టిన రోజు వేడుకలు జరుపుతున్నారంటే అధికారుల మజాకానా శిక్షణకు సంబంధం లేని వ్యక్తులను కూడా పిలిచి నానా హంగామా చేశారు. బాధ్యత గల కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు బాధ్యతను మర్చిపోయారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో అజ్ఞానం వెలిగిపోతుంది. ప్రభుత్వ ఆశయం ఘనంగా ఉన్న శిక్షణ కార్యక్రమంలో అర్థం పర్థం లేని అసంబద్ధ ప్రేలాపనలు.. ఇదేనా జ్ఞానజ్యోతి శిక్షణ అంటూ ప్రజల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరి ప్రావీణ్యతను ప్రదర్శించే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# రోటరీ ఆవిర్భావ దినోత్సవం



**మార్టూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
120వ రోటరీ ఆవిర్భావ ఇనోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారు పాల్ హారిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్టూలోని జనార్ధన్ కాలనీ పేద ప్రజలందరికి డాక్టర్ గారపాటి కిషోర్ కుమార్ సహాయ సహకారాలతో ఉచిత వైద్య సదుపాయం కల్పించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, కార్యదర్శి మాదాల సాంబశివరావు మాట్లాడుతూ 1905వ సంవత్సరం ఇదే రోజున సరదగా నలుగురు స్నేహితులు కూర్చుని మాట్లాడుకునేటువంటి క్రమంలో పాల్ హార్రిస్ ఉన్నతమైన ఆలోచనతో ఏర్పడినటువంటి రోటరీక్లబ్ దాదాపు 200 దేశాలలో లక్షల మందికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటుందని తెలియజేశారు. డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు ఆదివారం సెలవు దినం అయినా పేద ప్రజలకి సేవ యుటం నా అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రావి అంకమ్మ చౌదరి, తాళ్లూరి సాంబశివరావు, షేక్ ఖాజా హుస్సేన్, కోశాధికారి గరిమిడి శ్రీనివాసరావు, జనార్ధన్ కాలనీ ప్రజలు అందరూ పాల్గొన్నారు.

# గురుకులాల్లో చికెన్, మటన్ బంద్

## - ప్రత్యామ్నాయంగా స్వీట్లు, పండ్లు, కర్రీలు...

**యర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని పలు గురుకుల పాఠశాలలో కోళ్ళకు సంక్రమిస్తున్న వైరస్ కారణంగా పాఠశాలలోని విద్యార్థులకు భోజనంలోకి చికెన్, గుడ్డు, వడ్డించడం నిలిపివేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పై అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని తూచాతప్పకుండా అమలు పరుస్తున్నామని ప్రిన్సిపాల్‌లు వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలో వైరస్ రగడ మొదలనప్పటినుండి విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాలుగు వారాలుగా చికెన్ గుడ్లు పెట్టడం లేదని చెబుతున్నారు. ప్రతి ఆదివారం చికెన్ పెట్టాల్సి ఉండగా వాటికి బదులుగా మంచిమంచి కర్రీలను తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. విద్యార్థులు ఆదివారం పూట మటన్ అడుగుతున్నా దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారనే విమర్శ ఉంది. మెనూ ప్రకారం ప్రతిరోజు మధ్యాహ్నం ఉడికించిన కోడిగుడ్డు అందించాల్సి ఉండగా గుడ్డుకు ప్రత్యామ్నాయంగా సీజనల్ పండ్లను అందజేస్తున్నామని చెబుతున్నారు. వైరస్ అదుపులోకి వచ్చే వరకు మెనూలో మార్పులు తప్పవంటూ ప్రిన్సిపాల్‌లు చెబుతున్నారు. గిరిజన గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు చికెన్, గుడ్డు బంద్ అయిన విషయం రాష్ట్రంలోని పలు గురుకులాల్లో చికెన్ నిలిపివేస్తున్నట్లు గురుకుల అధికారి నుంచి అధికారిక ప్రకటనల వెలువడిన విషయం విధితమే. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బర్డ్ వైరస్ కలకలం రేపుతున్న సంగతి తెలిసిందే. గురుకులాల్లో చికెన్, గుడ్డు బంద్‌కు ప్రత్యామ్నాయంగా స్వీట్లు, వెజ్ కర్రీలు అని చెబుతున్నావని అమలు సాధ్యం కాని మాటలుగా పలువురు కొట్టిపడేస్తున్నారు. చికెన్ బదులుగా వెజ్ కూరలు, గుడ్డుకు బదులుగా స్వీట్లు అందిస్తామని చెప్పినప్పటికీ అమలులో జరగడం లేదని అదే పప్పుచారు, అవే పచ్చళ్ళు, నీళ్ళ పెరుగు అందిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల మంది విద్యార్థులకు స్వీట్లు కొని తెచ్చి పంచడమనేది అసాధ్యమైన విషయమని రకరకాల వెజ్ కర్రీలు వండి పెట్టడం అనేది జరిగే పని అని పలువురు విమర్శలు దిగుతున్నారు. చికెన్, గుడ్డు ఆపమని ఆదేశాలు ఇచ్చిన అధికారులు ప్రత్యామ్నాయంగా ఆదివారం ఒకపూట మటన్ ఆదేశాలు జారీచేసి ఉంటే బాగుండేదని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

# సత్యేలి వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**బేస్తవారిపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
బేస్తవారిపేట మండలం దర్గా కొండప్రైగల న్యూ స్వప్న హోటల్ యజమాని, టిడిపి నాయకులు సత్యేలి కృష్ణ కుమారుడు శివశంకర్, భూమికల వివాహ వేడుకలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధువరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి సత్యేలి కృష్ణ కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన చెంచయ్య

## - సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మీ



**మద్దిపాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య ప్రజా ఉద్యమాలకు తన జీవితం అంకితం చేశారని సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మీ అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కళా మందిరం వద్ద తవనం చెంచయ్య, పమిడి కోటయ్య సంతాపసభ యు.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మీ మాట్లాడుతూ సమాజంలో కొనసాగుతున్న అంటరానితనం అసమానతలు పెత్తందారుల దౌర్జన్యాలపై చెంచయ్య పోరాటాలు చేశారన్నారు. అప్పట్లో యువతను సమీకరించి సాగు భూముల సాధన కోసం బావులు, చెరువు నీటిపై దళితులకు హక్కు పోరాడేలా కనీస వేతనం చట్టం కోసం ఉద్యమాలు నడిపారన్నారు. చెంచయ్య తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పని చేశారని పేర్కొన్నారు. మండల నాయకులు కసుకుర్తి సుబ్బారావు మాట్లాడుతూ చెంచయ్య ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేశారన్నారు. కుల వివక్షత ఎమ్మెల్యేగా ఉన్న తాను సాధారణ జీవితాన్ని గడిపారనిఅన్నారు. ఈ కార్యక్రమంలో కాళీం,కాకుమానుసుబ్బారావు, చిన్నా, వెంకటరామిరెడ్డి ,బాల్లి, వేణు,యలమంద, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ఈమని సుబ్బారావు, ఘంటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు 19వ విడత పిఎం కిసాన్ నిధులు విడుదల

## - ఏఓ విజయభాస్కర్ రెడ్డి



**గిద్దలూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
పిఎం కిసాన్ సమ్మాన్ పథకం క్రింద 19వ విడతలో భాగంగా నేడు గిద్దలూరు మండలంలోని 7318మంది రైతులకు రూ.1.46కోట్లు వారి అకౌంట్లలో జమ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి వై విజయభాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2018 డిసెంబర్ 1వ తేదీన సిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రవేశపెట్టారని ఇప్పటివరకు 18 విడతలలో ఒకొక్క విడతకి రూ.2వేల చొప్పున సంవత్సరానికి రూ.6వేలు అర్హత కలిగిన ప్రతిఒక్క రైతు అకౌంట్‌లో జమచేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయంగా (మొదటి విడత జూన్ – జూలై మాసాలలో విత్తనాలకు, రెండో విడత అక్టోబర్‌లో పురుగుమందులు, పిచికారికి, మూడో విడత జనవరి–ఫిబ్రవరిలో హార్వెస్టింగ్‌కు) ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో ఈ పథకం మొదలు పెట్టారని తెలిపారు. దీనిలో భాగంగా 24 ఫిబ్రవరి 2025న 19వ విడత రూ.2వేలను బీహార్ రాష్ట్రంలోని బాగాళపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుండి రైతుల అకౌంట్‌కు జమచేయనున్నారని తెలిపారు. మండలంలోని రైతులందరి అకౌంట్‌లకు నేడు పిఎం కిసాన్ నిధులు జమకానున్నట్లు రైతులు విషయాన్ని గమనించి నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయాలి : షేక్ అన్వర్ బాష



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
ఉర్దూ మాధ్యమ పాఠశాలలను తెలుగు లేదా ఆంగ్లమాధ్య పాఠశాలలకు అనుసంధానం చేయకుండా ఆపాలని ఆదివారం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డిని కలిసి రాష్ట్ర ఉర్దూ ఉపాధ్యాయ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. జిఓ నెం 117 రద్దు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పున:నిర్మాణంలో భాగంగా ఉర్దూ పాఠశాలలను, ఉర్దూ సెక్షన్ పాఠశాలల తరగతులను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో గాని, నమూనా పాఠశాలలో గాని అనుసంధానం లేదా తరలింపు చేయరాదని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (రూట ఏపి) ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ అన్వర్ బాషా, అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ సమీవుల్లా బాషాలు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రూట నాయకులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. ప్రతి ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఆధ్వర్యంలో పిపి1, పిపి2 తరగతులు నిర్వహించాలని, ఉర్దూ పాఠశాలలకు మోడల్ ప్రాథమిక పాఠశాలగా గుర్తించాలని, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల 6,7,8, తరగతులలో 30మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్డేట్ చేయాలని, నిర్వహణపరంగా ఉర్దూ పాఠశాలలను కామన్ స్కూల్ కాంప్లెక్స్‌లలో నిర్వహించాలని, ఖాళీగా ఉన్న ఉర్దూ ఏఎంఓ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. డిఈఓ ఫుల్‌గల ఉర్దూ బాష పండిట్‌లకు ప్రమోషన్ కల్పించి శాశ్వత స్థానాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూట కార్యవర్గ సభ్యులు ముల్లా షాబుద్దీన్, పఠాన్ ముర్తుజావలి ఖాన్‌లు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

# 25న మహిళా ప్రాంగణంలో మెగా జాబ్ మేళా

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో ఈనెల 25న మంగళవారం నాడు మెగా జాబ్ మేళా జరగనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జే.రవితేజ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐసీఐసీఐ శ్రీ చక్ర హుండాయ్ తదితర కంపెనీలు ఈ మెగా జాబ్ మేళాకు రానున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో 19 సంవత్సరం నుండి 30 సంవత్సరాల మధ్య గల ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు ఎస్‌కే భాష, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మొబైల్ నెంబరు 9963005209 ని సంప్రదించాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ పేర్కొన్నారు.

# చెంచయ్య కోటయ్యలకు పలువురు ఘన నివాళులు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య సీపీఎం జిల్లా నాయకులు పమిడి కోటయ్యల వర్ధంతి కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడులో ఆదివారం నాడు స్థానిక సుందరయ్య భవన్లో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చెంచయ్య, కోటయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, దాసరి చినబాబు, ఎన్‌వి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ముమ్మరంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలో ముమ్మరంగా ఆదివారం నాడు గ్రామాల పంచాయతీల ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకట నాయుడు ఆదేశాల మేరకు ఈవోఆర్డీ ఎం.రమణమ్మ పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఇంటింటా పర్యటించి తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా తీసుకొని ట్రాక్టర్లలో పొందుపరిచారు. సంతనూతలపాడు మేజర్ పంచాయతీలో పంచాయతీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్ పర్యవేక్షణలో జూనియర్ అసిస్టెంట్ శిఖామణి, సచివాలయ సిబ్బంది ముమ్మరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్త పొడి చెత్తకు సంబంధించి కరపత్రాలను గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ పట్ల ప్రజలకు తగు సూచనలు ఇచ్చారు. తడి చెత్త పొడిచ ఎత్తను వేర్వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి దీనిని తరలించారు. సంతనూతలపాడు అంబేద్కర్ నగర్ నందు ముమ్మరంగా ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈవోఆర్డీ ఎం.రమణమ్మ దీనిని పర్యవేక్షించారు. చెత్త నుండి సంపద తయారీపై కలిగించారు. మండలంలోని వేములపాడు, సంతనూతలపాడు, గుడిపాడు, మద్దులూరు, గుమ్మలంపాడు, చిలకపాడు తదితర గ్రామాల్లో ఆయా కార్యదర్శిలు పర్యవేక్షణలో ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు.

# గుడిపాడులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పి.గుడిపాడు గ్రామంలో ఆదివారం నాడు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. ఈ చెత్తను వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చి గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే విధంగా స్వచ్ఛ ఆంధ్ర స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.జ్యోతి పర్యవేక్షణలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. గ్రామ నాయకులు శేషిరెడ్డి, బీజేపీ నాయకులు సంకే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయ లక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వరశర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చు మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్పే కాటూరి ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

## మోడల్ స్కూల్‌లో 6 వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

## - ప్రిన్సిపల్ సుధాకర్‌రావు







**రాచర్ల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి రాచర్ల మోడల్ స్కూల్ నందు (ఆదర్శ పాఠశాల) 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ గోల్కొండ సుధాకర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసి, బిసి విద్యార్థులు 150రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75లు ఫీజు చెల్లించి ఈనెల (ఫిబ్రవరి) 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతూ 6వ తరగతికి అర్హత పొంది ఉండాలన్నారు. ఓసి, బిసి విద్యార్థులు 01-09-2013 నుండి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలని అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2011 నుండి 31-08-2015మధ్య జన్మించి ఉండాలని వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రెల్ 20వ తేదీ ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలో స్థానిక పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలో ఓసి, బిసి విద్యార్థులు 35మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30మార్కులు అర్హత మార్కులుగా సాధించాలని ఈ విధానాన్ని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపించిన విద్యార్థుల మార్కుల ఆధారంగా మరియు రిజర్వేషన్లకు లోబడి ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9542878916సెల్ నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

# ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయండి



**మార్కాపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
జిల్లాలోని ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ అన్వర్ భాష కోరారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలోఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డినికలిసి విన్నవించారు . జీవో నెంబరు 117 రద్దు పాటశాలల పున:నిర్మాణంలో భాగంగా ఉర్దూ మీడియం పాఠశాలలను, ఉర్దూ సెక్షన్ పాఠశాలలను ఇంగ్లీష్, తెలుగు మీడియం పాఠశాలల అనుసంధానం లేదా తరలింపు చేయరాదని, ఈ విషయాన్ని రేపటి అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని ఎమ్మెల్యేను కోరారు. ఉర్దూ మీడియం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించాలని, ఉర్దూ బేసిక్ పాఠశాలలను కొనసాగిస్తూ పీపీ వన్, పీపీ టు తరగతులను కూడా ప్రవేశపెట్టాలని, ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్‌లో కొనసాగించాలని, ఖాళీగా ఉన్న ఉర్దూ ఏఎంఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గొర్లగడ్డ కౌన్సిలర్ దొడ్డ భాగ్యలక్ష్మీ, ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షులు ఎం.జాబీర్ హుస్సేన్ బేగ్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్, టీడీపీ నాయకులు గఫార్ ఖాన్ షాకీర్, మాజీ కౌన్సిలర్ బషీరా, పఠాన్ ఖలీలుల్లా ఖాన్, అయూబ్‌ఖాన్, ఉర్దూ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టెలికాం సలహా మండలి సభ్యుడిగా నూరుల్లా నియామకం



**మార్కాపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
టెలికాం సలహా మండలి సభ్యుడిగా మార్కాపురం పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ యువ నాయకుడు, షేక్ నూరుల్లా నియమించబడ్డారు. ఈ మేరకు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా నూరుల్లా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ మైనార్టీ వర్గంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న నూరుల్లా టెలికాం సలహా మండలి సభ్యులుగా ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం సిద్ధాంతపూర్వకంగా క్రియాశీలకంగా పని చేసే ఏ ఒక్క కార్యకర్తలకు కూడా పార్టీ విస్మరించదని తగిన గుర్తింపు ఇచ్చి గౌరవిస్తుందని అన్నారు. నూరుల్లా తండ్రి డాక్టర్ షేక్ మౌలాలి తెలుగుదేశం పార్టీ మార్కాపురం పట్టణ అధ్యక్షులుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని, గుర్తు చేశారు. టెలికం అడ్వైజర్ నెంబర్‌గా ఎంపికైన నూరుల్లా మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవిని ఇచ్చారని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంస్థ అభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు. ప్రోత్సహించి సహకారం అందించిన ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలకు నూరుల్లా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# అర్ధవీడు మండలంలో చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి

## - దగ్గర ఉండి క్లాప్ మిత్రలతో తడి చెత్త, పొడి

## చెత్త వేరు చేయించిన కార్యదర్శి ఏడుకొండలు



**అర్ధవీడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
అర్ధవీడు మండలంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం చెత్త ఏరివేతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన అర్ధవీడు పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి ఏడుకొండలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ చెత్త సేకరణ కార్యక్రమం వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ చెత్తను రోడ్డు పక్కన కాలువలలో వేయకుండా ఇంటి వద్దనే తడి పొడి చెత్తను వేరు చేసుకుని పంచాయతీ నుండి వచ్చే క్లాప్ మిత్రలకు ఇవ్వాలని తెలిపారు. అలా చేస్తే వీధి శుభ్రపడి గ్రామమంతా శుభ్రంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన ప్రకారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర మండలంలోని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు తెలిపారు. అర్ధవీడు మండల ప్రజలందరూ సహకరించి తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి క్లాప్ మిత్రలకు సహకరించాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాప్ మిత్రలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్ర చేస్తున్న శివ స్వాములకు బిక్ష,సామగ్రి అందజేత



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి23,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పుల్లలచెరువు రోడ్డులో గల టిబర్ డిపో నందు శనివారం శివ స్వాములకు బిక్ష ఏర్పాటు చేయడం జరిగింది.శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తున్న శివస్వాములకు పుల్లలచెరువు మాజీ తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షుడు శనగా నారాయణ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాదయాత్ర చేస్తున్న శివస్వాములకు తాను బిక్ష మరియు స్వాములకు అవసరమైన సామగ్రి అందజేయడం జరుగుతుందన్నారు.శనివారం 4వ సంవత్సరం సందర్భంగా పుల్లలచెరువు మండలం కవలకుంట్ల గ్రామం నుండి శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తున్న శివస్వాములకు తన టింబర్ డిపోలో బిక్ష మరియు వారికి కావలసిన సామగ్రిని అందజేయం జరిగిందని నారాయణరెడ్డి తెలిపారు.

# కష్టపడి ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు

*- అంగరంగ వైభవంగా గౌతమి గ్రామర్ స్కూల్ 25వ వార్షికోత్సవం*

*- డీఎస్పీ లక్ష్మీ నారాయణ*

**దర్శి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ అన్నారు. దర్శి పట్టణంలోని గౌతమి గ్రామర్ స్కూల్ 25వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు విద్యార్థులు నృత్యాలు సంస్కృతి కార్యక్రమాలు ఎంతో చక్కగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి యాన్యువల్ డే సందర్భంగా ముఖ్య అతిధిగా దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకి చిన్నప్పటి నుండే మంచి అలవాట్లు తల్లిదండ్రులు నేర్పించాలని అదే విధంగా కష్టపడి చదవాలని విద్యా రంగంలో 25 సంవత్సరాల నుండి విద్యా వ్యవస్థను నడుపుతూ ఎంతో మంది విద్యార్థులని ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా చేసిన గౌతమి గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ పి.రాజకేశవరెడ్డిని డీఎస్పీ అభినందించారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చదువులు







మానేయకుండా తల్లిదండ్రులు కష్టపడి అయినా తమ పిల్లల్ని చదివించుకోవాలన్నారు. విద్యాసంస్థనీ 25 సంవత్సరాల నుండి నెలపటం మంచి పరిణామం మంచి విషయమని గౌతమి గ్రామర్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. అదే విధంగా ఉపాధ్యాయులు మంచి మెలుకువలతో విద్యార్థులకు మంచి నడవడిక నేర్పించాలన్నారు. పిల్లల పట్ల పేరెంట్స్ అప్రమత్తంగా ఉండాలని పేరెంట్స్ ఎంత బిజీగా ఉన్న పిల్లల పట్ల వారి చేష్టల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌ను పిల్లలు మంచికి ఉపయోగించుకోవలెను అని, చెడు పదార్థాలకు మత్తుకు యువత బానిస అవకూడదని, ఆడ పిల్లలకు తక్కువ వయసులో పెళ్లి చేయవద్దని, భాగా చదివించాలని, పిల్లలు చదివి తల్లిదండ్రులకు, సొంత గ్రామానికి దేశానికి మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. అనంతరం ఈ సందర్భంగా డీఎస్పీని స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిధులుగా నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కాలేజీ ఎన్‌సీసీ ఆఫీస్ మేనేజర్ బి.రామకృష్ణ రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం బి.రామకృష్ణరాజుని సన్మానించారు. అదే విధంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గయాజ్‌ని సన్మానించారు. అదే విధంగా దర్శి ఎంఈఓ-2 బి.రమాదేవి మాట్లాడారు. అనంతరం బి.రమాదేవిని స్కూల్ యాజమాన్యం సన్మానించారు. అదే విధంగా సంఘ సేవకులు జీవీ రత్నంని సన్మానించారు. అదే విధంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ తారావాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పాపసాని రాజకేశవరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ రామారావు, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రంధాలయానికి స్టీల్ ర్యాకు, రెండు కుర్చీలు వితరణ

**దర్శి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



దర్శి నగర పంచాయతీ పరిధిలోని శాఖా గ్రంధాలయంలో విజ్ఞాన పుస్తకాలను, వార్త పత్రికలను, మాస పత్రికలను, వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అమర్చుటకు అవసరమైన స్టీలు రాకను ఎల్వఈ రాయుడు దర్శి వాస్తవ్యులు స్టీలు రాకును, రెండు కుర్చీలను తన సొంత నిదుల నుంచి ఖర్చు చేసి గ్రంధ పాలకురాలు విజయకుమారికు ఆదివారం నాడు అందజేశారు. దాత రాయుడు మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞానలయాలు అని గ్రంధాలయాలకు క్రమం తప్పకుండా విద్యార్థులు, నగర ప్రజలు వెళ్లి సమయాన్ని సద్వినియోగపరుచుకొని విజ్ఞానాన్ని పొందాలన్నారు. విద్యార్థులు సెలవు దినాలలో గ్రంధాలయానికి వెళ్లి అనేక కొత్త కొత్త విషయాలను సోదించి తెలుసుకునేందుకు చక్కటి విజ్ఞాన బాండాగారం గ్రంధాలయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ రమణయ్య, శ్రీనివాసరావు, కొండారెడ్డి,వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలను సందర్శించిన ఎంపీడీఓ జనార్ధన్

**ముండ్లమూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలం పరిషత్తు అభివృద్ధి అధికారి కెల్లం పల్లి, నాయుడుపాలెం, ఉమామ హేశ్వరపురం, గ్రామ పంచా యతీలను గార్బేజీ కలెక్షన్ అవేర్నెస్ ఫోగ్రాంలో భాగంగా ఎంపీడీఓ ఆర్.జనార్ధన్ సందర్శించడం జరిగింది. పైన తెలిపిన పంచాయతీల వారు అందరూ వారివారి పరిధిలోని గ్రామాలలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చేయుటలో భాగస్వాములు అవ్వాలి, ప్రతి ఇంటిని సందర్శించాలి, గ్రామస్తులందరికి ఆ గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఉండాలి, దాని నిర్వహణ విధానాన్ని అందరికి తెలియజేయాలి. క్లాప్ మిత్రల వేతనాలు ఇంకా ఎక్కడైనా బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లయితే, వెంటనే వారికి చెల్లింపు చేసేటట్లు తగు చర్యలు గైకొనాల్సిందిగా ఆదేశించారు. ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.

## బడ్జెట్‌లో పంచాయితీరాజ్‌కు కేటాయింపులు పెంచాలి

*- సర్పంచ్‌ల సంఘం డిమాండ్*

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయింపులు పెంచాలని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, నేషనల్ లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను బలోపేతం చేసి జనాభా ప్రాతిపదికగా గ్రామాలకు నిధులలో వాటా ఇవ్వాలన్నారు. పూర్తిస్థాయి నిధుల వినియోగానికి ప్రత్యేక చర్యలు వుండాలని, గ్రామ స్వరాజ్ గ్రామ సాధన దిశగా అడుగులు వేయాలన్నారు.

## హమాలీల సమస్యలపై పోరు బాట

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



సివిల్ సప్లై హమాలీలకు పెంచిన కూలీ రేట్లు గత ఏడాది జనవరి 1 నుండి చెల్లించాలని సివిల్ సప్లై జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కార్యాల యంలో బిండె ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెంచిన మూడు రూపాయల వేతనాన్ని ఇప్పటి దాకా చెల్లించపోవడం హమాలీల పట్ల చిన్న చూపు అని, ఈ నెల 24,25 తేదీలలో తహశీల్దారులకు అర్జీలు ఇచ్చి మార్చి 3న మండల కేంద్రాల లో ధర్నా చేస్తామని,ప్రభుత్వం దిగి రాకుంటే 7న ఛలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు.

## గ్రంధాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



జిల్లా కేంద్ర గ్రంధాలయంలో ఉపగ్రంధ పాలకులు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలచే పుస్తక పఠనం అనంతరం ఉపాధ్యాయులు జాలాది మోహన్ నీతి కథలు బోధించారు. సూపర్ స్టార్ కృష్ణ కళాపరిషత్ తరుపున విద్యార్థులకు డ్రాయింగ్ (క్రేయాన్స్) బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది అనిల్, ఇమానుయేల్,పాఠకులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత మృతి - దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ

**కురిచేడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



కురిచేడు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం గురునాథం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ దిగ్భ్రాంతి గురయ్యారు. గురునాధం మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# వాసవిమాత సేవకు అంకితమవుదాం

*- ఘనంగా నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవం*

*- అధ్యక్షులుగా కోట నరసింహారావు*

**పామూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



ఆర్యవైశ్యకుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సేవకు అంకితమవాలని, ప్రతి కార్యదక్షుడు అమ్మవారి సేవలో తరించాలని ఆర్యవైశ్యకుల ప్రముఖులు కోరారు. శనివారం రాత్రి కన్యకా పరమేశ్వరి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా వందలాది మంది ఆర్యవైశ్యుల దంపతుల నడుమ ఘనంగా నిర్వహించారు. తొలుత నెల్లూరు రోడ్డులో గల సత్యదేవుని దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పాలకమండలితో పాటు ఆర్యవైశ్య ప్రముఖులు మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి కన్యకా పరమేశ్వరి దేవస్థానంకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు విశ్వనాధుని సత్యనారాయణ(మణికంత) మాజీ అధ్యక్షులు ఏల్చూరు బాలకొండలరావు, యువనేత ఉప సర్పంచ్ యాదాల సాయికిరణ్, గోస్టు రామారావు, మంచికంటి సుబ్బారావు, పలువురు ప్రముఖులు సమక్షంలో నూతన అధ్యక్షుడిగా



ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన కోట నరసింహారావుచే ప్రమాణ స్వీకారం గావించారు. అనంతరం కార్యదర్శిగా గాదంశెట్టి వెంకట గురునారాయణ, కోశాధికారిగా దర్శి రాజేష్, ఉప సర్పంచ్‌గా మంచికంటి మధుసూదన్‌రావు, జాయింట్ సెక్రటరీగా కొత్తూరి హరగోపాల్, రాచూరి సాయిబాబా, పరకోటి చంద్రశేఖర్, దర్శి సురేష్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు అమ్మవారి ఆశీస్సులతో ప్రమాణ స్వీకారోత్సవం గావించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నుకోబడిన కోటా నరసింహారావు మాట్లాడుతూ గత పాలకులు అమ్మవారి ఉత్సవాలు, వివిధ కార్యక్రమాలు ప్రతి శుక్రవారం దేవస్థానంలో చేసే కైంకర్యాలు, ఉత్సవాలను, పర్వదినాలను నూతన కార్యవర్గం ద్వారా ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆర్యవైశ్యుల పెద్దలు, గత పాలక వర్గం సభ్యుల సూచనలు, సలహాలతో కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నిత్యం దూపదీప నైవేద్యాలతో పట్టణ నడిబొడ్డున గల వాసవి మాత దేవస్థానానికి నూతన హంగులతో సరికొత్త విధానం రూపొందిస్తామన్నారు. కోట్ల రూపాయల విలువతో నిర్మించిన దేవాలయం ఈ చుట్టు పక్కల ఎంతో కళాత్మకంతో పాటు ప్రతినిత్యం వందలాది మంది భక్తుల సందర్శనకు విచ్చేస్తున్న దేవస్థాన అభివృద్ధిని తమ వంతు బాధ్యతగా స్వీకరిస్తామన్నారు. వాసవిమాత ఆర్యవైశ్యుల దేవత అయినప్పటికి ప్రతి హిందువుకు దక్షణ భాగ్యం ఉంటుందని కోట నరసింహారావు, గురు నారాయణ, దర్శి రాజేష్ తెలిపారు. దసరా, సంక్రాంతి ఉత్సవాలు జిల్లాలోనే అత్యంత వైభవంగా పామూరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న నక్కా ఆనందబాబు, దారపనేని

**కనిగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామ వాస్తవ్యులు మిరియం సుబ్బరాయుడు, వైదేహి దంపతుల కుమారుడు చిరంజీవి వెంకటేష్, కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లె గ్రామ వాస్త వ్యులు చెరుకూరి చెన్నకేశవులు, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె చరితల వివాహ వేడుకలు శనివారం రాత్రి గుంటూరు పట్టణంలోని కొమ్మినేని గార్డెన్స్ నందు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో మాజీ మంత్రి వర్యులు, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో తూర్పు కోడిగుడ్లపాడు, మాజీ సర్పంచ్ దారపనేని జనార్ధన్‌రావు అండ్ బ్రదర్స్ సుధాకర్, కృష్ణ, చిట్టా బత్తిని చిట్టిబాబు, కొప్పల్లి నాగేశ్వరరావు, మాజీ కార్పరేటర్ మద్దిరాల మ్యాని, మిరియం గురవయ్య, నాగినేని రమేష్‌బాబు, మోపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, మిరియం వారి కుటుంబ సభ్యులు, చావ వారి కుటుంబ సభ్యులు, చెరుకూరి వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## అనుమతి లేకుండా తండేల్ సినిమా బెనిఫిట్ షోలు

*- తొక్కిసలాట జరుగుతుందని తల్లిదండ్రుల భయాందోళన*

*- ఆర్‌డీఓకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు*

*- బెనిఫిట్‌షో నిలిపిన తహశీల్దార్ రవికుమార్*

**కనిగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**






కనిగిరి పట్టణంలోని శ్రీనివాస మహల్ థియేటర్లో తండేల్ సినిమా బెనిఫిట్ షోలను అనుమతి లేకుండా ప్రదర్శించడం వివాదానికి దారితీసింది. ఆదివారం నిర్వహించిన ఈ షోలకు అధిక మొత్తంలో టికెట్లు స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు విక్రయించగా విద్యార్థులు భారీ సంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకోవడంతో తొక్కిసలాట జరుగుతుందని తల్లిదండ్రులు భయాందోళనకు గురై ఆగ్రహం వ్యక్తం చేసి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ ఆకుల వెంకట రవిశంకర్‌లకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే స్పందించి సినిమా హాల్ వద్ద పరిశీలన చేపట్టారు. బెనిఫిట్ షోలకు అనుమతి తీసుకోకపోవడం, హాల్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం లేక విద్యార్థులు ఇబ్బంది పడటంతో అధికారులు బెనిఫిట్ షో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ రవిశంకర్, ఆర్ఐ ఎం.సుధాకర్ హాల్‌ను పరిశీలించి, వెంటనే ప్రదర్శన నిలిపివేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ప్రదర్శనలు నిర్వహించిన థియేటర్ యాజమాన్యం, విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఆదేశించారు. అలాగే నిలిపివేసిన షోలకు కొనుగోలు చేసిన టికెట్లకు సంబందించి విద్యార్థులకు రీఫండ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యార్థులను ఇలాంటి వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది.

## కన్నుల పండువగా శేషవాహనంపై రథోత్సవం

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆలయం లో మహాశివరాత్రి ఉత్సవాలు గత నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నాల్గో రోజు ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ, పప్పు శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో కుష్మాండహోమం నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, వేద పారాయణం, లఘు పూర్ణాహుతి అనంతరం గోపూజ నిర్వహించి మహానైవేద్యంను సమర్పించారు. అదే విధంగా సాయంత్రం వేదపారాయణం, దీక్షా హోమములు రాత్రికి శ్రీనారాయణస్వామివారి ఉత్సవమూర్తికి పల్లకిసేవ, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మహావిష్ణుమూర్తి స్వామికి శేష వాహన రథోత్సవం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, కొమ్మినేని వెంకటరావు, ముదుమాల నారాయణరెడ్డి, చావా సుబ్బయ్య, ఉభయదాతలు నన్నసాని గాంధీ, హర్షవర్ధన్, నదిష్య, వెంకట దూర్గ భవాని, పలువురు నాయకులు భక్తులు పాల్గొన్నారు.





# కనిగిరి మోడల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డీఈఓ

*- అనుమతులు లేకుండా విధులకు డుమ్మా కొడుతున్న ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం*

*- మధ్యాహ్న భోజనం బాగుండటం లేదని డీఈఓకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు*

*- పాఠశాలలో జరుగుతున్న పరిణామాలను డీఈఓకు వివరించిన ఎస్ఎంసీ కమిటీ*

**కనిగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



కనిగిరి ఏపీ మోడల్ స్కూల్‌ను ఆదివారం జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రిన్సిపాల్ అనుమతులు లేకుండా విధులకు దుమ్మా కొడుతున్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో జరుగుతున్న పరిణామాలను డీఈఓ దృష్టికి ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పి.మోహన్, మాజీ చైర్మన్ గోపిశెట్టి బాల చెన్నారావులు వినతిపత్రం ద్వారా తెలుసువచ్చారు. డిసెంబర్ నెలలో నూతన ప్రిన్సిపాల్‌గా నియమితులైన పద్మావతి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని అడిగితే



సమావేశాలకు వెళ్తున్నానని చెబుతున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ సక్రమంగా రాకపోవడంతో నాన్ టీచింగ్ స్టాఫ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని డీఈఓకు తెలిపారు. ఇంటర్, పదోతరగతి విద్యార్థులు ఇప్పటికి మూడుదఫాలుగా కొట్లాడుకోవడం జరిగిందని, ఒక విద్యార్థికి చేయి విరగడం జరిగిందని వివరించారు. ఎనిమిదో తరగతి బాలిక వాటర్ బాటిల్‌లో కొద్ది రోజుల క్రితం మగ విద్యార్థులు యూరిన్ పోశారని క్రమశిక్షణ లోపించిందని తెలిపారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు సక్రమంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించడం లేదని తెలిపారు. డీఈఓ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఆగా లేదని డీఈఓకు విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం చూసి డీఈఓ మండిపడ్డారు. వసతి గృహంలో ఈ రోజు మెనూ ఎందుకు అమలు చేయలేదని వార్డెన్, కుకింగ్ వారిని ప్రశ్నించారు. చక్కగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలను అలంకరించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ విధులు నిర్వహణలో అలసత్వంపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఒంగోలు, మార్కాపురం డిప్యూటీ డీఈఓలు ఏ.చంద్రమౌళేశ్వర్, ఆర్.శామ్యూల్ జాన్, ఎంఈఓలు యూవి నారాయణరెడ్డి, జి.సంజీవ్, డి.రామిరెడ్డి, ఆర్.శ్రీనివాసులు, బి.నరసింహారావు, రంగయ్య, ఆర్.కొండారెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్న మస్తాన్ సతీమణి హాజీ ముంతాజ్ బేగం ఘనంగా ప్రధమ వర్ధంతి వేడుకలు

**కనిగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**




కనిగిరి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చిన్న మస్తాన్ సతీమణి హాజీ ముంతాజ్ బేగం ప్రధమ వర్ధంతి వేడుకలు ఆదివారం కుటుంబ సభ్యుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల సమక్షంలో కనిగిరి పట్టణంలోని ముంతాజ్ మహల్ గార్డెన్‌లోని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేసి, ముంతాజ్ బేగం స్మృతిలో దువా చేశారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ముంతాజ్ బేగం నివాసంలో ప్రత్యేకంగా నివాళులర్పించి, ఆమె జ్ఞాపకాన్ని స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమె సమాజానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం భోజన ఏర్పాట్లను ఏర్పాటు చేసి, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో చిన్న మస్తాన్ కుమారులు షేక్ మస్తాన్‌వలి, మస్తాన్ భాష(బుజ్జి బాబు) ,కూతురు బీబీ– అల్లుడు బాబు జువెలరీ అధినేత ఖాదర్ మొహిద్దిన్(బాబు), మనుమలు, మనువరాళ్ళు కుటుంబ సభ్యులతో పాటు రాజకీయ, సామాజిక ప్రముఖులు, స్థానిక ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ శ్రద్ధాంజలి ఘటించారు.

## గ్రంధాలయంలో చదవడం మాకిష్టం

**టంగుటూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని మసీదు సెంటర్ పక్కన ఉన్న గ్రంధాలయంలో ఆదివారం నాడు సెలవు దినం కావడంతో ఎంతో ఇష్టంగా పిల్లలు కథలు పుస్తకాలను విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను చదువుకుంటూ జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. అనేకవిధాలైన పుస్తకాలలో జనరల్ నాలెడ్జ్ ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఎన్నో పుస్తకాలు గ్రంధాలయంలో దొరుకుతాయని గ్రంధాలయ పాఠకులు తెలియజేశారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏది లేదని గ్రంధాలయ నిర్వాహకులు క్రమం తప్పకుండా ఆదివారం నాడు వస్తున్నారని ఇష్టమైన కథల పుస్తకాలు వారికి జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ఎక్కువగా చదువుతున్నారని గ్రంధాలయ అధికారి వర్ధన్ రాజ్ తెలియజేశారు.

## బూడిద దుమ్ములో ఎస్సీ కాలనీ వాసులు

**టంగుటూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని పాకల వెళ్లే రహదారి కొన్ని నెలల క్రితంగా వర్షం పడితే గుంటలమయమవుతుంది. వెంకటయ్యపాలెం రహదారిలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మేర బూడిద గ్రావెల్ తోలారు. పూర్తి స్థాయిలో పని చేయకుండా పొడిని చల్లటం తోటి ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లల్లోకి దుమ్ము రావడంతో అనారోగ్యం పాలవుతున్నారు. కనుక పై అధికారులు స్పందించి దుమ్ము లేకుండా రోడ్డు క్రమబద్ధీకరించి కాలనీ వాసులకు దుమ్ము సమస్యను తీర్చాలని ఎక్కువగా వెళ్లే మార్గం గనుక తొందరంగా పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. అదే విధంగా వెళ్లే వారు వచ్చే వారికి పైన పడటంతో రోగాలు భారిన పడి రోధిస్తున్నారు. అదే విధంగా గ్రామ ఎంపీఈసీ కొమ్ము ప్రభుదాసు అధికారులకు తెలియజేసి పై అధికారులకు తెలియజేస్తామని అన్నారు. అంతే కాకుండా ఎస్సీ కాలనీలో నిర్లక్ష్యం చేస్తున్న పంచాయతీ సిబ్బంది వాహనాలు కనిపించని పొడి చెత్త, తడి చెత్త ఇంటిలోను మగ్గుతున్న పట్టించుకోని పంచాయతీ సిబ్బంది, వాహనాలు కనపడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా న్యూలైఫ్ విద్యార్థుల ప్రార్ధన సమావేశం

**టంగుటూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**





ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం టంగుటూరు గ్రామంలోని పాకల రోడ్డులోని న్యూ లైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిర ప్రాంగణంలో న్యూలైఫ్ విద్యార్థుల ప్రార్ధన సమావేశం న్యూలైఫ్ హోలీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజీ వైద్య నిపుణులు సంహిత విద్యార్థులనుద్దేశించి వారిని ప్రోత్సహిస్తూ సందేశాన్నిచ్చారు. పేస్ కాలేజీ డైరక్టర్ కావ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూలైఫ్ మినిస్ట్రీస్ అధినేత రెవ డాక్టర్ సుదర్శన్‌బాబు, దైవజనురాలు ఎస్తేరు రాణి, అమృత సుదర్శన్, శామ్యేల్, రెసిడెన్షియల్ స్కూల్ టీచర్ శైలజ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిర్చి రైతుల కళ్లలో కారం కొడతారా

*- షేక్ సైదా ఆగ్రహం*

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మిర్చి రైతు కళ్లలో కారం కొట్టి వ్యాపారులు, ఎగుమతులు ధరలకు మేలు చేసే విధంగా ప్రభుత్వ తీరు వుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సైదా ఒక ప్రకటనలో విమర్శించారు. ఎకరా మిర్చి పంట సాగుకు రూ.3 లక్షలకు పైగా వ్యయం అవుతుంటే, ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.11781 మద్దతు ధర నిర్ణయించడం రైతులను దగా చేయడమే అన్నారు. సినిమా టిక్కెట్ ధర పెంచి రోజుకు ఆరు ప్రదర్శనలకు అనుమతించి నిర్మాతలకు మేలు చేస్తున్న ప్రభుత్వం ఆరుగాలం కష్టించి పండించే రైతుల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తున్నదన్నారు. మిర్చి రైతులకు క్వింటా కనీస మద్దతు ధర రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పసుపు బోర్డు మాదిరిగానే మిర్చి బోర్డు, రూ.10వేల కోట్లుతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి మిర్చి రైతులను ఆదుకోవాలన్నారు.

24-2Pg5.qxd:24-2Pg5.qxd 01/01/01 6:59 AM Page 1



# కేన్సర్ కారక ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

## దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

**ఛత్తార్‌పూర్(ఎంపి), ఫిబ్రవరి 23:** ప్రజలు క్యాన్సర్‌కు కారకమయ్యేప సిగరెట్, బీడీ, పొగాకు వంటి దూమపాన ఉత్పత్తులకు దూరంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఛత్తార్‌పూర్‌లో భాగేశ్వర్‌దామ్‌మెడికల్ అండ్‌సైన్స్ రీసెర్చి సెంటర్‌కు శంకుస్థాపనచేసారు. ఈకార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ దేశంతనకు ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని కల్పించిందన్న ప్రధాని సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ మంత్రంపై దృష్టిసారించానన్నారు. యూపిలోని ప్రయాగరాజ్‌లో కొనసాగుతున్న మహాకుంభమేళా దేశ ఐక్యతకు చిహ్నంగా భావితరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. కోట్లాది మంది తరలివస్తున్న మహాకుంభమేళాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ప్రధాని ప్రశంసించారు. దేశ మత సాంస్కృతిక సాంప్రదాయాలను వ్యతిరేకిస్తున్న వారిపై ప్రధానిమోడీ విమర్శలు గుప్పించారు. ఇటీవలి కాలంలో ప్రజల్ని విభజించే నేతల గుంపును చూస్తున్నామని అనేకసార్లు విదేశీ శక్తులుసైతం ఈ వ్యక్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా దేశాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి అన్నారు. హిందూ విశ్వాసాన్ని ద్వేషించే వ్యక్తులు శతాబ్దాలుగా ఏదో ఒకదశలో ఉంటున్నారని, బానిస మనస్తత్వం కలిగిన వ్యక్తులు మన విశ్వాసాలు, నమ్మకాలు, ఆలయాలు,



మతం సంస్కృతి, సూత్రాలపై దాడి కొనసాగిస్తున్నారన్నారు. వీరు మన పండుగలు సాంప్రదాయాలు ఆచారాలను దుర్వినియోగం చేస్తారన్నారు. మన సమాజాన్ని విభజించడం తద్వారా ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే వారి అజెండా అన్నారు. ఇలాంటి సమయంలో ఎంతోకాలంగా దేశంలో ఐక్యతామంత్రి గురించి అవగాహన కల్పిస్తున్న ధీరేంద్రశాస్త్రిప్రజల ప్రయోజనాలకోసం పదెకరాల్లో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించడం గొప్పవిషయం అన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్యాన్సర్ నియంత్రణకు పలు ప్రకటనలు చేసారు. క్యాన్సర్ ఔషధాలు మరింత చౌకగా లభించేలా నిర్ణయం తీసుకున్నామని రాబోయే మూడేళ్లలో దేశవ్యాప్తంగా ప్రతిజిల్లాలో క్యాన్సర్ డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



# ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా అతిశి మోర్లేనా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** ఆప్ నాయకురాలు ఢిల్లీ మాజీ సీఎం అతిషి అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఢిల్లీలో ప్రతిపక్షనేతగా ఒక మహిళనేత ఎన్నిక కావడం ఇదే మొదటిసారి. కీలకపదవిని చేపట్టిన తొలి మహిళానేతగా ఆమె చరిత్రలో నిలిచారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక మహిళా ప్రతిపక్షనేతగా బాధ్యతలు నిర్వహించనున్న అతిశి ఢిల్లీ మహిళా సీఎంతో తలపడుతున్నారు. ఆదివారం నిర్వహించిన ఆప్ శాసనసభా పక్ష సమావేశంలో అతిశిని ప్రతిపక్షనేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కీలకపదవికోసం ఎమ్మెల్యే సంజీవ్‌ఝూ ఆమె పేరును ప్రతిపాదించారు. తనను విశ్వసించినందుకు ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు శాసనసభా పక్షానికి అతిశి కృతజ్ఞతలు తెలిపారు. బలమైన ప్రతిపక్షం ప్ర.జల గొంతుకకు ప్రతీకగా నిలుస్తుందని అతిశి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల మొదటి సెషన్ సోమవారంనుంచి ప్రారంభం కానుంది. మూడురోజులపాటు జరగనున్న సమావేశాల్లో గత ఆప్ ప్రభుత్వ పనితీరుపై కాగ్ నివేదికను సభలోప్రవేశపెట్టనున్నట్లు బిజెపి తెలిపింది. ఫిబ్రవరి ఐదున జరిగిన ఎన్నికల్లో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హస్తిన శాసనసభలో కాషాయజెండా రెపరెపలాడింది. కేజ్రీవాల్‌పై అవినీతి మరకలు, పదేళ్లపాలన నేపథ్యంలో ఆప్‌పై ప్రభుత్వ వ్యతిరేకత అందుకు తోడయ్యాయి. దీనితో ఫలితాల్లో బిజెపి ఏకంగా మూడింట రెండొంతుల మెజార్టీ సాధించింది. 70స్థానాలకుగాను 48 స్థానాలను బిజెపి కైవసంచేసుకోగా ఆప్ 22సీట్లకే పరిమితం అయింది. మెజార్టీ మార్కుకు 14 స్థానాల దూరంలో నిలిచి తన పురిటిగడ్డ అయిన ఢిల్లీలో తొలిసారి ఓటమి ఎదుర్కొంది. గత ఆప్ ప్రభుత్వ పనితీరుపై పెండింగ్‌లో ఉన్న కాగ్ నివేదికలన్నింటినీ అసెంబ్లీలో ప్రవేశపెడతామని అధికార బిజెపి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీనితో ఇపుడు అసెంబ్లీలో ఆప్‌కు విషమ పరిస్థితి ఎదురవుతుందని చెప్పవచ్చు.

### కుంభమేళా యాత్రికులకు ప్రమాదం..

# ముగ్గురు మృతి

**పాట్నా, ఫిబ్రవరి 23:** మరికొన్ని రోజుల్లో మహా కుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో ఇప్పటికే అనేకమంది మేళాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల్లో వస్తున్న వారికి అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న ఓ స్కార్పియో వాహనం వేగంగా వచ్చి ఆగి ఉన్న కంటైనర్ ట్రక్కును ఢీకొట్టింది. దీంతో స్కార్పియోలో ప్రయాణిస్తున్న మహిళతోసహా ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. అదే సమయంలో మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బీహార్ కైమూర్ జిల్లాలోని కుద్రా పోలీసు స్టేషన్ పరిధిలోని చిల్బిలి సమీపంలో చోటుచేసుకుంది. జాతీయ రహదారి 19పై ఆగి ఉన్న కంటైనర్ ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, క్షతగాత్రులందరినీ చికిత్స కోసం కుద్రా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అందరినీ సదర్ హాస్పిటల్ భభువాకు రిఫర్ చేశారు. మృతుల్లో ఒకరిని నారాయణ్ మండల్ భార్య మీరాదేవి(50)గా గుర్తించారు. ఇది లఖిసరాయ్ జిల్లా ఎటాహ్ గ్రామానికి చెందినది. మరో ఇద్దరిని ఇంకా గుర్తించలేదు. గాయపడిన వారిలో ధన్‌బాద్‌లోని సిక్రీ గ్రామానికి చెందిన సుభాష్ కుమార్ భార్య సుస్థిదేవి (55), స్కార్పియో డ్రైవర్ జముయి నివాసి మహ్మద్ కౌశల్ (52), ధన్‌బాద్‌లోని సిక్రీ గ్రామానికి చెందిన రంజిత్ పాశ్వాన్ భార్య సుధాదేవి (35), నారాయణ్‌సరా గ్రామానికి చెందిన నారాయణ్‌సారి గ్రామానికి చెందిన కుమార్తె సోని కుమారి (22) ఉన్నారు. ఈ ఘటన తర్వాత పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

# మహాయుతికి షిండే గుడ్‌బై?

**ముంబయి, ఫిబ్రవరి 23:** అధికారంలో ఉన్న మహాయుతి కూటమిలో విభేదాలు పెరుగుతున్నాయి. కూటమి సభ్యుడు అజిత్‌పవార్ సైలెంట్‌గానే ఉన్నప్పటికీమరో కీలక సభ్యుడు ఏక్‌నాథ్‌షిండే ఆధ్వర్యంలోని శివసేన మాత్రం బిజెపితో దూరం జరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. ప్రత్యేకించి 20 మంది షిండే సేన ఎమ్మెల్యేలకు భద్రత తొలగించినప్పటినుంచి కూడా శివసేన అధినేత షిండే సీఎం ఫడ్నవిస్‌తో కార్యక్రమాలకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనకుసైతం వెళ్లలేదు. దీనితో బిజెపి నాయకత్వంపై షిండే తీవ్ర అసంతృప్తితోఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చలు జోరందుకున్నాయి. రానురాను ఇక ఈ విభేదాలు మరింతపెరిగి షిండే కూటమికి గుడ్‌బై చెపుతారన్న వార్తలు కూడా ప్రచారంలోకి వచ్చాయి. దీనికి తగ్గట్టుగానే నన్ను తేలిగ్గా తీసుకోవద్దు నేనేంచేయగలనో మీరంతా 2022లోనే చూసారు అంటూ షిండేచేసిన ప్రకటన కూడా పెద్దఎత్తున చర్చలకు దారితీసింది. షిండే ప్రకటన మహాయుతి మంచి కోసమేనని చెపుతున్నా ఇదొక హెచ్చరికఅని కూడా షిండే వర్గీయులు చెపుతున్నారు. అలాగే ఇన్‌ఛార్జిమంత్రుల నియామకంలో కూడా షిండే సిఫారసులు, సలహాలను పక్కనపెట్టడంతో షిండే మొత్తంగా అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తాను ప్రతిపాదించిన లడ్కీబెహనా యోజన పథకం వల్లనే మహారాష్ట్రలో బిజెపి విజయం సాధించిందని షిండే వాదిస్తున్నారు. సీఎంపదవి దక్కకపోగా కనీసం తనకు హోంమంత్రి పదవిని కూడా ఇవ్వకపోవడం, తాముకోరిన కీలక కేబినెట్ పదవులు కూడా ఇవ్వకుండా తమ పార్టీని మరింత కించపరు



స్తున్నట్లు చెప్పారు. మరోపక్క షిండేకు అజిత్ పవార్‌కు అంతగా పొసగడంలేదు. తమకు షిండే కంటే ఫడ్నవిస్‌తోనే ఎక్కువ సయోధ్య ఉన్నందున షిండే విభేదించినా తమ పార్టీకి ఎలాంటి నష్టంలేదన్న వాదన వినిపిస్తున్నారు. ఈక్రమంలో షిండే ఇక మహాయుతికి గుడ్‌బై చెపుతారన్న ప్రచారం కూడా మహారాష్ట్ర అధికార రాజకీయాల్లో జోరందుకుంది.

# కపట వైఖరి ప్రదర్శిస్తున్న ప్రపంచ లిబరల్ నేతలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 23:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న లిబరల్స్ కపటతత్వంతో వ్యవహరిస్తున్నారని ట్రంప్ విజయంతో భయాందోళనలకు గురవుతున్నారని ఇటలీ ప్రధాని జార్జియా మెలోని విమర్శించారు. వాషింగ్టన్ డిసిలో కన్సర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్‌ను ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌లను ప్రశంసించారు. తనను భారత ప్రధాని నరేంద్రమోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను సాంప్రదాయవాద నాయకులుగా పేర్కొంటూ తమ ఎదుగుదలను చూసి ఉదారవాదులు తట్టుకోలేకపోతున్నారన్నారు. 90వ దశకంలో బిల్ క్లింటన్, టోనీ బ్లెయిర్ తదితరులు గ్లోబల్ వామపక్ష నెట్‌వర్క్‌ను సృష్టించారని, వారిని రాజనీతిజ్ఞులుగా పరిగణించిన లిబరల్స్ ప్రస్తుతం తమను అంటే మోడీ, మెలోని, ట్రంప్‌లను ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈరకంగా ఉదారవాదులు తమపై ఎంత బురదజల్లినా ప్రజలు వారి అబద్దాలను నమ్మటంలేదని తమనే గెలిపిస్తున్నారని మెలోని అన్నారు. ట్రంప్ అమెరికా అభివృద్ధిపరంగా స్థిరమైన దృక్పథంతో ఉన్నారని బయటనుంచి ఎన్ని వొత్తిల్లు వచ్చినా ప్రపంచదేశాల సాంప్రదాయ వాదులతోకలిసి ముందుకువెళుతున్నారని ప్రశంసించారు. ఈ సదస్సులో పాల్గొనాలని మెలోనీ నిర్ణయించుకోవడంతో ఇటలీలో సంచలనం కలిగించింది. ఆమె దీనికి



దూరంగా ఉండాలని ఆదేశ ప్రతిపక్షనాయకులు డిమాండ్‌చేయడం మరింతప్రాధాన్యతను సంతరించుకుంది. వారి డిమాండ్లను పక్కనపెట్టి మెలోని ఈసదస్సులో వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు.

# వారంలో ప్రభుత్వం కోసం ఏం పనిచేసారు?

## నేటి రాత్రి 11.59 గంటల్లోపు జవాబివ్వాలి

## అమెరికా ప్రభుత్వ ఉద్యోగులకు మస్క్ మెయిల్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 23:** అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ రెండోదఫా పాలనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ కీలకంగామారారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే క్రమంలో దూకుడుగా ఉన్న మస్క్ ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్‌కు చీఫ్‌గా ఉన్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వ ఉద్యోగులకు మరోషాక్ ఇచ్చారు. ఫెడరల్ ఉద్యోగులకు యుఎస్ ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి మెయిల్ పంపించారు. అందులో ఉద్యోగులంతా గతవారం ప్రభుత్వం కోసం తాము ఏం పనిచేసారో వివరించాలని అలా చేయని పక్షంలో వారు తమ పదవులకు రాజీనామా ఇవ్వాలని పోస్టు చేసారు. ఈ మెయిల్‌కు సోమవారంరాత్రి 11.59 గంటల్లోపు ఐదు వాక్యాల్లో ఉద్యోగులు జవాబివ్వాలని ఆదేశించారు. అమెరికాకు చెందిన అతిపెద్ద ఉద్యోగ సంఘం అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాతీయ అధ్యక్షుడు ఎవరెట్ కెల్లీ మాట్లాడుతూ ట్రంప్ తీసుకుంటున్న చర్యలు ఫెడరల్ ఉద్యోగులపట్ల దేశప్రజలకు అందించే క్లిష్టమైన సేవలపట్ల ఆయనకున్న అయిష్టతను సూచిస్తున్నాయన్నారు. ప్రభుత్వం చట్టవిరుద్ధమైన తొలగింపులకు పాల్పడితే వాటిని సవాల్ చేస్తామన్నారు. తన జీవితంలో ఒక్కసారి కూడా నిజాయితీగా ప్రజాసేవచేయని ప్రపంచ కుబేరుడు మస్క్‌తో తమ ఉద్యోగులకు విధులగురించి చెప్పించడం తమను




అగౌరవపరచడమేనని అన్నారు. తమకు వచ్చిన మెయిల్‌కు స్పందించకూడదని ఉద్యోగ సంఘాలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డోజ్ విభాగానికి ప్రత్యేక అధికారాలిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసారు. ఇకపై ఫెడరల్ ఏజెన్సీలు డోజ్ సహకారం సంప్రదింపుల తర్వాతనే ఉద్యోగుల తొలగింపు, నియామకాలపై నిర్ణయం తీసుకోవాలని ఆ ఉత్తర్వుల సారాంశం. ప్రతి ఏజెన్సీ ఉద్యోగుల తగ్గింపునకు ప్రణాళికలు చేపట్టాలని అవసరమైన మేరకు మాత్రమే నియామకాలుచేపట్టాలని అందువలో వివరించారు. అనంతరం మస్క్‌తోపాటు మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు. డోజ్ పనితీరును అధ్యక్షుడు ప్రశంసించారు. దావాలను పట్టించుకోకుండా ముందుకు తీసుకెళ్లాలని టెస్లా సిఇఒకు సూచించారు.

# బంగ్లా-పాక్ మధ్య 1971 తర్వాత తొలిసారి ప్రత్యక్ష వాణిజ్యం

## విదేశాంగ విధానంలో మార్పులు

**ఢాకా, ఫిబ్రవరి 23:** షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్థాన్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. 1971లో పాక్, బంగ్లాదేశ్ విడిపోయిన తర్వాత తొలిసారిగా ప్రత్యక్ష వాణిజ్యాన్ని పునఃప్రారంభించాయి. ప్రభుత్వం ఆమోదించిన మొదటి కార్గో కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి ఢాకాకు



బయలుదేరినట్లు పలు మీడియా వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి ప్రారంభంలో ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ పాకిస్థాన్ (టిసిపి) నుంచి బంగ్లాదేశ్ 50,000 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు అంగీకరించడంతో ఈ ఒప్పందం ఖరారు అయినట్లు తెలుస్తోంది. '1971 తర్వాత మొదటిసారిగా పాకిస్థాన్ నేషనల్ షిప్పింగ్ కార్పొరేషన్ (పిఎన్‌ఎస్‌సి) నౌక బంగ్లాదేశ్ ఓడరేవుకు తమ ప్రభుత్వ సరకును తీసుకెళ్తోంది. ఇది ఇరు దేశాల మధ్య సముద్ర వాణిజ్య సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలు రాయిని సూచిస్తోంది.' అని ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రిక పేర్కొంది. ఈ రవాణా రెండు దశల్లో పూర్తవుతుందని.. ప్రస్తుతం 25 వేల టన్నుల బియ్యం తరలించారని వెల్లడించింది. మరో 25,000 టన్నుల బియ్యం మార్చి ప్రారంభంలో పంపే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గత యేడాది డిసెంబరులో 53 యేళ్లలో తొలిసారి పాక్ నుంచి నేరుగా బంగ్లాకు తొలి కార్గో షిప్ వచ్చినట్లు అప్పట్లో స్థానిక మీడియా కథనాలు వెలువడ్డాయి. పనామా జెండాతో ఉన్న ఆ నౌక 811 కంటైనర్లలో సోడా యాష్, మార్బుల్ బ్లాక్, ముడివస్త్రాలు, చక్కెర, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వంటి వాటిని మోసుకొచ్చిందని వార్తా సంస్థలు వెల్లడించాయి. 1971లో బంగ్లాదేశ్ తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాటి నుంచి ఇరు దేశాల మధ్య ఎటువంటి వాణిజ్య సంబంధాలు లేవు. ఇన్నేళ్ల తర్వాత ఇరు దేశాల మధ్య జరుగుతున్న తాజా వాణిజ్య ఒప్పందాలు రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాల బలోపేతం చేస్తూ.. ప్రత్యక్ష రవాణా మార్గాలను సులభతరం చేయడానికి ఉపయోగపడతున్నట్లు తెలుస్తోంది.

# కనీస మద్దతు ధరలు అమలుకు రూ.30వేల కోట్లు కేటాయించండి

## కేంద్ర మంత్రులతో రైతు సంఘాల నేతలు



**చండీగఢ్, ఫిబ్రవరి 23:** పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత సహా పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వంరైతు సంఘాల నేతలు మధ్య ఆరో విడత చర్చలు సాఫీగా కొనసాగాయి. చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో సాయంత్రం ఆరుగంటలనుంచి రాత్రి 9 గంటలవరకూ కొనసాగిన సమావేశానికి కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రహ్లాద్‌జోషి, పియూష్‌గోయల్‌లు హాజరుకాగారైతుసంఘాల ప్రతినిదలు 28 మంది పాల్గొన్నారు. మంచి వాతావరణంలో చర్చలుజరిగాయని, మార్చి 19న మరోసారి చండీగఢ్‌లోభేటీకావాలని నిర్ణయించామని కేంద్ర వనయవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల అమలుకు నిజంగానే కట్టుబడి ఉంటే ప్రతి ఏటా ఇందుకు రూ.25 వేలకోట్లనుంచి రూ.30వేలకోట్లవరకూ నిధులు కేటాయించడం పెద్ద సమస్యకాదని రైతు నేతలు తెలిపారు. దీనివల్లకలిగే ప్రయోజనాలను వివరించగా సాధికారికమైన గణాంకాలను కేంద్ర ప్రభుత్వం కోరిందని అన్నారు. వారం రోజుల్లో అందిస్తామని తెలిపామన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాలకు చెందిన జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్, స్వరణ్‌సింగ్; కాకాసింగ్ కొట్రా తదితర రైతులనేతలు ఇద్దరు పంజాబ్ రాష్ట్రమంత్రులు చర్చల్లో పాల్గొన్నారు.



# ఆమ్ ఆద్మీపార్టీలో చేరిన పంజాబీ నటి సోనియామాన్

**చండీగఢ్, ఫిబ్రవరి 23:** పంజాబీ నటి సోనియామాన్ ఆమ్ ఆద్మీపార్టీలోచేరింది. కీర్తికిసాన్‌యూనియన్‌నేత బల్దేవ్‌సింగ్‌కుమార్తె అయిన ఆమె ఆదివారం ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సమక్షంలో ఆపార్టీ కండువా కప్పుకుని పార్టీ సభ్యత్వం స్వీకరించింది. ఆప్ పంజాబ్ విభాగం ఆమె చేరికను సోషల్‌మీడియాలో పేర్కొంది. కీర్తి కిసాన్ యూనియన్‌నాయకుడు ఎస్ బల్దేవ్‌సింగ్‌కుమార్తె పంజాబినటి సోనియామాన్ జాతీయ కన్వీనర్ సమక్షంలో ఆప్‌లో చేరారు. ఆమ్ ఆద్మీ పార్టీ కుటుంబంలోకి ఆమెకు స్వాగతం అని చెప్పారు. పంజాబితోపాటు హిందీ మరాఠి, మలయాళం, తెలుగుతో సహా పలుభాషా చిత్రాల్లో సోనియామాన్ నటించింది. ఆమె తొలిచిత్రం హైడ్ అండ్ సీక్. 2014లో కహైన్‌హైమేరా ప్యార్ సినిమాతో హిందీలో తెరంగేట్రం చేసింది. 2020లో హ్యాపీ హార్డీ, హీర్‌చిత్రాల్లో నటించింది. మరోవైపు 2018లో హత్యకు గురయిన పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలతోసహా ప్రసిద్ధ సింగర్స్‌తో కలిసి సోనియామాన్ పనిచేసింది. కిసాన్‌యూనియన్‌నేత అయిన ఆమె తండ్రి బల్దేవ్ సింగ్‌ను 1980లో ఖలిస్తానీ ఉగ్రవాదులు కాల్చి చంపారు.

# చోరీ సొమ్ముతో లాటరీ టికెట్ కొనుగోలు

## రూ.450 కోట్ల జాక్‌పాట్..తీసుకుందామంటే పోలీసుల భయం

**పారిస్, ఫిబ్రవరి 23:** చోరీ చేసిన ఎటిఎం కార్డుతో కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌కు ఏకంగా రూ.450కోట్ల బంపర్ లాటరీ తగిలింది. లాటరీ నిర్వాహకులు విజేతకోసం నిరీక్షిస్తుంటే ఈ సొమ్ము కోసం వెళితే తామెక్కడ దొరికిపోతామోనన్న భయం ఆదొంగలను వెంటాడుతోంది. కార్డు సొంతదారుడు పర్సుపోయిందన్న కేసును ఉపసంహరించుకుంటాను. కార్డు, లాటరీ టికెట్‌తో వస్తే జాక్‌పాట్ సొమ్మును సమానంగా పంచుకుందామంటూ ప్రకటన ఇచ్చారు. జీన్‌డేవిడ్ అనే వ్యక్తి ఇటీవల తన బ్యాగు అందులోని పర్సు పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పర్సులోని క్రెడిట్ డెబిట్ కార్డులను



బ్లాక్ చేసేందుకు బ్యాంకు అధికారులను సంప్రదించగా అప్పటికే వినియోగించినట్లు చెప్పారు. పోలీసుల దర్యాప్తులో కార్డును చివరిగా ఒక షాపులో లాటరీ టికెట్ కొనుగోలుకు ఇద్దరు వ్యక్తులు ఉపయోగించారని తేలింది. ఇపుడు అదే టికెట్‌కు లాటరీ వచ్చింది. అయితే పోలీసులు తమ కోసం గాలిస్తున్నందున లాటరీ సొమ్ము కోసం వెళితే దొరికిపోతామని దొంగలు భయపడుతున్నారు. లాటరీ టికెట్ గడువు సమీపిస్తున్నందున కార్డు సొంతదారు చేసిన రాజీప్రతిపాదనకు దొంగలు అంగీకరిస్తారో లేదో అని వారికి అనుమానం పట్టిపీడిస్తోంది. తీరా వెళ్లాక పోలీసులు పట్టుకుని జైల్లో వేస్తారన్న భయం వెంటాడుతోంది. గడువులోగా ఎవరూ ముందుకు రాకపోతే లాటరీ సొమ్ము ప్రభుత్వానికి చెందుతుందని న్యాయవాది ఒకరు తెలిపారు.

# క్షయకు ఎంఆర్ఎన్ఎ టీకా..

## త్వరలో మనుషులపై ప్రయోగాలు!

**మెల్‌బోర్న్, ఫిబ్రవరి 23:** క్షయ వ్యాధి నివారణకు ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న ఎంఆర్ఎన్ఎ టీకా ప్రయోగాల్లో కీలక ముందడుగు పడింది. శాస్త్రవేత్తలు ఈ టీకాను ఎలుకలపై ప్రయోగించగా సత్ఫలితాలు వచ్చాయి. క్షయకు కారణమైన బ్యాక్టీరియాపై ఈ టీకా సమర్థవంతంగా పోరాడి.. ఎలుకల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించినట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. దీంతో ఈ టీకాను మను





షులపై ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు తొలిసారిగా ఎంఆర్ఎన్ఎ టీకాల అభివృద్ధి జరిగింది. కాగా, ప్రస్తుతం క్షయ రోగులకు బిసిజి టీకాలు ఇస్తున్నారు.

# 32 మంది మత్స్యకారులు, ఐదు పడవలు సీజ్ చేసిన శ్రీలంక



**రామనాథపురం, ఫిబ్రవరి 23:** అంతర్జాతీయ సరిహద్దుజలాలను అతిక్రమించితమ దేశ జలాల్లోకి ప్రవేశించాయని శ్రీలంక నావికాదళం అధికారులు ఐదు యాంత్రిక పడవలను స్వాధీనంచేసుకుని 32 మంది మత్స్యకారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరంతా రామనాథపురం ప్రాంతానికి చెందినవారు. అంతర్జాతీయ మారిటైమ్ బౌండరీలైన్(ఐఎంబిఎల్)ను దాటి తమ జలాల్లోకి వచ్చినట్లు శ్రీలంక నేవీ ప్రకటించింది. వీరి అరెస్టుతో రామనాథపురంలో మత్స్య కారులు తమ నిరవధిక సమ్మెను మరింతగా ఉధృతం చేస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి 2నెల 28వ తేదీనుంచి నిరవధిక సమ్మెను నిర్వహించేందుకు నిర్ణయించారు. మొత్తం 450 వరకూ మెకనైజ్డ్ బోట్లు రామేశ్వరం నుంచి గత శని వారం రాత్రి సముద్రంలోకి వెళ్లాయి. శ్రీలంక నేవి పెట్రోల్ యూనిట్ వాటిని ఛేదించడం ప్రారంభించాయి. ఐఎంబిఎల్‌కు సమీపంలోనే వారు చేపలు పడుతున్నారు. ఐదు పడవలు సముద్రజలాల్లో ఉండటంతో వాటిని పట్టుకుని 32 మందిని అరెస్టు చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. వారందరినీ మన్నార్ ఫిషరీస్ శాఖకు అప్పగించారు. రామనాథపురంలో ఉన్న సీనియర్ అధికారి ఒకరు పడవల యజమానులు ఎఫ్ శేషురాజా, ఎస్ విజయకులం, ఎస్ ఆరో కియ మంత్రో తంగచి మదమ్, ఎం జయప్రకాష్, గోపాల్ మూకై యూర్‌లుగా గుర్తించినట్లు చెప్పారు. గడచిన రెండునెలల్లో మొత్తం 108 మంది మత్స్య కారులను శ్రీలంక నేవీ అరెస్టు చేసింది. మొత్తం 16 పడవలను కూడా సీజ్ చేసినట్లు తేలింది. వీరిలో 11 పడవలను, 66 మంది మత్స్య కారులను ఒక్క ఫిబ్రవరిలోనే అరెస్టు చేసింది. ఇదిలా ఉంటే ఫిషర్‌మెన్ అసోసియేషన్లు కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని శ్రీలంక అదుపులోకి తీసుకున్న మత్స్యకారులు, సీజ్ చేసిన పడవలను విడిపించాలని డిమాండ్ చేస్తున్నాయి. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కేంద్ర మంత్రులను, ప్రధాని మోడీని కోరుతున్నారు.

# కు.ని. వల్లే తమిళనాడుకు తగ్గుతున్న లోక్‌సభ సీట్లు

## సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై, ఫిబ్రవరి 23:** కుటుంబ నియంత్రణ పాటించినందువల్లనే తమిళనాడులో తమకు లోక్‌సభ స్థానాలు తగ్గాయని ముఖ్యమంత్రి స్టాలిన్ సంచలన వ్యాఖ్యలుచేసారు. గతంలోకూడా స్టాలిన్ లోక్‌సభ సీట్లు తగ్గడానికి కలకారణాలను వివరిస్తూ వ్యాఖ్యానించారు. 16 మంది పిల్లలు, 16 రకాల సంపద అంటూ ఒక ఉన్న ఒక సామెతను గుర్తుచేస్తూ స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేసారు. పార్టీలోని సీనియర్‌నాయకుడి ఇంట్లో వివాహానికి హాజరయిన స్టాలిన్ తనను కలిసిన మీడియాతో ముచ్చటించారు. కొలత్తూరు నియోజకవర్గంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా పెళ్లిచేసుకుంటున్న వధూవరులు తమ పిల్లలకు సరైన తమిళపేర్లుపెట్టాలని సూచించారు. ఒక చక్కని ప్రణాళిక కలిగిన కుటుంబం కోసమే కుటుంబనియంత్రణ అమలుకు వచ్చిందని, ఇపుడు ఎంతమంది పిల్లలుండాలన్నది వారే నిర్ణయించుకోవాల్సి వస్తోందన్నారు. అయితే



రాష్ట్రం పరంగా ఈ కుటుంబ నియంత్రణ వల్ల రాష్ట్రంలో పార్లమెంటరీ స్థానాలు గణనీయంగా పడిపోయాయని, రానున్న నియోజకవర్గాల పునర్విభజనలో కూడా దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు తగ్గేప్రమాదం ఉందని ఆయన అన్నారు. తమిళనాడులో 39 లోక్‌సభ స్థానాలున్నాయి. ఎలాంటి తగ్గింపును అయినా సరే తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్టాలిన్ ఈ సందర్భంగా వ్యాఖ్యలు చేసారు.

24-2Pg6exHMNWJQE.qxd:24-2Pg6exHMNWJQE.qxd 01/01/01 9:32 AM Page 1





# చంద్రబాబుకు నెల్లూరులో ఘన స్వాగతం

## బీదా వారి పెళ్లి సందడిలో చంద్రబాబు

## నూతన దంపతులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి

**నెల్లూరు, కలెక్టరేట్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నెల్లూరులో ఘన స్వాగతం లభించింది. ఆయన మధ్యాహ్నం 1.15 నిమిషాలకు నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడు జడ్పి హైస్కూల్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద రాష్ట్ర పురపాలక పట్టనాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ, స్థానిక ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సూళ్ళూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ,డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహాశీన్ స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పట్టాభి రామిరెడ్డి, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎంఎల్ఏ విజయ రామి రెడ్డి జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్,ఎస్పీ కృష్ణ కాంత్, జాయింట్ కలెక్టరు కె. కార్తీక్, టీజీపీ స్పెషల్ కలెక్టర్ శీనా నాయక్, కావలి ఆర్డిఓ వంశీ కృష్ణ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం నెల్లూరు రూరల్ నియోజకవర పరిధిలోని గొలగమూడి రోడ్డులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ శాసన మండలి సభ్యుడునెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కుమారుడు వివాహా వేడుకకి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి 2 గంటల 18 నిమిషాలకు కనుపర్తి పాడు హెలిపాడ్ నుండి బయలు దేరి ఉండవల్లి వెళ్లారు వీడ్కోలు పలికిన వారిలో మునిసిపల్ మంత్రి నారాయణ, ఎంపీలు వేమి రెడ్డి ప్రభాకర రెడ్డి, బీదా మస్తాన్ రావు,ఎంఎల్ఏ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ,ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త పెందుర్తి వెంకటేష్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ,నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు వీడ్కోలు పలికారు.

# కేశోపనిషత్తుకు నిదర్శనం శ్రీకాళహస్తీశ్వరాలయ నిర్మాణం

## చారిత్రక కట్టడాలకు కొలువు శ్రీకాళహస్తీశ్వరాలయం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నాలుగు గోపురాల దృశ్యం,ఆలయంలో శ్రీకృష్ణదేవరాయలు ఏర్పాటు చేసిన ఏకశిలాస్థలంపై నంది విగ్రహం

**శ్రీకాళహస్తి - ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వ రాలయాన్ని దర్శించటానికి దేశవిదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. పురాతనమైన, అపూరవమైన కళాఖండాలను కాపాడటానికి ఎప్పటికప్పుడు పాలకులు ఎంతో కృషిచేస్తున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్యనిర్వహాణాధికారి టి.బాపిరెడ్డి ఇటు శివరాత్రి బ్రహోత్సవాల్ని, మరో వైపు పరిపాలనా సంస్కరణల్ని అమలు మహాశివరాత్రి నిర్వహిస్తున్నారు. సాధారణంగా పురాతనమైన ఆలయాలను పురావస్తు శాఖ స్వాధీనం చేసుకున్నపుడు వాటి ప్రాధాన్యతను వివరిస్తూ శిలాశాసనాలు ఏర్పాటు చేస్తునా న్నరు. అయితే కోట్లు రూపాయలు ఆదాయ వనరులు కల్పిస్తున్న దివ్యక్షేత్రంలో కనీసం గోపురాలకు సంబంధించిన సమాచారం లేకపోవటం గమనించదగ్గ విషయం. ఈ గోపురాన్ని ఎవరునిర్మించారు.ఎప్పుడు నిర్మించారు అనే వివరాలు కూడా లేదు. దాంతో ఇక్కడకువచ్చిన భక్తులు కేవలం 'సర్పదోష నివారణ పూజలకే పరిమిత మౌతున్నారు.

'కేసోపనిషత్తుకు' నిదర్శనంగా,మానవుడు ఆచరించాల్సి న ధర్మాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం జరిగింది.అయితే ఈ చరిత్రను భక్తులకు వివరించే గైడ్స్ కూడా కరువయ్యారు.దాంతో 'సర్పదోష నివారణ' పూజలు మినహా ఇక్కడకు వచ్చిన భక్తులకు ఎలాంటి సమాచారం అందటంలేదు.దాంతో చారిత్రక కట్టడాల ప్రాధాన్యత చెప్పే దిక్కులేదు. ముఖ్యంగా పూర్వం ఆలయానికి భిక్షాలగాలిగోపురం నుంచి ప్రవేశించేవారు.అక్కడ నుంచి బాలజ్ఞానాంబికగోపురం నుంచి ప్రవేశిస్తే ఎన్నో అద్భుతమైన అంశాలు తెలుస్తాయి.అయితే దక్షిణగోపుర ం ప్రవేశం ఏర్పాటు చేసి పలు అంశాలను కనుమరుగు చేశారు.

**ఏక శిలాస్తంభం గురించి తెలిసేదెలా?**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుమారు 40 అడుగుల ఎత్తున ఏకశిలా స్తంభాన్ని 1516 లో విజయయాత్రను సాగిస్తు శ్రీకాళహస్తికి వచ్చిన శ్రీకృష్ణదేవరాయలు తన విజయచిహ్నంగా ఏర్పాటు చేశారు.దానిపై రాతి నంది విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.అలాగే భక్తుల సౌకర్యార్థం ఆయన 16 కాళ్ళమండపానికి సమీపంలో నేడు రాహు-కేతు దోషనివారణ సాధారణ పూజలు జరిపే మండపాన్ని నిర్మించారు.దీనిని నూరుకాళ్ళ మండపం లేదా రాయలవారి మండపం అని పిలిచేవారు.నేడు ఆ పేరు కనుమరుగు అయింది.రాయల వంశంలో చివరి రాజు అచ్యుత దేవరాయులు శ్రీకాళహస్తిలో రాజుగా పట్టాభిషేకం జరిపించుకున్నారు.ఆయన పట్టాభిషేక మహోత్సవం జరుపుకున్న మండపమే కోటా మండపం.అయితే ఈ పేర్లను తారుమారు చేసి నేటి అవసరాలకు దేవస్థానం వాడుకొంటుంది.దాంతో పవిత్రత అట్టకెక్కింది.సుమారు 15 సంవత్సరాల క్రితం ఆలయంలో శిల్పకళ ఎంతో ఆకర్షణీయంగా ఉండేది.ఈ శిల్పాలల్లో నాటి రాజుల చరిత్ర, జీవనవిధానం బావితరాలకు తెలిసేలా ఉండేది. కాని నేడా పరిస్థితి లేదు.ఎక్కడ చూసినా గేట్లు, దార్లులంటూ గందరగోళం సృష్టిస్తున్నారు. ఒకనాడు ఆలయంలో ప్రధానద్వారాల వద్ద నిలబడితే ఎంతో కన్నుల పండుగగా ఉండేది. ఏకశిల విజయస్తంభం,ధ్వజస్తభం చూడటానికి ఉండేది.నేడు ఇక్కడ ఇనుప గ్రిల్స్ వేసి స్తంభాలను బందించినట్లు చేశారు.గతంలో చూడని వారునేడు ఆ భాగ్యం కొల్పాయారు.

**రాయలవారి గోపురం..**

శ్రీకాళహస్తిలో మరో చూడదగ్గగోపురం.పట్టణానికే తలమానీకంగా సుమారు 15 కిలో మీటర్ల వరకు దర్శనమిచ్చే ఈ రాజగోపురాన్ని శ్రీకృష్ణాదేవరాయులు నిర్మించారు.ఈ గోపురం నుంచి శివరాత్రి బ్రహోత్సవాల్లో స్వామిఅమ్మవార్లు వస్తారు.దీనిని నాడు సుమారు 139 అడుగుల ఎత్తుతో నిర్మించారు.దీన్ని నిర్మాణానికి ధర్మరాజుల ఆలయం వద్ద నుంచి రాంప్ వేసినట్లు చెబుతారు.అయితే గోపురం నిర్మాణానికి పనిచేసినా కూలీలు పగలంతాకష్టపడి సాయంత్రం సువర్ణముఖినదిలో మునిగితే వారుపడ్డ కష్టానికి తగినట్టు బంగారం దొరికేదని ప్రశస్తి అలాంటి మహోన్నతమైన కట్టడం 500 సంవత్సరాల పాటు దేదీప్యమానంగా భక్తుల మనోభావాలకు ప్రతీకగా నిలిచి చివరకు కుప్ప కూలింది. దీంతో ఇక్కడ సుమారు రూ.60కోట్లతో నవయుగ కన్‌స్ట్రక్షన్స్ వారు నూతన రాజగోపురాన్ని నిర్మించారు.దీనికి చుట్టు బంధించినట్లు గ్రిల్స్ ఏర్పాటు చేశారు.ఆహ్లాదకర వాతావరణం ఉన్నా చూడటానికి అవకాశం లేకుండా ఉంది.

**శివయ్యగోపురం:** ఆలయంలో బిక్షాలగోపురం నుంచి ప్రవేశించి బాలజ్ఞానాంబిక గోపురం నుంచి లోపలికి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది పాతాళ వినాయకుడు. ఆ ఆలయానికి ఎదురుగా ఉన్న గోపురం శివయ్య గోపురం.ఉత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్లు ఈ గోపురం నుంచి బయటకువెళతారు.

**తిరుమంజనం వారి గోపురం:** ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకొని బయటకు వచ్చే భక్తులకు దర్శనమిచ్చేది తిరుమంజనం వారి గోపురం ఈ గోపురం గుండా స్వామి అమ్మవార్ల సద్యోముక్తి ఉత్సవానికి పవిత్ర సువర్ణముఖి నదివద్దకు వెళతారు.గతంలో ఈ గోపురం పక్కనే ఆలయ జీర్ణోద్ధారణకు కృషిచేసిన నాటుకోటు చెట్టియార్ రామనాధం చెట్టియార్ నిలువెత్తు విగ్రహం ఉండేది.దానినినేడు దక్షిణ గోపురం వద్దకు మార్చారు.

**దక్షిణగోపురం:** నేడు ఇది విఐపిల రహదారిగా మారింది.గతంలో ఆలయానికి అతిధి గృహాలు లేని రోజుల్లోఈ గోపురం పవిత్రకు సూచకంగా ఉండేది. కాని నేడు ఈమార్గం గుండానే విఐపిలు,అధికారులు,పాలకులు వస్తుంటారు. పూర్వం బిక్షాల గోపురం నుంచి వచ్చే విఐపిలు నేడు దక్షిణ గోపురం గుండా ప్రవేశిస్తున్నారు. అయితే ఈ గోపురానికి సంబంధించిన ప్రాశస్త్యంను ఎవరూ పట్టించుకోరు. అవసరమైతే గోపురంలో కూడా దుకాణాలు ఏర్పాటుకు అనుమతిస్తారు.



శ్రీశైల భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దుర్గమ్మ ఆలయ ఇఓ కె రామచంద్రమోహన్

# శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు దుర్గమ్మ తరపున పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ తరపు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టు వస్త్రాలను ఆదివారం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇఓ కె రామచంద్రమోహన్ శ్రీశైలం ఆలయ ఇఓ శ్రీనివాసరావుకు అందించారు. పట్టువస్త్రాలు తీసుకెళ్ళిన ఇఓ, దుర్గమ్మ ఆలయ పండితులకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మంత్రపఠనాలతో స్వాగతం పలికి పట్టువస్త్రాలను అందుకున్నారు. అనంతరం పట్టువస్త్రాలు తెచ్చిన బృందానికి వేదాశీర్వచనం అందించారు.

**వేదోక్తంగా సూర్యోపాసన:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం వేదోక్తంగా సూర్యోపాసన సేవను నిర్వహించారు. కళావేదికపై పండితులు శ్రీ సూర్యనారాయణ మూర్తిని వేంచేపు చేసి అక్కడ ఆదిత్యహృదయం, సూర్యనమస్కారాలు, సూర్యాష్టకం, అరుణపారాయణ వంటి మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈ సూర్యోపాసన సేవలను మాఘమాసంలో ఏకాదశి, ఆదివారం తదితర విశేష దినాల్లో నిర్వహిస్తామని పాల్గొన దలచిన భక్తులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కనకదుర్గమ్మ.ఓఆర్‌జి వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని ఇఓ కె రామచంద్రమోహన్ తెలిపారు.

**మూలానక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి యాగం:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం మూలానక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి యాగాన్ని వేదోక్తంగా నిర్వహించారు. పండితులు మంత్రోచ్ఛారణల నడుమ యాగం నిర్వహించి పూర్ణాహుతులు సమర్పించారు.

# ఏడు వందల సంవత్సరాల చరిత్ర..అగస్తీశ్వరాలయ వైభవం

మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

**తొట్టంబేడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలోని అగస్తీశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఇక్కడి ఆలయంలో ఐదు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సుమారు ఏడువందల సంవత్సరాల క్రితం చోళ రాజులు అగస్తీశ్వరాలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. శ్రీకాళహస్తీశ్వరాల యానికి అనుబంధంగా ఉన్న ఆలయానికి ఇక్కడ జరిగే స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవానికి శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. **స్థల పురాణం:** అగస్త్యమహాముని శివునిపై అలిగి వస్తుండగా మార్గమధ్యంలో పెద్దకన్నలి గ్రామం వద్ద కంటిచూపు పోయింది. తన తప్పును తెలుసుకున్న అగస్త్యముని ఇక్కడే శివుని ప్రతిమను ఏర్పాటు చేసుకుని పూజించాడు. అగస్త్యుని భక్తికి మెచ్చిన పరమేశ్వరుడు కంటి చూపును ప్రసాదించాడు. ఈకారణంగా ఇక్కడి ఆలయానికి అగస్తీశ్వరాలయంగా పేరు స్థిర పడింది. అగస్త్యమునికి కంటిచూపు లభించడం వల్ల తొలుత ఈ గ్రామాన్ని కనులుగా పిలవడం మొదలుపెట్టారు. కాలక్రమేణా కన్నలిగా మారింది. గ్రామం పెద్దది కావడంతో పెద్దకన్నలిగా రూపుదిద్దుకుంది. అలాగే శ్రీకాళహస్తీశ్వరుని త్రిశూలస్నానం అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపున గల అగస్తీశ్వరుని దర్శనం చేసుకుంటే శ్రేయస్కరమణి పురాణాలు ఘోషిస్తున్నాయి. చోళరాజుల కాలంలో నిర్మితమైన అగస్తీశ్వ రాలయం శిల్పసౌందర్యం అబ్బురపరుస్తోంది. ఆలయ లోపలి భాగంలో రాతి బండలమీద చెక్కబడిన వివిధ దేవతామూర్తుల విగ్రహాలతో పాటు రాతిపై చేపబొమ్మలు చెక్కడాలు ఏదో సూచిస్తున్నట్లుగా భావిస్తున్నారు. అయితే ఆచేపల బొమ్మల భావం మాత్రం ఇక్కడెవరికీ తెలికపోవడం గమనార్హం. దక్షిణవైపున ఏర్పాటు చేసిన ముఖద్వారానికి రెండుపక్కల కాపలాగా ద్వారపాలకులు ఉన్నారు. గర్భాలయానికి దక్షిణాన దక్షిణామూర్తి, పడమర బ్రహ్మ, ఉత్తముఖాన దుర్గాదేవి, మహావిష్ణువుల విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. ఆలయానికి తూర్పున గల ధ్వజస్తంభ దర్శనంతో గుడి చుట్టు ప్రదక్షిణం చేసి స్వామివారి సేవలో భక్తులు పాల్గొనడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా మహాశివరాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు.



పెద్దకన్నలి గ్రామంలో వెలసిన అగస్తీశ్వరాలయ దృశ్యం

**ఆలయంలో ఉత్సవాల వివరాలు**

పెద్దకన్నలిలో వెలసి ఉన్న దుర్గాంబికా సమేత అగస్తీశ్వరస్వామి దేవస్థానంలో 25వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 25న మంగళవారం ధ్వజారోహణం, 26న బుధవారం మహాశివరాత్రి రాత్రి 3గం.లకు లింగోద్భవ దర్శనం, 27న గురువారం మూలస్థాన అభిషేకం, 28న శుక్ర వారం ఉదయం అభిషేకం, రాత్రి స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం, మార్చి 1న ధ్వజావరోహణం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

# అంబరాన్ని అంటిన ఐఐటి తిరుత్సవ 2025: ఉర్రూతలూగించిన సంగీత కళాకారులు

## సాంకేతిక,సంస్కృతిల మేళవింపు: డైరెక్టర్





**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలోని ఏర్పేడులో వెలసిన తిరుపతి ఐఐటిలో మూడు రోజుల పాటు తిరుత్సవ-2025 సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థుల్లోని కళలను బహిర్గతం చేయటానికి వారిలో నిగూఢంగా ఉన్న ఆలోచనలకు ప్రతి రూపంగా ప్రదర్శించిన నాటకాలు ఎంతో ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు ఆదో మేళాగా సాగాయి. సంస్కృతి, సాంకేతికతల మేళవింపుగా తిరుత్సవను ఏర్పాటు చేసినట్టు డైరెక్టర్ ప్రొఫేసర్ కె.యస్.సత్యనారాయణ అభివర్ణించారు.టోక్యో కల్చరల్ ఫేస్ట్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో అకట్టుకున్నాయన్నారు. ఎప్పుడూ పుస్తకాలు, చదువలకే కాకుండా సంగీతానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు. విద్యార్థులచే ఐఐటి ఇంటరాక్టివ్ 3డి మ్యాప్ క్యాంపస్ రూపకల్పన చేసినట్లు డైరెక్టర్ వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు ఇక ప్రతి ఏటా మూడు రోజుల పాటు నిర్వహిస్తామని డైరెక్టర్ వివరించారు. వినోదం కోసమే కాక సాంకేతికకు సంబంధించిన విద్యార్థుల ఆలోచనలను బహిర్గతం చేయటానికి ఈ ఉత్సవ్ ఎంతో ఉపయోగపడిందని వివరిం చారు. విద్యార్థులు తమలోని భావాలను అందరితో పంచుకొనుటకు కొత్త విషయాలను నేర్చుకొనుటకు,కొత్త ఆవిష్కరణలకు ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు.స్క్విడ్ గేమ్, వన్ ఆన్ పేరిటజామ్, జర్నిఫర్ రిచెస్, అనలాగ్ మిస్టరి లను ఆవిష్కరించిన విద్యార్థులు ప్రముఖ సినీ సంగీత దర్శకులు,గాయకుడు థమన్ సంగీత విభావరితో సంతోష సంబరాల్లో మునిగి తేలారు. విద్యార్థులు రూపొందించిన రేస్ కార్‌ను తమన్ ప్రారంభించారు.ఆయన ప్రసంగం సంగీత ప్రపంచం గురించి వివరాలను విద్యార్థులు ఆశ్వాదించారు. ఆయన పాడుతుంటే విద్యార్థులు సంతోషంలో మునిగిపోయారు. ఆయనపాటకు కొందరు విద్యార్థులు కాలు కలిపారు. మరి కొందరు కేరింతలతో సంబరాల్లో మునిగి పోయారు. ఇక హరిచరణ్,శిరీష,ఆకాష్తతో పాటు ఇతర కళాకారులవిభావరిలతో పాటు విద్యార్థులు తాము రూపొందించుకున్న నాటికల్లో తమ కళా హృదయాన్నిప్రదర్శించారు. తమ ఆలోచనలను ఆవిష్కరించారు.

**రాబోవు రోజుల్లో దేశంలోని అగ్ర ఐఐటిల సరసన తిరుపతి ఐఐటి:తమన్:** తిరుత్సవ-2025లో ముఖ్యఅతిధిగా హాజరైన సంగీత దర్శకులు ,గాయకులు తమన్ మాట్లాడుతూ తిరుపతి ఐఐటిని చూసిన తరువాత తనకు విద్యార్థి దశ గుర్తుకు వస్తుందని తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.విద్యార్థి దశ కీలకమన్నారు. ఈ దశలో తమలోని ప్రతిభా పాటవాలను వెలికి తీయటానికి వేదిక అన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయటానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చెమటోడ్చి మనల్ని ఉన్నత విద్యకు పంపుతారు. మనంప్రయోజకులమై వారికి అండగా నిలవాలన్నారు.తిరుపతి ఐఐటి చూసిన తరువాత డైరెక్టర్ ప్రొఫేసర్ కె.యస్ సత్యనారాయణకు నమస్కరించాలనిపించిందన్నారు. ఎంతో కృషి చేస్తే తప్ప క్యాంపస్ ఇంత అందంగా రూపొం దించలేరన్నారు. చక్కటి క్యాంపస్ ఆహ్లాదకర వాతావరణం,అంతకన్నా చదువుకోటానికి మంచి క్యాంపస్ అలాగే తమలోని ఆలోచనలను బహిర్గతం చేయటానికి ఇలాంటి కార్యక్రమాలు అమలు చేయటం ఆయనలో మీ అభ్యున్నతికి గల ఆశయాలకు నిదర్శనం అన్నారు.తాను ఇక్కడ గడిపిన నాలుగుగంటలు క్షణాల్లా గడిచిపో యాయన్నారు. ఇక్కడ వాతావరణం గమనిస్తే తిరుత్సవను తిలకించటానికి ఇతర ప్రాంతాల విద్యార్థులకు కూడా అవకాశం కల్పించటం అభినందనీయం అన్నారు.

ప్రస్తుతం తాను ప్రారంభించిన బైక్ ఇంజన్‌తో కారు వారిలోని సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనం అని అభినందించారు.

కాగా సినీనటుడు అవసరాల శ్రీనివాస్ ఆగమనంతో విద్యార్థులు సెల్ఫీలకు అభ్యర్థించారు.డిజె ప్రదర్శనలో రూహాన్ ప్రదర్శనలను విద్యార్థులను కట్టిపడేసింది.



కాణిపాకం దేవస్థానం తరపున పట్టు వస్త్రసాలను సమర్పించేందుకు మహానందిలో ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆలయ ఈఓ దంపతులు, అర్చకులు

# మహానందీశ్వరునికి గణనాధుని పట్టువస్త్రాల సమర్పణ

**కాణిపాకం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా మహానంది శ్రీమహానందీశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోతవ్సాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున స్వామి, అమ్మవార్లకు ఆదివారం పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతిఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ.ఈమేరకు కాణిపాకం ఆలయ ఈఓ ఈఓ పెంచల కిషోర్ దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు మహానందికి చేరుకుని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు శ్రీమహానంది దేవస్థానంకు చేరుకున్న వారికి మహానంది ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మంగళవాయిద్యాల నడుమ నూతన పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి ఆలయంలో అందజేశారు. వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహానంది దేవస్థానం ఏఈఓ మధు, సూపరెండెంట్ శ్రీనివాస్, కాణిపాకం ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, స్థానాచార్యులు పణిస్వామి,ప్రధాన అర్చకులు గణేష్ గురుకుల్‌లతో పాటు వేదపండితులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బిసి సొరంగంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటికి తీసుకురావాలి

## తెలంగాణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు సొరంగ మార్గం ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది క్షేమంగా బయటికి రావాలని ఆకాంక్షిస్తు న్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలు పట్టించుకోకుండా ఉన్న శ్రీశైల సొరంగ మార్గాన్ని.. త్వరత గతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకరమన్నారు. టన్నెల్ పనులు ప్రారంభించే ముందు టన్నెల్ బోర్‌మిషన్ (టీబిఎం) ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిన లాజికల్ సర్వే అధికారులు ఏమరపాటు వలన ఈ ఘటన జరిగి ఉండవచ్చని తెలుస్తుందన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ లోని నీరు టన్నెల్ కాంటూర్ లెవెల్ కంటే ఎక్కువగా ఉండడం వలన 14 కిలోమీటర్ల నుంచి 19.500 కిలోమీటర్లలో ఊట నీరు వస్తుందని.. ఈ ప్రాంతంలో గ్రానైట్, రాతిశిల కంటే మట్టి ప్రాంతం ఎక్కువగా ఉండడం ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. టన్నెల్ లోపల ఎప్పుడు ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచి పనులు నిర్వహించాలని, ఈ ఘటనపై నిపుణుల కమిటీని వేసి విచారణ జరిపించాలని సాంబశివరావు కోరారు.

# కన్నుల పండువగా రథరంగ డోలోత్సవం

**చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో ఆదివారం సాయంత్రం వరకు స్వామివారి రథరంగ డోలోత్సవం (స్వర్ణ రథోత్సవం) కన్నుల పండువగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బాలాజీ రంగాచార్యులు వాహన విశిష్టతను వివరిస్తూ శ్రీవారు శ్రీదేవి (లక్ష్మీదేవి) బంగారు కాగా ఆమెను భరించే స్వామికి బంగారు రథంలో ఊరేగడం ఎంతో ఆనందం. బంగారం శరీరాన్ని తాకుతుంటే శరీరంలో రక్తప్రసరణ సవ్యంగా సాగుతుంది. బంగారం మహాశక్తివంతమైన లోహం. స్వామివారికి కృష్ణావతారంలో దారుకుడు సారధి, కాగా శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలనేవి నాలుగు గుర్రాలు. శ్రీవారి ఇల్లు, ఇల్లాలు, పాత్రలు, సింహాసనము బంగారము. స్వర్ణమంటే ప్రకాశించే గుణం కలది. ఈ స్వర్ణరథంపై ఊరేగడం స్వామి వారికి ఇష్టం. స్వామివారి మహోన్నతినీ, సార్వభౌమత్వాన్ని, శ్రీసతిత్వాన్నీ, భూదేవీనాథత్వాన్నీ సూచిస్తుంది. ఈ స్వర్ణరథోత్సవాన్ని దర్శించడం ద్వారా లక్ష్మీదేవి కరుణతో బంగారు మణులు, సంపదలు, భోగభాగ్యాలు, భూదేవి కరుణతో సమస్తధాన్యాలు, శ్రీవారికృపతో సర్వశుభాలు, సుఖాలు చేకూరతాయని అన్నారు. ఈ రథోత్సవంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ వలిశెట్టి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



**వైభవంగా వసంతోత్సవం:** కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆదివారం మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. వసంతఋతువులో స్వామి వారికి జరిగే ఈ ఉత్సవానికి వసం తోత్సవమని నామమేర్పడింది. బ్రహ్మోత్సవా లలో స్వామి, అమ్మవార్లు వాహనసేవల్లో విహరించి అలసి సొలసి వున్నందున్న చందనంతో కూడిన వివిధ రకాల సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల సుగంధభరిత పుష్పాలను స్వామి అమ్మవార్లకు సమర్పించి, ఫలాలను నివేధించారు.





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

# 28న విజయవాడలో భూసమస్యపై సదస్సును విజయవంతం చేయండి

**విజయవాడ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ఈనెల 28న విజయవాడలో భూమి సమస్యలపై జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టి ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలో ఈమేరకు జరిగిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గనిరాజు తో కలిసి ఆవిష్కరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా తాము భూమి సమస్యలపై చేస్తున్న పోరాటాలను వివరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు కట్టబెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలయినా ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇచ్చే రు.20వేలు ఇవ్వలేదని వాటిని వెంటనే ఇవ్వాలన్నారు. మిర్చి ధరలు విపరీతంగా పడిపోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారని, మిర్చి పంటకు మద్దతు ధర ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు భూమి పంచడానికి ముఖం చాటేసే ప్రభుత్వం రిలయన్స్ కంపెనీకి 5లక్షల ఎకరాలు కేటాయించడంపై మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈనెల 28న జరిగే కార్యక్రమంలో ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు కె రాజమోహన్, ఏఐకెఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి భాస్కర్ తదితరులు పాల్గొంటారన్నారు.

24-2P□g7exHMNWJQE.qxd:24-2P□g7exHMNWJQE.qxd 01/01/01 9:42 AM Page 1



# కేడర్‌లో భరోసా నింపడానికి మీనాక్షీ నటరాజన్ కసరత్తు

## మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జ్‌ల పనితీరుపై ఆరా

## త్వరలోనే బాధ్యతల స్వీకరణ, జిల్లాలవారీగా సమీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 23:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్, మాజీ ఎంపి మీనాక్షి నటరాజన్ త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోపే మూడో ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియమితు లయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం ఏచేసేందుకు తన మార్క్‌ను చూపించ బోతున్నారు. ఈ క్రమంలో ఆమె ముందున్న పలు సవాళ్లను ఎదుర్కొవడానికి వ్యూహాలను రూపొందిస్తు న్నట్టుగా సమాచారం. ఈమేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆమె ఆరా తీసినట్టుగా తెలిసింది. ఎమ్మెల్యేలు, మంత్రులు, కేడర్‌ల మధ్య మనస్పర్ధల గురించి పలువురు సీనియర్‌లను ఆమె అడిగి తెలుసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం చేపట్టాల్సిన వ్యూహాల గురించి ఆమె కసరత్తు చేయనున్నారు. రాహుల్‌గాంధీ టీంలో ముఖ్యమైన నేతగా వ్యవహారిస్తున్న ఆమె ఇప్పటికే రాష్ట్రంలో కీలక నేతల పనితీరుపై దృష్టి పెట్టారు. పలు నియోజకవర్గాల్లో నెలకొన్న విభేదాలను పరిష్కరించడంతో పాటు అందరినీ సమన్వయం చేసుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను విజయతీరాలవైపు తీసుకెళ్లేలా వ్యూహం రూపొందించుకున్నట్లు సమాచారం. కిందిస్థాయి కేడర్‌లో కార్యకర్తలకు భరోసా ఇవ్వడానికి ఆమె ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న దానిపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఎలక్షన్ అబ్జర్వర్‌గా మీనాక్షి నటరాజన్ పనిచేశారు. ఆ సమయంలో పలువురి నేతలను ఆమె దగ్గరి నుంచి పరిశీలించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పార్టీ కేడర్, సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేల గురించి కొంతమేర సమాచారాన్ని ఇప్పటికే ఆమె సేకరించడంతో పాటు వారి పనితీరును కూడా పరిశీలించారు. పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా జనాల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయంతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ, కేడర్‌కు భరోసానివ్వడం తదితర అంశాలపై ఆమె ఫోకస్ పెట్టినట్టుగా సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవడం, రాష్ట్రంలో బిజెపి ఎంపిలు, బిజెపి కేడర్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేలా ఆమె కేడర్‌ను సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టుగా సమాచారం.



ప్రస్తుతం మంత్రులు, ఎమ్మెల్యేలు, క్షేత్రస్థాయి కేడర్ మధ్య కొన్ని చోట్ల సమన్వయం లేదని, కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ ఉందని మీనాక్షి నటరాజన్‌కు స్పష్టమైన సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా జనాల్లోకి తీసుకువెళ్లేందుకు కిందిస్థాయి నాయకులు ఆసక్తి చూపడం లేదు. దీంతో మీనాక్షి నటరాజన్ ముందుగా కిందిస్థాయి కేడర్‌పైనే దృష్టి సారించినట్టుగా తెలుస్తోంది. దీంతోపాటు నామినేటెడ్, పార్టీ పదవులు పంపకం పూర్తిస్థాయిలో జరగలేదు. దానిపై లీడర్లు, కేడర్‌లో ఒకింత అసంతృప్తి వ్యక్తమవుతుంది. గతంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా పనిచేసిన దీపాదాస్ మున్షీ జిల్లాలో నెలకొన్న విభేదాల గురించి పట్టించుకోలేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మీనాక్షి నటరాజన్ మాత్రం జిల్లాల కేడర్‌లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించేలా వారితో మాట్లాడడం, ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా సీనియర్ నాయకులతో సమావేశమై వారిని సమన్వయ పరిచేలా చర్యలు చేపట్టాలని ఢిల్లీ పెద్దల నుంచి దిశానిర్దేశం జరిగినట్లుగా తెలిసింది.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మూడో ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ రావడం విశేషం. 13 సెప్టెంబర్ 2020 నుంచి జనవరి 2023 వరకు మాణిక్యం ఠాగూర్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత 4 జనవరి 2023 నుంచి 24 డిసెంబర్ 2023 వరకు మాణిక్ రావు ఠాక్రే ఇన్ చార్జ్‌గా పనిచేశారు. ఈ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

ఇక డిసెంబర్ 2024 నుంచి 14 ఫిబ్రవరి 2025 వరకు దీపాదాస్ మున్షీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ప్రస్తుతం మీనాక్షి నటరాజన్‌ను ఇన్‌చార్జ్‌గా ఏఐసిసి నియమించింది. ఆమె త్వరలోనే రాష్ట్రానికి వచ్చి బాధ్యతలు తీసుకోనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన తర్వాతే ఆమె రాష్ట్రానికి రానున్నారని సమాచారం.



# భద్రాద్రి విద్యుత్కేంద్ర పనులు శరవేగంగా పూర్తి చేయాలి

## ఉత్పత్తి అంతరాయంపై త్రిసభ్య కమిటీ

## అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవు: డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రజాభవన్లో భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం అభివృద్ధి పురోగతి పనులపై ఆదివారం జెన్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టుకు తీసుకున్న బిహెచ్‌ఎల్ కంపెనీ ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ పెండింగ్ పనులను పూర్తి చేయడానికి నిర్దిష్ట గడువు నిర్దేశించాలన్నారు. రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. పవర్ ప్లాంట్ యూనిట్1 ఉత్పత్తికి సంబంధించి కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులకు గాను టెండర్లు పిలిచినట్లు చెప్పారు. భవిష్యత్‌లో విద్యుత్తు ఉత్పత్తికి ఆటంకం లేకుండా ఉండేందుకు అదనంగా జనరేటర్ ట్రాన్స్ఫార్మర్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రికల్, మెకానికల్‌కు సంబంధించిన అదనపు పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్తు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోతే వాటి పునరుద్ధరణకు కావలసిన చర్యలు తీసుకునేందుకు డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్ అధికారులతో త్రి సభ్య కమిటీ వేయాలని ఆదేశించారు. ఈ కమిటీ సాంకేతిక సమస్యను పరిష్కరించడానికి తీసుకోవలసిన అన్ని చర్యల గురించి నిర్దిష్ట గడువులోగా నివేదికను బోర్డుకు సమర్పించాలన్నారు. తదుపరి బోర్డు నుంచి అనుమతి తీసుకొని విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ పూర్తి చేసి సంస్థకు నష్టం రాకుండా చూడాలన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి పెండింగ్ పనులు, ప్లాంటు పనితీరు, వర్షాకాలంలో బొగ్గు నిల్వ చేయడానికి కావలసిన షెడ్డు నిర్మాణ పనులు, సింగరేణి మైనింగ్ నుంచి బొగ్గు రవాణా నిమిత్తం రైల్వే లైన్ పనులు, సిబ్బంది వసతి గృహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో బొగ్గు తడవకుండా నిల్వ చేయడానికి కావలసిన షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సింగరేణి నుంచి థర్మల్ ప్లాంట్ వరకు 18.67 కిలోమీటర్ల పొడవునా రైల్వే లైన్ నిర్మాణ పనులకు 201.30 ఎకరాలు భూసేకరణ జరుగుతుందన్నారు. రైల్వే లైన్ పనుల్లో వేగం పెంచడానికి ప్రతి వారం సమీక్ష జరపడంతో పాటు క్యాలెండర్ ఫిక్స్ చేసి పనులు చేయించాలని స్పష్టం చేశారు. థర్మల్ కేంద్రం ఉత్పత్తి, పనుల విషయంలో ఆలసత్వం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. విద్యుత్తు ఉత్పత్తికి వస్తున్న బూడిదను వినియోగంలోకి తీసుకురావడానికి ఆలోచన చేస్తున్నట్టు వివరించారు.

**జాబ్ రిక్రూట్‌మెంట్ క్యాలెండర్**

విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా జాబ్ రిక్రూట్మెంట్ క్యాలెండర్‌ను అమలు చేస్తామని విక్రమార్క తెలిపారు. ఎఇ అసోసియేషన్ డిప్యూటీ సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఇచ్చిన పదోన్నతుల గురించి త్వరలోనే ఉత్తర్వులు వచ్చేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగులందరూ రాష్ట్రంలో విద్యుత్ అంతరాయం కలగకుండా కృషి చేయాలని చెప్పారు.

# రాష్ట్రంలో యూరియా కొరత లేదు

## వ్యవసాయ మంత్రి నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరతలేదని, రైతుల ఆందోళన చెందవద్దని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ వారంలో రాష్ట్రానికి మరో 81,800 టన్నుల యూరియా రానుందన్నారు. కేంద్రం నుండి 8.54 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 6.81 లక్షల టన్నులు మాత్రమే వచ్చిందని చెప్పారు. కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నా కేటాయించిన దానిలో 1.60 లక్షల టన్నుల యూరియా తక్కువగా పంపించిందని తెలిపారు. దీంతో ముందుగానే మార్క్‌ఫెడ్ వద్ద ఉంచిన 3.08 లక్షల టన్నులతో అవసరం మేరకు అన్ని జిల్లాలకు సరఫరాచేస్తున్నామన్నారు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర అధికారులు యూరియా వెంటనే సరఫరా చెయ్యాలని విజ్ఞప్తి చేశారని వెల్లడించారు. ఈ యాసంగిలో ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటల విస్తీర్ణంలో 5 నుండి 10 శాతం వరకు వృద్ధి నమోదైందని, దీంతో యూరియా వాడకం కూడా అధికంగా వినియోగించినట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.29 లక్షల టన్నుల యూరియా ఉందని, 81,800 టన్నులు ఈ వారంలో సరఫరా అవుతుందని తెలియజేశారు.

# గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పిఆర్‌టియు టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని పీఆర్‌టీయూ టీఎస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. గత విద్యాసంవత్సరం మాదిరిగా ఉదయం 9 గంటలకు ప్రారంభ మయ్యే విధంగా టైంటేబుల్ మార్చాలని కోరారు.

ఆదివారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి నివాసంలో కలిసి గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్య మంత్రికి వివరించారు. గురుకులాల టైంటేబుల్ మార్పుకు ముఖ్యమంత్రి అంగీకరించారని సంఘం నేతలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత హెల్త్ కార్డులు అందిం చాలని, వీటిని మోడల్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు వర్తింపచేయాలని అదేవిధంగా మోడల్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దుద్వారా వేతనం అందించాలని ముఖ్యమంత్రిని కోరగా .. అందుకు అంగీకరించి వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెఇపారు.


సమగ్రశిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపచేయాలని కోరగా.. బడ్జెట్‌ను సమీక్షించి వచ్చే ఆర్థిక సంవత్సరం అమలు చేస్తామని హామీ ఇచ్చినట్టు దామోదర్ రెడ్డి తెలిపారు. విద్యారంగ సమస్యల పట్ల సాను కూలంగా స్పందించిన ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలిపిన సంఘం నేతలు.. కరీనంగర్ గ్రాడ్యుయేట్ ఎన్నికలలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి కె నరేందర్ రెడ్డికి సంఘం మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

# శివరాత్రి జాతరకు ముస్తాబైన రాజన్న ఆలయం

## రూ. 1.75 కోట్లతో ఏర్పాట్లు

## నాలుగు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

**వేములవాడ, ప్రభాతవార్త:** తెలంగాణలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబ యింది. రంగు రంగుల విద్యుత్ దీపాలతో దీపాల కాంతుల్లో రాజన్న ఆలయం వెలుగులీనుతుంది. ఈ నెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. జాతర ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు దాదాపు 4లక్షలకు పైగా వస్తారని అధికారులు అంఛనా వేస్తున్నారు. శివరాత్రి జాతర ఉత్సవాలను 1.75కోట్లతో ఏర్పాట్లు దాదాపుగా పూర్తికావస్తున్నాయి. ఆలయ గుడి చెరువు ఖాళీ స్థలంలో శివార్చన, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇప్పటికే ఆలయంలో జాతర ఏర్పాట్లు చకచక కొనసాగుతున్నాయి. వేములవాడకు చేరుకునే ఐదు ప్రధాన రహదారుల్లో భక్తులకు స్వాగతం పలికేందుకు భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.



**ఆలయంలో కోడో మొక్కుకు ప్రత్యేక విశిష్టత..**

వేములవాడ రాజన్న ఆలయంలో కోడే మొక్కుకు ప్రత్యేక విశిష్టత ఉంది. సంతానం లేని దంపతులు ఈ ఆలయంలో పిల్లలు పుడితే కోడే మొక్కు చెల్లించుకుంటామని మొక్కుకుంటున్నారు. స్వామివారిని వేడుకున్న వారికి సంతానం కలిగినచో వేములవాడ చేరుకొని కోడె మొక్కులు చెల్లించుకుంటారు. పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకునే భక్తుల సంఖ్య అధికంగానే ఉంటుంది. దేశంలో ఎక్కడా లేని కోడే మొక్కు వేములవాడలో ఉండటం కోడే మొక్కు ప్రత్యేకత సంతరిం చుకుంటుంది.

**ధర్మగుండం ప్రత్యేకత..**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం లోని ధర్మ గుండానికి ప్రత్యేకత ఉంది. నరేంద్ర మహారాజు కుష్టు వ్యాధితో బాధ పడుతుండగా, ఈ క్షేత్రాన్ని సందర్శించి ధర్మగుండంలో స్నాన మాచరించడంతో కుష్ట వ్యాధి నయం అయినట్లు స్థల పురాణం చెబుతోంది. దీర్ఘకాలిక చర్మ వ్యాధులతో బాధ పడే వారు ధర్మగుండంలో స్నానాలు చేస్తే వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం.

# తెలంగాణలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్వర్ణయుగం

## కేంద్రం నుంచి భారీగా నిధులొస్తాయి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వస్తే తెలంగాణ స్వర్ణ తెలంగాణగా మారుతుందని బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభుయలు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తే రాష్ట్రం స్వర్ణ తెలంగాణ అవుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎన్నికల్లో బిజెపి గెలిస్తే కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయన్నారు. ఇటీవల భారత రాజధాని ఢిల్లీ ప్రజలు ఇచ్చిన తీర్పును దేశవ్యాప్తంగా ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే ప్రస్తుతం రాజకీయాల్లో నాయకులతో పాటు, ఓటర్లు నిజాయితీగా ఉండాలన్నారు. ఓటర్లు రాజకీయ పార్టీలు ఇచ్చే చిన్ని చిన్న ప్రలోభాలకు ఓటర్లు లొంగవద్దు అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిలకు బిఆర్ఎస్ మద్దతు ఇవ్వాలి

## బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు లేఖ రాసిన జాజుల

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఆయా స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులకి మద్ధతు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి జాజుల ఆదివారం బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు లేనందున, బీసీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీ అభ్యర్థులకు మద్దతిచ్చి బీసీలపై ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. బీసీ వాదంతో వస్తున్న ఎమ్మెల్సీ కవిత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన వైఖరింటో స్పష్టం చేయాలన్నారు. బీసీలను రాజకీయంగా లబ్ధి కోసం వాడుకోకుండా.. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు పూల రవీందర్, ప్రసన్న హరికృష్ణ, మల్కా కొమురయ్యలకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని బిఆర్ఎస్ పార్టీతోపాటు ఎమ్మెల్సీ కవిత నిరూపించుకోవాలన్నారు. బీసీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతు ఇవ్వకపోతే .. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కును ఆ పార్టీ కోల్పోతుందన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖ సిఆర్‌టిలను మానసికంగా వేధించొద్దు

## ప్రభుత్వానికి టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ల(సీఆర్‌టీ)ను వేధించొద్దని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. సీఆర్‌టీలతో బలవంతంగా అండర్ టేకింగ్ (హామీ పత్రాలను) రాయించుకోవడాన్ని మానుకోవాలని సంఘం రాష్ట్ర అధ్య క్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ డిమాండ్ చేశారు. 2025 మార్చి నెలలో జరుగు 10వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించకపోతే ఉద్యోగం నుండి తొలగించేలా సిఆర్‌టీలతో ఒప్పంద హామీ పత్రాన్ని రాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తుందన్నామన్నారు. 10వ తరగతి కామన్ పరీక్షలు జరిగే ముందు ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, సిఆర్ టీలను మానసికంగా వేధించడం వలన ఫలితాలు రావని.. ఉపాధ్యాయులు ప్రశాంత వాతావ రణంలో పనిచేసేటట్లు అధికారులు ప్రవర్తిం చాలన్నారు.

ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి, భయభ్రాంతులకు గురి చేయటం వల్ల వంద శాతం ఫలితాలు సాధించడం కష్టమన్నారు. 22 సంవత్సరాల నుండి గిరిజన సంక్షేమ శాఖలో నామ మాత్రపు వేతనాలతో పనిచేస్తున్న సిఆర్‌టీలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని.. సర్వీసులు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని గుర్తు చేశారు.

విద్యాబోధనలో అపారమైన అనుభవాన్ని గడించిన సిఆర్‌టీలు అనేక సంవత్సరాలు అద్భుతమైన పనితీరును కనబరుస్తూ .. నూరు శాతం ఫలితాలు సాధించడంలో కీలకపాత్రను పోషిస్తున్నా, వాటిని పరిగణలోనికి తీసుకోకుండా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వటం వలన వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని రవి, వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు.

# గాంధీభవన్‌లో నిరసన చేశాడు.. బోనస్ పొందాడు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** గాంధీభవన్‌లో నిరసన వ్యక్తం చేసిన శాలిగౌరారం మండలం అంబారిపేటకు చెందిన రైతు తోట యాదగిరి ఖాతాలో ఎట్టకేలకు సన్న ధాన్యం బోనస్ డబ్బులు జమయ్యాయి. తనకు రైతు రుణమాఫీ కాలేదని, బోనస్ డబ్బులు కూడా పడలేదని శుక్రవారం యాదగిరి ఏకంగా హైదరాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవన్ మెట్లపై ఆందోళనకు దిగాడు. యాదగిరి ఆవేదన పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. యాదగిరికి రావాల్సిన బోనస్ డబ్బులు శనివారం ఆగమేఘాల మీద ఖాతాలో జమ చేసిందని రైతు తోట యాదగిరి నధ్రువీకరించారు. రుణమాఫీ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని ఆయన ఆదివారం విలేఖరులకు తెలిపారు. బోనస్, రుణమాఫీ ఇంకా రాని రైతులు గాంధీభవన్‌కు వచ్చి ఇదే తరహాలో నిరసనలు చేపడితే కష్టమే? కార్యకర్తలకు పోలీసులకు చేతినిండా పని దొరుకుతుందని వ్యాఖ్యలు వస్తున్నాయి.

# పట్టభద్రుల కోసం విలువైన సేవలు అందిస్తాం

## –కూటమి అభ్యర్థి ఆలపాటి రాజ

**తెనాలి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త) :** ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపే లక్ష్యంతో పనిచేస్తున్న కూటమి నాయకత్వం బలపరిచిన అభ్యర్థిగా తన విజయానికి తోడ్పడాలని తద్వారా పట్టభద్రుల కోసం విలువైన సేవలు అందిస్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బ్రాహ్మణ విద్యావేత్తల సమావేశంలో పేర్కొన్నారు. స్థానిక నాజరుపేటలోని అనుగోలు వారి వీధిలో గల శ్రీ విద్యా శంకర భారతి నృసింహసదనం ప్రాంగణంలో, ఆదివారం సాయంత్రం ఉభయ కృష్ణ, గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ బ్రాహ్మణ విద్యావేత్తల సమావేశం వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షులు అమ్మణి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించగా కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ చారిత్రాత్మక తీర్పు ద్వారా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థిగా తనకు విజయం చేకూర చ్డడం ద్వారా పట్టభద్రుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో సేవలందిస్తానని అన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను బ్రాహ్మణ విద్యావేత్తలు వక్తలుగా తమ ప్రసంగాల్లో వివరించారు. ఈ కార్యక్రమంలో టి.అనంతాచార్యులు, వేమూరి ఆనందసూర్య, భాగవతుల కామేశ్వరరావు, కుందేటి సుబ్రహ్మణ్యం, సీఎంకే తిరుమలరావు, మేళ్ళ చెరువు అనిల్‌కుమార్, దీవి యోగానంద చక్రవర్తి, తదితర బ్రాహ్మణ విద్యావేత్తలు పాల్గొనగా వేదిక్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి, తమిరిస వెంకట రఘు, మాగంటి రత్నాకర శాస్త్రి మిత్ర బృందం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# వరి వేయొద్దంటే.. కాంగ్రెస్ కూడా వద్దు

## కాంగ్రెస్ చేతకానితనం వల్లే పంటలకు నీళ్లు, కరెంట్ ఇవ్వలేని దుస్థితి

## ఉద్యోగులకు 12 లక్షల 75 వేల ఐటి మినహాయింపు ఘనత మోడీసర్కారుదే

## వరంగల్ ఉపాధ్యాయ ఓటర్ల సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్




బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయ ఓటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**హన్మకొండ బ్యూరో. ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో వరి పంట వేయొద్దని కాంగ్రెస్ చెప్పడం విడ్డూరమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. వర్షాలు పుష్కలంగా పడి నదుల్లో నీళ్లున్నా... కాంగ్రెస్ చేతగానితనం వల్ల ఆ నీళ్ల వాడుకోలేక పోయారని మండిపడ్డారు. కృష్ణా నీటిని ఏపీకి కట్ట బెట్టడం వల్ల దక్షిణ తెలంగాణ, కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేయడంవల్ల నీళ్ల లేక ఉత్తర తెలంగాణ ఎడారిగా మారుతోందన్నారు. కాంగ్రెస్ వల్ల నష్టపోతున్న రాష్ట్ర రైతులంతా వరి పంట వేయొద్దని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ తమకొద్దు అని నినదిస్తున్నారని చెప్పారు. మేధావులైన గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లంతా ప్రజలు పడుతున్న బాధలను అర్థం చేసుకుని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ వచ్చిన బండి సంజయ్ బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయ ఓటర్లతో సమావేశమయ్యారు. బీజేపీ బలపర్చిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గంటా రవి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, కొండేటి శ్రీధర్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకక పోటీ నుండి తప్పుకుంది. కాంగ్రెస్‌కు దొరకక బయటి నుండి అరువు తెచ్చుకున్న వ్యక్తిని పోటీలో నిలిపింది. మరో ఇండిపెండెంట్ అభ్యర్థిని కూడా బరిలో దించింది. ఓటేసే ముందు టీచర్లు, ఉద్యోగ, పట్టభద్ర ఓటర్లను కోరేదొక్కటే. గ్రాడ్యుయేట్, టీచర్స్, ఎంప్లాయీస్ పక్షాన శాసనమండలిలో గళం విన్పించడంతో పాటు ఆయా సమస్యలపై పోరాడే పార్టీలను మాత్రమే గెలిపించాలని బీజేపీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలి అని అన్నారు.

ఎండాకాలం ఇంకా స్టార్ట్ కాలేదు. అప్పుడే రెండో పంటకు వరి వేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చెబుతోంది. వరి పంట వేయొద్దంటే మరి ఏ పంట వేయాలి? గంజాయి ఏమైనా పండించాలా?... ఏ పంట వేయాలనే దానిపై ప్రణాళిక ఉందా? అదేమీ లేకుండా వరి వేయొద్దంటే ఎట్లా? అట్లయితే కాంగ్రెస్ పార్టీ కూడా రైతులకొద్దని ఆయన అన్నారు.

అటు నీళ్ల ఇవ్వకుండా పంటలు ఎండబెడుతూ, ఇటు వరి వేయొద్దని చెబుతున్న కాంగ్రెస్ సర్కార్ కు బుద్ది చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. యూరియా అందక ఇబ్బంది పడుతున్నారు. ఇదేందని అడిగితే యూరియా పుష్కలంగా ఉంది సార్ అని అధికారులు చెబుతున్నారు. పుష్కలంగా యూరియా ఉంటే రైతులు క్యూలో నిలబడి, ఆధార్ కార్డులు, చెప్పులు లైన్లో ఉంచుతూ, గంటల తరబడి వేచి చూస్తూ యూరియా స్టాక్ లేదని షాపుల యజమానులు చెబితే వెనుదిరిగి ఎందుకు పోతారు? ఫీజు రీయింబర్స్ మెంట్ అందక కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు గోస పడుతున్నరు అన్నారు. చిన్న చిన్న కాలేజీలు అడుక్కునే పరిస్థితి ఉంది. అప్పులు చేసి విద్యా సంస్థలు నడిపే దుస్తితి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయంబర్స్ మెంట్ మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పిన నాయకులు... అదికారంలోకి రాగానే హామీలకు గాలికొదిలేస్తున్నరు.

ప్రజల కోసం కొట్లాడింది బీజేపీ. లాఠీదెబ్బలు తిన్నది బీజేపీ. రక్తం చిందించి కాళ్లు చేతులు విరగ్గొట్టుకుంది బీజేపీ. ప్రజల కోసం పోరాడిన బీజేపీని కాదని, ఏనాడూ ఒక్క ఉద్యమం కూడా చేయని కాంగ్రెస్ కు ఓటేయడం వల్ల ఏం ఒరిగిందో ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెస్ మోసాలతో అల్లాడుతున్న ప్రజల బాధలను, బీజేపీ కార్యకర్తల పోరాటాలను ఒక్కసారి గుర్తు చేసుకోండి. ఆసరా పెన్షన్ల పెంపు లేదు. రైతు భరోసా లేదు. రుణమాఫీ అరకొరే చేశారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ లేదు. టీచర్ల సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నయ్. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. చాక్ పీసులు కొనడానికి కూడా డబ్బుల్లేవ్. ఆఖరిరి ఉద్యోగులు రిటైర్డ్ అయితే బెన్ ఫిట్స్ ఇవ్వకుండా వేధిస్తోంది. గతేడాది 8 వేల మంది రిటైర్డ్ అయ్యారు. ఈ ఏడాది మరో 10 వేల మంది రిటైర్డ్ కాబోతున్నరు. బెన్ ఫిట్స్ చెల్లించాలంటే 11 వేల కోట్ల రూపాయలు కావాలి. పైసల్లేవంటున్నరు. డబ్బులిచ్చే పరిస్థితి లేక ఉద్యోగుల వయోపరిమితిని 65 ఏళ్ల చేయబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే. ఆయా సమస్యలపై ముందుండి పోరాడే బాధ్యత మేం తీసుకుంటాం అన్నారు.

# వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్‌కు చిరు సన్మానం

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులకు పార్టీలో పలు విభాగాలకు సంబంధించిన పదవులను కల్పించటంపట్ల కృతజ్ఞతలు వ్యక్తంచేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్‌ను జగ్గయ్యపేట నాయకులు చిరు సత్కారంచేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ తదితర పార్టీ నేతలు ఆదివారం విజయవాడలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు అవినాష్‌ను గౌరవ సూచకంగా కలుసుకున్నారు. రాష్ట్ర బిసి ప్రధాన కార్యదర్శిగా బత్తుల రామారావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షునిగా ఏలూరి శివాజీలను నియమించటంపట్ల హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి వింగ్ వైస్‌ప్రెసిడెంట్ దండమూరి రాజేష్, కన్నమాల శామ్యూల్, పట్టణ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్ తదితరులు పల్గొన్నారు.

# కవులకు ఘన సన్మానం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త : మాతృభాషాదినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జగ్గయ్యపేట రచయితల సంఘం (జరసం) ఆధ్వర్యంలో పలువురు కవులను ఘనంగా సన్మానించారు. సభకు జరసం ఉపాధ్యక్షులు, కవి, ఉపాధ్యాకుడు కాలగమనంలో బత్తుల బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. తెలుగు భాషా గొప్పతనం, ఔన్నత్యాన్ని శ్లాఘిస్తూ సభలో కవులు, రచయితలు, విశ్రాంత ఉపాధ్యాయులు అద్భుతంగా ప్రసంగించారు. మాదిరాజు కేశవరావు, అబ్బాస్‌అలీ, సరికొండ నరసింహరాజు, వసతిగృహ నిర్వాహక అధికారి భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఇండియా సూపర్ లీగ్‌లో గోవా ఫుట్‌బాల్ క్లబ్

# 12వ విజయం

## 2-0తో కేరళ బ్లాస్టర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో గోవా ఫుట్‌ల్ క్లబ్ (ఎఫ్సీ) 12వ విజయం నమోదు చేసుకుంది. కేరళ బ్లాస్టర్స్‌తో జరిగిన పోరులో గోవా జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. గోవా జట్టు తరఫున ఇకెర్ గుర్రొటెనె (46వ నిమిషంలో), మొహమ్మద్ యాసిర్ (73వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. హాఫ్‌టైమ్‌లో గోవా జట్టు ప్రత్యర్థి గోల్ పోస్టుపై 6 షాట్లు ఆడగా, కేరళ బ్లాస్టర్స్ ఒకేసారి గోల్ పోస్ట్ పైకి గురి చూసినా అది లక్ష్యాన్ని చేరలేదు. ఈ సీజన్లో ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లు ఆడిన గోవా జట్టు 12 విజయాలు, 3 పరాజయాలు, 6 డ్రాలతో 42 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో రెండో స్థానానికి చేరింది. మరోవైపు కేరళ బ్లాస్టర్స్ 21 మ్యాచ్‌ల్లో 7 విజయాలు, 11 పరాజయాలు, 3 డ్రాలతో 24 పాయింట్లు సాధించి 10వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టు 3-1 గోల్స్ తేడాతో పంజాబ్ ఫుట్బాల్ క్లబ్‌పై గెలుపొందింది. ఈస్ట్ బెంగాల్ తరఫున దిమిత్రోస్ (15వ నిమిషంలో), మహేశ్ సింగ్ (47వ నిమిషంలో), లాల్చుంగుంగా (54వ నిమిషంలో) తలా ఒక గోల్ కొట్టారు. పంజాబ్ తరఫున ఇజెక్వెల్ విడాల్ (62వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. ప్రస్తు ప్రస్తుతం ఈస్ట్ బెంగాల్ జట్టు 24 పాయింట్లతో పట్టిక 9వ స్థానంలో ఉండగా, పంజాబ్ అన్నే పాయింట్లతో 11వ స్థానంలో ఉంది.

ఓపెన్ ఎటిపి టెన్నిస్ ఛాలెంజర్‌లో..

# ఛాంపియన్‌గా భారత్ జోడీ



**న్యూఢిల్లీ:** మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జంట టైటిల్‌ను దక్కించుకుంది. పుణేలో శనివారం జరిగిన ఫైనల్లో జీవన్-విజయ్ జంట 3-6, 6-3, 10-0తో రెండో సీడ్ బ్లేక్ బేల్‌డన్-మాథ్యూ క్రిస్టోఫర్ (ఆస్ట్రేలియా) ద్వయంపై విజయం సాధించింది. జీవన్-విజయ్ జోడీకి సంయుక్తంగా ఇదే తొలి టైటిల్ కాగా, విజయ్ సుందర్ పుణేలో మూడోసారి విజేతగా నిలిచాడు. తొలి సెట్లో పరాజయం పాలైన భారత జంట ఆ తర్వాత ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విజృంభించింది. 2 ఏస్లు సంధించిన జీవన్-విజయ్ జోడీ 3 డబుల్ ఫాల్ట్స్ చేసింది. ఈ విజయంతో రూ.7 లక్షల నగదు బహుమతితో పాటు, 100 ర్యాంకింగ్స్ పాయింట్లు భారత ప్లేయర్ల ఖాతాలో చేరాయి. దీంతో ఏటీపీ ర్యాంకింగ్స్‌లో జీవన్ 94వ స్థానానికి, విజయ్ 104వ ర్యాంక్‌కు చేరనున్నారు.



మహిళల ప్రీమియర్ లీగ్‌లో

# యుపి వారియర్స్ హ్యాట్రిక్

## 33 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఔట్

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)-2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ హ్యాట్రిక్ కొట్టింది. ఢిల్లీపై 33 పరుగుల తేడాతో యూపీ విజయం సాధించింది. గ్రేస్ (2.3-0-15-4)తో పాటు క్రాంతి గౌడ్ (4-0-25-4) కూడా చెలరేగడంతో ఢిల్లీని యూపీ చిత్తు చేసింది. ఈ ఓవర్లో గ్రేస్ తొలి మూడు బంతులకు మూడు వికెట్లు తీసింది. తొలుత నికీ ప్రసాద్, ఆతర్వాత వరుసగా అరుంధతి రెడ్డి, మిన్నూ మణిలను ఔట్ చేసింది. హ్యాట్రిక్‌తో కలిసి గ్రేస్ ఈ మ్యాచ్‌లో 4 వికెట్లు పడగొట్టింది. దీంతో డబ్ల్యూపీఎల్లో హ్యాట్రిక్ సాధించిన మూడో బౌలర్గా గ్రేస్ రికార్డు సృష్టించింది. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ చిన్నెల్ హెన్రీ సుడిగాలి అర్ధ శతకంతో విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. చిన్నెల్ 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 62 పరుగులు చేసి ఔటైంది. హాఫ్ సెంచరీ మార్కును 18 బంతుల్లో చేరుకున్న చిన్నెల్, సోఫీ డంక్లీతో కలిసి లీగ్‌లో జాయింట్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును షేర్ చేసుకుంది. యూపీ ఇన్నింగ్స్‌లో చిన్నెల్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. తహ్లియా మెక్‌గ్రాత్ 24, కిరణ్ నవ్‌గిరే 17, దీప్తిశర్మ 13, శ్వేత సెహ్రావత్ 11, సోఫీ ఎక్లెస్టోన్ 12 పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో జొనాస్సెన్ 4 వికెట్లు పడగొట్టగా, మారిజన్ కాప్, అరుంధతిరెడ్డి తలో 2, శిఖా పాండే ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం 178 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ తడబడింది. జెమీమా రోడ్రిగెజ్ (56) అర్ధ సెంచరీతో రాణించినప్పటికీ, ఆమెకు మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. ఢిల్లీ ఇన్నింగ్స్‌లో జెమీమాతో పాటు షఫాలీ వర్మ (24), నికీ ప్రసాద్ (18), శిఖా పాండే (15 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ప్రస్తుత ఎడిషన్లో యూపీకి ఇదితొలి విజయం. ఆ జట్టు ఇప్పటివరకు ఆడిన 3 మ్యాచ్‌లలో రెండింట ఓడింది.

ఛాంపియన్స్ ట్రోఫీలో..

# లక్కీ టీమ్స్

## ఓసారి కూడా టైటిల్ దక్కని ఇంగ్లండ్

## ఫైనల్స్‌కు చేరినా కప్ నిల్




**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025 రసవత్తరంగా జరుగుతోంది. ఛాంపియన్ అయ్యేందుకు 8 దేశాలు పోటీ పడుతున్నాయి. చివరి సారిగా 2017లో ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. అయితే ఈసారి విజేత ఎవరనే అంచనాలు పక్కన పెడితే, ఒకటి లేదా అంత కంటే ఎక్కువ సార్లు ఫైనల్ చేరిన దాదాపు అన్ని జట్లు ఒకసారైనా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్ నెగ్గాయి. కానీ, ఒక జట్టు మాత్రం రెండుసార్లు ఫైనల్స్‌కి చేరినా కప్పు గెలవలేకపోయింది. రెండుసార్లు కూడా రన్నరప్ తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఎనిమిది జట్లలో నాలుగు జట్లు ఒకటి కంటే ఎక్కువసార్లు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడాయి. భారత్ అత్యధికంగా 4సార్లు ఫైనల్స్ ఆడింది. 2002లో ఫలితం తేలకపోవడం వల్ల శ్రీలంకతో కలిసి సంయుక్త విజేతగా నిలిచింది. 2013లో ఎంఎస్ ధోని నాయకత్వంలో ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఇక 2000లో న్యూజిలాండ్, 2017లో పాకిస్థాన్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇక ఆస్ట్రేలియా రెండుసార్లు ఫైనల్స్‌కు అర్హత సాధించింది. 2006లో వెస్టిండీస్, 2009లో దక్షిణాఫ్రికాని ఓడించి విజేతగా నిలిచింది. సొంతంగా రెండు ట్రోఫీలు గెలిచిన జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది.

అయితే రెండుసార్లు ఫైనల్స్ వరకూ చేరినా, కప్పును ముద్దాడ లేకపోయిన జట్టుగా ఇంగ్లాండ్ అన్ లక్కీ టీమ్‌గా మిగిలిపోయింది. వన్డేల్లో అత్యుత్త జట్లలో ఒకటైన ఇంగ్లాండ్ రెండు ఫైనల్స్ చేరినా ఛాంపియన్‌గా నిలువలేకపోయింది. 2004లో మైఖేల్ వాన్ కెప్టెన్సీలో ఇంగ్లాండ్ తొలిసారి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. ఈ ఫైనల్‌లో వెస్టిండీస్‌తో తలపడింది. ఓ దశలో ఇంగ్లాండ్ గెలిచేలా కనిపించినా, ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో చివరికి వెస్టిండీస్ విజేతగా నిలిచింది. రెండు వికెట్ల తేడాతో గెలిచిన విండీస్ కప్పు ఎగరేసుకు పోయింది. ఇక తొమ్మిదేళ్ల తర్వాత 2013లో ఇంగ్లాండ్ మరోసారి ఫైనల్‌కు అర్హత సాధించింది. స్వదేశంలో జరిగిన ఈ టోర్నీలో అలిస్టర్ కుక్ జట్టుకు నాయకత్వం వహించాడు. టైటిల్ పోరులో భారత్‌తో తల పడింది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. దీంతో 20 ఓవర్ల ఫార్మాట్‌లో మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో భారత్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఇంగ్లాండ్ మరోసారి రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మరి ఈ సారి ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో టైటిల్‌ను ఏ జట్టు సాధిస్తుందనేది ఆసక్తికరమైంది.

# హాకీ ప్రో లీగ్‌లో భారత్ విజయ పరంపర

## ఐర్లాండ్‌పై 4-0తో పురుషుల జట్టు గెలుపు

## 1-0తో జర్మనీపై మహిళల జట్టు విక్టరీ



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొలీగ్-2025లో భారత్ విజయ పరంపర కొనసాగించింది. భారత్ పురుషుల, మహిళల జట్లకు మరో విజయం లభించింది. భువనేశ్వర్‌లో జరిగిన పోరులో పురుషుల టీమిండియా 4-0 గోల్స్ తేడాతో ఐర్లాండ్ జట్టుపై విజయం సాధించింది. అంతకు ముందు 3-1 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌ను ఓడించిన భారత్, వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆధిపత్యం కనబర్చింది. భారత్ తరఫున నీలమ్ సంజీప్ (14వ నిమిషంలో), మన్దీప్ సింగ్ (24వ నిమిషంలో), అభిషేక్ (28వ నిముషంలో) శంషేర్ సింగ్ (34వ నిముషంలో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభంలో చక్కటి ఆటతీరు కనపర్చిన ఐర్లాండ్ 9వ నిముషంలో దక్కిన ఫెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇక అక్కడి నుండి భారత్ జోరు ప్రారంభమైంది. వరుస విరామాల్లో గోల్స్ కొట్టిన భారత్ ఆధిక్యం అంతకంతకూ పెంచుకుంటూ పోయింది. నీలమ్ 14వ నిముషంలో ఫీల్డ్‌గోల్‌తో భారత్ ఖాతా తెరవగా, ఆ తర్వాత మన్‌దీపన, అభిషేక్, శంషేర్ తలా ఒక గోల్ చేశారు. మ్యాచ్‌లో భారత్‌కు మరిన్ని పెనాల్టీ కార్నర్ అవకాశాలు లభించినా, రెగ్యులర్ కెప్టెన్, స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ విశ్రాంతి తీసుకోవడంతో భానతఖ అధిక్యం మరింత పెరగలేదు. చివరి క్వార్టర్లో ప్రత్యర్థి ప్లేయర్లు భారత్ రక్షణ పంక్తిని దాటి ముందుకు సాగలేకపోయారు. తదుపరి మ్యాచ్‌లో భారత్ పురుషుల జట్టు ఈ నెల 24న ఇంగ్లండ్‌తో తలపడనుంది.

**మహిళ విభాగంలో..** మరో వైపు ఈ హాకీ ప్రో లీగ్ మహిళల విభాగంలో భారత జట్టు 1-0 గోల్స్ తేడాతో జర్మనీపై విజయం సాధించింది. అంతకు ముందు జరిగిన తొలి పోరులో 0-4 గోల్స్ తేడాతో జర్మనీ చేతిలో ఓడిన భారత్, తదుపరి రెండో మ్యాచ్‌లో దానికి బదులు తీర్చుకుంది. భారత్ తరఫున స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ దీపిక (12వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది. పెనాల్టీ కార్నర్‌ను సమర్థవంతంగా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపి జట్టుకు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ సాధ్య పడలేదు. ఫలితంగా భారత్ విజయం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత అమ్మాయిల జట్టు మ్యాచ్ ఆడుతుంది.

# వాణిజ్యం

# నగల తయారీలో 22 క్యారెట్ల బంగారమే భేష్!

**ముంబై, ఫిబ్రవరి 23:** నిజమైన, నకిలీ బంగారం మధ్య తేడా గుర్తించడానికి ప్రభుత్వం బంగారు ప్రామాణీకరణను ప్రారంభించింది. దీన్నే మామూలు భాషలో హాల్‌మార్కింగ్ అని కూడా పిలుస్తారు. హాల్‌మార్కింగ్ అనేది ఆభరణాలపై ఉండే స్వచ్ఛతకు హామీని ఇచ్చేముద్ర. ఈ ఆభరణాలు, నాణేలు, బంగారు కడ్డీల స్వచ్ఛతకు హామీ ఇవ్వడానికి అనేక ప్రమాణాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణాలలో 916 బంగారం, 18 క్యారెట్ బంగారం, బీఐఎస్ హాల్‌మార్కింగ్ లాంటివి ఉన్నాయి. అసలు బంగారం స్వచ్ఛత



ను ఎలా లెక్కిస్తారో తెలుసుకోండి.. మీరు బంగారం కొనేందుకు వెళ్లినప్పుడు ఎప్పుడైనా గమనించారా.. ఆ షాపు వారు మీకు ఇది 916 బంగారు స్వచ్ఛత కలిగిన నగలని చెప్తుంటారు. అసలు ఈ 916 అంటే ఏంటి.. మీరు కొనుగోలు చేస్తున్న ఆభరణాలు, నాణెంలో ఎంత బంగారం ఉందో ఈ పదం తెలియజేస్తుంది. ఏదైనా ఆభరణాలను 916గా అమ్మితే అది 91.6శాతం స్వచ్ఛమైన బంగారం అని అర్థం. మిగిలిన వస్తువులు వేరే లోహంతో తయారు చేస్తుంటారు. ఇక్కడ 916 గుర్తు బంగారం స్వచ్ఛతను సూచిస్తుంది. ఈ శాతం ఆభరణాలకు అత్యంత స్వచ్ఛమైనదిగా చెప్పొచ్చు. మరి వంద శాతం బంగారం దొరకదా అని మీకు సందేహం కలగవచ్చు. దొరుకుతుంది కానీ, దాంతో మీరు బంగారు నగలను తయారుచేయలేరు. ఇది చాలా సాఫ్ట్‌గా ఉంటుంది. పెట్టుబడి కోసం బంగారం కొనేవారికి ఇది మంచి ఆప్షన్. కాబట్టి దాంతో ఏదైనా ఆభరణం చేయాలంటే అందులో మరేదైనా లోహాన్ని కలిపి తీరాల్సిందే. అప్పుడే అది నగల తయారీకి అనువుగా మారుతుంది. రాగి, నికెల్, జింక్, పల్లాడియం, వెండి మొదలైన ఇతర లోహాలను బంగారంతో పాటు ఆభరణాల తయారీకి ఉపయోగిస్తారు. 916. 22 క్యారెట్ల బంగారం మధ్య తేడా ఏంటి? నిజానికి 22 క్యారెట్ల బంగారం లేదా 916 బంగారం మధ్య ఎలాంటి తేడా లేదు. రెండూ ఒకటే. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారానికి మిశ్రమలోహాన్ని జత చేస్తుంటారు. ఒక ఆభరణం 100 గ్రాముల బరువు ఉందని అనుకుందాం, అప్పుడు అందులో 91.6గ్రాముల 24క్యారెట్ల బంగారం ఉంటుంది. మిగిలిన భాగం వేరే లోహంతో ఉంటుంది. దీనిని 22/24 అంటారు. 24 క్యారెట్ల బంగారం నుండి 8.4 శాతం తీసివేస్తే, అది 22 క్యారెట్ల బంగారం అవుతుంది. ఇక్కడ 8.4 శాతం చొప్పున ఇతర లోహాలను కలిపి ఆభరణాలను తయారు చేస్తారు. స్వచ్ఛతను ఎలా నిర్ణయిస్తారు? అది 24 క్యారెట్ల బంగారం అయితే 100 గ్రాములలో 99.9 శాతం బంగారం ఉందని అర్థం. 23 క్యారెట్లు ఉంటే 100 గ్రాములలో 95.8గ్రాముల బంగారం ఉంటుంది. అదే 22క్యారెట్లు ఉంటే 91.6శాతం బంగారం ఉంటుంది. అదే విధంగా, 18 క్యారెట్ల బంగారంలో 75 గ్రాముల బంగారం ఉంటుంది. 15 క్యారెట్ల బంగారంలో 58.5 శాతం బంగారంఉంటుంది, ఇది 100గ్రాములకు ఉంటుంది. ఆభరణాల ధర దానిలోని బంగారం మొత్తాన్ని బట్టి నిర్ణయించబడుతుంది.

# మారుతి సుజుకిలోకి భారీగా విదేశీ పెట్టుబడులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** మారుతీ సుజుకి కంపెనీ నుంచి విడుదలయ్యే వాహనాలకు మనదేశంలో మంచి మార్కెట్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా కూడా ఆదరణ లభిస్తోంది. ఆ సంస్థ రాబోయే ఐదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 4.2మిలియన్ల వాహనాలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఉన్న విక్రయాల ప్రకారం లెక్కిస్తే.. అది మూడింట ఒక వంతు పెరుగుదల అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో తన ప్రధాన మార్కెట్ అయిన భారత దేశంలో అమ్మకాలు పెంచుకోవాలని నిర్ణయించుకుంది. సుజుకి సంస్థ తన వ్యాపార విస్తరణలో భాగంగా 2 లక్షల కోట్ల యెన్లు (13 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టనుంది. దీనిలో దాదాపు 60 శాతం మన దేశంలోనే ఇన్వెస్ట్ చేయనుంది. అలాగే మొత్తం విక్రయాలు సుమారు 60 శాతం మన దేశంలోనే జరుగుతాయని అంచనా వేస్తోంది. భారతదేశంలోని మార్కెట్ పైనే ఆధారపడి, తన విక్రయాల లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటోంది. ఇండియాలోని కార్ల మార్కెట్‌లో తన వ్యాపారాన్ని పెంచుకోవడంతో పాటు ఇక్కడి తయారు చేసిన కార్లను ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాల మార్కెట్లకు ఎగుమతి చేయడం సుజుకి కంపెనీ ప్రధాన లక్ష్యం. ఆ కంపెనీ అధ్యక్షుడు తోషిహిరో ఇటీవల జరిగిన సమావేశంలో ఈ విషయానే ప్రముఖంగా వెల్లడించారు. తమకు ఇండియా ప్రధాన మార్కెట్ అని, అక్కడ వ్యాపారాన్ని విస్తరించడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సుజుకి సంస్థ 1980 నుంచే మన దేశంలో పెట్టుబడులు పెడుతోంది. ఈ సంస్థకు సంబంధించిన మారుతీ సుజుకికి దేశ కార్ల మార్కెట్‌లో దాదాపు 40 శాతం వాటా ఉంది. దీని మరో 20 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ప్రస్తుతం ముందుకు వెళుతోంది.



దానిలో భాగంగా 2030 నాటికి మనదేశంలో నాలుగు బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేయాలని భావిస్తోంది. అలాగే 2030 నాటికి కనీసం పదిశాతం నిర్వహణ లాభాలను మార్జిన్ సాధించాలనే లక్ష్యంతో ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 9.20శాతం మాత్రమే నమోదైంది. ఈక్విటీపై వస్తున్న 12.6శాతం రాబడిని 15 శాతానికి పెంచుకోవడానికి చర్యలు తీసుకుంటోంది. మొత్తాన్ని 2030 నాటికి 49 శాతం వృద్ధితో 8 లక్షల కోట్ల యెన్ల ఆదాయం ఆర్జించాలని టార్గెట్ నిర్దేశించుకుంది.

# ఇనాక్టివ్ క్రెడిట్ కార్డుతో ముప్పు ఎక్కువే..

**ముంబై, ఫిబ్రవరి 23:** క్రెడిట్ కార్డ్ అనేది ఇటీవల కాలంలో ఉపయోగకరమైన, వినూత్నమైన ఆర్థిక సాధనంగా మారింది. ముఖ్యంగా కస్టమర్‌లు ఎటువంటి అదనపు ప్రక్రియ లేదా అడ్డంకులు లేకుండా బ్యాంకు నుంచి ముందస్తు క్రెడిట్‌ను పొందేందుకు వీలు కల్పిస్తుంది. రోజువారీ ఖర్చులను నిర్వహించడానికి, క్రెడిట్ హిస్టరీను సృష్టించడానికి, అలాగే రివార్డుల ప్రయోజనాలను పొందడానికి మీకు సహాయపడుతుంది. కొంతమంది తమ క్రెడిట్ కార్డులను చాలా అరుదుగా ఉపయోగిస్తారు లేదా వాటిని అస్సలు ఉపయోగించరు. అలాంటి పరిస్థితిలో ఈ కార్డులు ఇన్‌యాక్టివ్‌గా మారతాయి. దాదాపు ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు కార్డు వాడకపోతే అది ఇనాక్టివ్‌గా మారు తుంది. అయితే ఇన్ యాక్టివ్ క్రెడిట్ కార్డ్ మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల అనుకోని సందర్భాల్లో రుణం పొందడం చాలా కష్టమవుతుంది. ఎక్కువ కాలం నిష్క్రియాత్మకంగా ఉంటే వల్ల బ్యాంకులు ఆటోమెటిక్‌గా మీ క్రెడిట్ కార్డును మూసివేస్తాయి. ఇలాగైతే మీ క్రెడిట్ హిస్టరీ ప్రభావితం చేస్తుంది. అలాగే ప్రతి క్రెడిట్ కార్డ్ లావాదేవీలపై కొన్ని పెర్క్‌లు, రివార్డులను అందిస్తుంది. కార్డు ఇనాక్టివ్‌గా ఉంటే మీరు మీ రివార్డులు మరియు పెర్క్‌లను కోల్పోతారు. కార్డు ఇనాక్టివ్ అయ్యాక క్రెడిట్ కార్డును మూసేసినా కూడా మీ క్రెడిట్ చరిత్రపై ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కార్డును జారీ చేసే బ్యాంకులు మీ కార్డును నిష్క్రియం చేసిన తర్వాత దాన్ని తిరిగి సక్రియం చేయడానికి మీకు కొన్ని రోజుల సమయం ఇస్తాయి. ఆ సమయంలో కచ్చితంగా



కార్డును యాక్టివ్ చేసుకోవాలని వివరిస్తున్నారు. ఇనాక్టివ్ క్రెడిట్ కార్డు ఖాతాలను బ్యాంకులు ప్రత్యేక లెడ్జర్లలో ఉంచుతాయి. క్రెడిట్ కార్డుల ద్వారా చేసే మోసాలను తగ్గించడానికి ఇలాంటి చర్యలు తీసుకుంటారు. ఇనాక్టివ్ అయిన క్రెడిట్ కార్డును తిరిగి యాక్టివ్ చేయాలంటే కచ్చితంగా మీరు సమీపంలోని బ్యాంక్ బ్రాంచ్ లేదా ఆన్‌లైన్ సర్వీస్ పోర్టల్‌ను సందర్శించవచ్చు. కొన్ని బ్యాంకులకు గుర్తింపు ధ్రువీకరణ లేదా అప్‌డేటెడ్ కేవైసీ వివరాలను తీసుకుని కార్డును యాక్టివ్ చేస్తాయి.

# 'ఇవి' పరికరాల తయారీలోకి కొత్త కంపెనీ

**ముంబై, ఫిబ్రవరి 23:** దేశంలో ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే అనేక కంపెనీలు 'ఇవి' పరిశ్రమలో ప్రవేశించాయి. ముఖ్యంగా విడి భాగాల తయారీలో ఎప్పటికప్పుడు కొత్త కంపెనీలు వస్తున్నాయి. తాజాగా 'ఇవి' బ్యాటరీ తయారీ రంగంలోకి కొత్త కంపెనీ అడుగుపెట్టింది. సాంప్రదాయ వాహణాల విడిభాగాలను తయారు చేసే కినెటిక్ గ్రూప్ 'ఇవి' విభాగంలో బ్యాటరీలను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. దీనికోసం మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో రూ.50కోట్ల పెట్టుబడులతో కొత్త బ్యాటరీ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటులో కంపెనీ యేటా 60వేల యూనిట్ల రేంజ్-ఎక్స్ బ్రాండ్ బ్యాటరీలను తయారు చేయనుంది. ఈ బ్యాటరీలు టూవీలర్, త్రీవీల 'ఇవి' వాహనాల్లో ఉపయోగిస్తారు. లిథియన్ ఐరన్ ఫాస్ఫేట్(ఎల్ఎఫ్‌పి), నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్ఎంసి) బ్యాటరీలను తయారు చేయనున్నట్లు కంపెనీ అధికారిక ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా త్రీవీలర్ల కోసం తయారుచేసే ప్రిస్మాటిక్ సెల్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టిసారించనున్నట్లు కంపెనీ వైస్-చైర్మన్, ఎండి అజింక్యా ఫిరోదియా చెప్పారు. తాము బ్యాటరీ టెక్నాలజీలో భద్రత, స్థిరమైన ఉత్పత్తులను రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆటోమేషన్, స్మార్ట్ టెక్నాలజీ ద్వారా విశ్వసమైన, సమర్థవంతమైన ఎనర్జీ ఉత్పత్తులను అందించనున్నట్లు పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం భారతీయ 'ఇవి' మార్కెట్ 28.52 శాతం వార్షిక వృద్ధితో 2029 నాటికి రూ.1.60 లక్షల కోట్లకు చేరుకోనుంది.




# లోన్ యాప్‌లతో పెరుగుతున్న చీటింగ్

**ముంబై, ఫిబ్రవరి 23:** భారీగా పెరిగిన ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లలో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోవడం కష్టంగా మారింది. అయితే కొన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తే ఫేక్ యాప్‌లకు దూరంగా ఉండవచ్చు. సైబర్ నేరగాళ్లు అనేక నకిలీ యాప్‌ల ద్వారా రుణాల పేరుతో ఆకర్షిస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్రకటనలు, ఫోన్ కాల్స్ ద్వారా సంప్రదింపులు జరుపుతున్నారు త్వరిత ఆమోదం, తక్కువ వడ్డీ రేట్ల పేరుతో వల వేస్తున్నారు. రుణం ఆమోదం కోసం ముందుగా కొంత చెల్లించాలని చెప్పి, డబ్బులు దోచుకుంటున్నారు. లేకపోతే వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తున్నారు. నకిలీ రుణాల పేరుతో వల వేస్తున్న సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ కోసం కొన్ని విషయాలను గమనించాలి. తద్వారా అప్రమత్తంగా ఉండటానికి అవకాశం కలుగుతుంది. రుణాన్ని ఆమోదించడానికి ముందస్తుగా కొంత సొమ్ము కట్టాలని అడిగితే నమ్మకండి. వారు నకిలీ రుణదాతలు కావచ్చు. నిజమైన లెండర్లు రుణ ఆమోదం తర్వాత ఆ మొత్తం నుంచి రుసుమును మినహాయించుకుంటారు. నిజమైన రుణదాతలు తమ భౌతిక కార్యాలయం, స్పష్టమైన సంప్రదింపు వివరాలను కలిగి ఉంటారు. రుణదాత వెబ్‌సైట్‌లో ఈ సమాచారం లేకపోతే జాగ్రత్తగా ఉండండి. అతి తక్కువ వడ్డీరేటు, అత్యంత వేగంగా రుణాన్ని ఆమోదిస్తామని చెబితే ఒక్కసారి ఆలోచించండి. బ్యాంకులు, మిగిలిన ఆర్థిక సంస్థల వడ్డీరేట్లను సరి పోల్చుకోండి. రుణ నిబంధనలను జాగ్రత్తగా చదవండి. ఏదైనా అస్పష్టంగా ఉంటే అది మోసానికి సంకేతంగా భావించొచ్చు.



టువంటి క్రెడిట్ మూల్యాంకనం లేకుండా రుణాన్ని అందిస్తామంటే నమ్మవద్దు. తరచూ సిబిల్, సీఆర్ఐఎఫ్ హైమార్క్, ఎక్స్పీరియన్, ఈక్విఫాక్స్ తదితర వాటిలో క్రెడిట్ స్కోర్ నివేదికను తనిఖీ చేసుకోండి. వాటిలో ఏవైనా రుణాలు లేదా క్రెడిట్ ఖాతాలను మీ పేరు ఉంటే గమనించండి. మీ బ్యాంక్ స్టేట్‌మెంట్లను తరచూ పర్యవేక్షించాలి. మీ పేరు మీద మోసపూరితంగా రుణం తీసుకున్నట్లు గుర్తిస్తే, మీ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయండి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps